
ధ్రపత్రిక సచిత్ర వార పత్రి



4 అణాలు
5-1-55

RA PATRIKA ILLUSTRATED WEEKLY



శ్రీ అమర్‌నాథ్ గుహాద్వారం (కాశ్మీర్)

—ఫొటో : ఆర్. బుచ్చి వీరయ్య, సికిం

సంవత్సర చందా
రు. 12_0_0
విడిప్రతికి 4 అ.


ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder K. NAGESWARA RAO

సంపుటము 48
సంచిక 19
5-1-55

జయ పుష్య శుద్ధ ద్వాదశి బుధవారం



బస్తీ బ్రతుకు

—ఓ. సీతారాం.

బారిష్టరు గారి బాతాఖానీ

మొక్కపాటి నరసింహశాస్త్రి

అంధత్వం: పదహారణాల ఆంధ్రుడు

నేను మామూలుగా సాయంకాలం అయిదు కావడంతోటే క్లబ్బుకు బయలుదేరి వెళ్లాను. వేపచెట్టుకింద కుర్చీలు వగైరాలన్నీ అప్పటికే అమర్చబడి ఉన్నాయి. అప్పటికప్పుడే టెన్నీసు కోర్టులో బంతు లెగురుతున్నాయి. పేకాట ప్రభువులింకా ఎవ్వరూ రాలేదు. కేరమ్సు బల్ల నిర్జీవంగా ఉంది. చదరంగంబల్ల మొన్నటి గందరగోళంతో వాడిలిపోతూ ఓమూలగా ఒదిగి ఉంది. పత్రికల బల్లదగ్గర మామూలు పెద్ద లిద్దరూ ఏకధ్యానంతో చెరోకపత్రికా పారాయణ చేస్తున్నారు. వాళ్లచేతుల్లోనుంచి ఎప్పుడేనా పత్రికలు ప్రాణంతో బయటపడతాయేమో, ప్రధాన వాంశాలేనా ఒక్కసారి చూచిపోదామని ఇద్దరు యువకులు ప్రాణాలు బిగపట్టుకు కూర్చున్నారు.

అలవాటుచొప్పున నేను వేపచెట్టుకింద కుర్చీలో చతికిలపడ్డాను. ఏమీ తోచలేదు. కుర్రవాడినిపిలిచి పేక తీసుకురమ్మని ఏకాకిగా, ఏకాంతంగా 'పేషన్సు' ఆడడం మొదలుపెట్టాను. ఒక్క ఆటేనా పూర్తి కాకుండానే విఘ్నం వచ్చింది. స్వగృహంలో స్వగదిలోనో, ఏదో ఆశ్రమంలోనో చెయ్యవలసినపని క్లబ్బులో తలపెట్టడం తప్పేననుకోండి. క్లబ్బులో ఏపని తలపెట్టినా అది తగలెయ్యడమే జీవిత పరమావధిగా పెట్టుకొన్న ఎందరో మహానుభావులను నేను ఎరుగుదును. ఆటమధ్యలో ఉండి ఒక్కసారి తల పైకెత్తగానే టప్పయ్య కనపడ్డాడు. ఎప్పుడొచ్చాడో కాని చడీ చప్పుడూ కాకుండా, ఏమాత్రం అలికిడైనా ఈ పేకముక్కలన్నీ ఎగిరి మీద పడతాయేమో అన్నట్లు వాడిలిపోతో ఓమూలగా ఒదిగి కూర్చున్నాడు. 'ఇదుగో' అని ఒక మందహాసం నాకేం భయంలే దన్నట్లు అతనిమీద పారేసి, మళ్ళీ నా ఆటలో పడ్డాను. 'గురువుగారూ నమస్కారమండి' అని రామం ఓ కుర్చీలో చతికిలపడ్డాడు. 'నమస్తే గురుదేవ్' అంటూ భద్రం చక్కా వచ్చాడు. 'ఇదుగో వస్తున్నా' అంటూ ముక్క ఎక్కడపెడితే బాగుంటుందా అని ఆలోచిస్తుండగా 'ఎందరో మహానుభావులూ, వారలందరికీ' అంటూ శర్మరావడం వినపడ్డది. ఇంక లాభంలేదని ముక్కలు కలిపేస్తుండగా 'ఏమి మహానుభావా! ఈవేళ తమరుకూడా ఇటువంటి నైచ్యానికి దిగారేమిటి' అంటూ శాస్త్రి వచ్చాడు. 'ఏదేనా ఒకఆట వేద్దామంటారా ఏమిటి గురూజీ' అన్నాడు భద్రం కొంచెం సందేహిస్తూ.

శాస్త్రి వెంటనే అతనికేసి తీవ్రంగా మెస్మరిస్ట్ (*Mesmerist*)లాచూచి, 'తప్పు నాయనా తప్పు. అటువంటి అకార్యకరణాలకేమీ ఇక్కడ అస్కారంలేదు. మనం వేరు; మన ఆశ్రమం వేరు మన ఆదర్శాలు వేరు. ఇటువంటి తుచ్ఛవాంఛల కిచట తావులేదు తండ్రీ. మనం విజ్ఞానవేత్తలం, మనం తత్త్వదృష్టితో ప్రపంచ వ్యవహారం పరిశీలించాలి: రాజకీయాలు పరామర్శించాలి! ఐహికంయొక్క అర్థం, ఆముష్మికంయొక్క అంతర్యం తేల్చాలి. ఇలాటిది బోలెడంత మహత్కార్యం మన ఆశ్రమవాసులు సాధించవలసినదిగా ఉండగా, చీట్లాట...ఛీ ఛీ ఛీ! అయితే బారిష్టరుగారూ, ఏమిటి విశేషాలు. ఈవేళ మన చర్చనీయాంశమేదో తేల్చడానికోసిగరెట్టు ముట్టిద్దామా, తరవాత మధ్యేమధ్యే పానీయానికి పురమాయిద్దాం' అన్నాడు 'శుభం' అన్నాం ఏకగ్రీవంగా.

క్లబ్బుపూటయింది. టెన్నీసు కోర్టులో జనం ఎక్కువయ్యారు. జనంతోపాటు హడావిడీ ఎక్కువయింది. 'కొట్టూ! దంచూ! చంపూ! బ్యూటీ (*Beauty*)' అనే ప్రేక్షకుల ఉత్సాహవచనాలు క్లబ్బు

విషయానుక్రమణిక

ముఖచిత్రం :—

నటి రాజసులోచన

బారిష్టరుగారి బాతాఖానీ	2
మునిమాపు—	6
సుశీల—	12
అట్టమీదబొమ్మ—	19
పిల్లిమొగ్గలు—	24
వనితాలోకం—	27
బొమ్మరిల్లు—	33
టామ్‌సాయర్ ప్రపంచయాత్ర—	40
కోయిలపుట్టుక—	45
సినిమా—	50

ఆవరణదాటి రోడ్డు చివరవరకూ వెళ్ళి ఉండాలి ఏమంటే ఎవరినో కొట్టడం, చంపడం, చూతామని దారేపోయేవాళ్లు చాలామంది లోపలికి తొంగిచూచి, చంపేవాడుకాని చంపబడేవాడుకాని కనపడక, నిరుత్సాహపడి చక్కాపోయారు.

చదరంగంబల్లదగ్గర ఆడేవాళ్లు ఇద్దరయినా, వారి ఉభయులకూ సలహాదార్లు మాత్రం సుమారు ఇరవైమందిదాకా చేరారు. అసలు వాళ్లు మాట్లాడడంలేదుకాని - మాటదాకా ఎందుకు ఆశేలేదు - ప్రేక్షకులు మట్టుకు ఊరికే ఉద్రేకం తెచ్చుకుని, 'తయెత్తుకాదు.. ఉండు - అది కదపకు - ఆగవోయి మగడా.. ఏమిటో హడావిడి - అటు జరిపితే చచ్చిందన్నమాటే ... జరపవోయి ఎలా చస్తుందో చూస్తాను - ఆ! చూస్తావు - ఇందాకటినుంచీ చూస్తున్నావు కాదూ! నీ సామ్మేంపోయింది. ఉండవోయి. అది కదపద్దంటే అదే తీస్తావేం... నీకెందుకు తియ్యవోయ్ చచ్చినా దాన్ని కదపనివ్వను.. ఇలాగు మందరంనుంచి తారస్థాయివరకూ వెడుతోంది.

పక్కనున్న పేక ఆటవాళ్లకు ఈ గొడవే పటలేదు. ఇంత ఏకాగ్రత ఉన్నవాళ్లు నిజంగా యోగాభ్యాసంలోకే దిగితే ఎలా ఉండేదో అనుకున్నాను వాళ్ల చేస్తులేమిటో, కుడ్లేమిటో, పంపకాలేమిటో; అంతే తప్ప మరో గొడవేమీ వాళ్లకు పట్టలేదు.

మేము సిగరెట్టు ఆఖరుదమ్ము తీసేసరికీ, సరిగ్గా కాఫీ అందుకుంది. సిగరెట్టు పొగలోనుంచి కాఫీ పొగలోకి - సినీమా భాషలో - డిస్సాల్వ్ (*Dissolve*) చెయ్యడానికి వీలుగా ఆ క్షణానికి ఎలా అందించాడా అని ఆశ్చర్యపోతూ, బాతాఖానీలోపడ్డాం. ఆమాటా ఈ మాటాలోనుంచి నెమ్మదిగా రాష్ట్రీయ రాజకీయాలూ, ప్రాంతీయ పక్షపాతాలూ, అన్యోన్య అపహాసాలూ మొదలైన సామాన్య విషయాలను గురించి సంభాషణ సాగించాం. మాకు తెలియకుండానే ఎలా మారిందో గుర్తులేదుకాని ఆంధ్రులూ, వాళ్ల వ్యక్తిత్వం, ప్రత్యేకతను గురించి వచ్చింది ప్రశంస. ఎవళ్ళకు తోచింది వాళ్లు చెప్తున్నారు.

ఇంతలో పేకాట దగ్గరో, చదరంగం దగ్గరో పేచీ మామూలు శృతి మించినట్లనిపించింది. ఏమిటా అని అనుకుంటూండగానే పెద్ద కేకలు వినపడ్డాయి. క్లబ్బులో అందరూ చదరంగం బల్లకేసీ పరుగెత్తారు. మేము మా స్థానాలు వదలలేదుకాని, అదేదో తేలిన తరువాత మాట్లాడుకోవచ్చునని, పర్యవసానంకోసం నిరీక్షిస్తూ కూర్చున్నాం. నాలుగైదు నిమిషాల్లో హోరు చాలా భాగం తగ్గింది. అక్కడకు పరుగెత్తిన జనభా గుంపులు గుంపులుగా నవ్వుకొంటూ వాళ్ళ వాళ్ల కార్యరంగాలవైపు సాగారు. ఇంతకూ అసలు సంగతేమిటంటే, ఏమీ లేదు. చదరంగం బల్లదగ్గర సలహాదార్లలో మాటా మాటా పెరిగింది. అందులో ఒకాయన దాక్షిణాత్యుడు, పెద్దవాడు. రెండోవాడు మనవాడు, యువకుడు. ఈ భోగట్టా

మేము తెలుసుకుంటూ ఉండగానే ఆ యువకుడు 'ఒళ్లు దగ్గరపెట్టుకు మాట్లాడు, ఏమనుకుంటున్నావోను. ఎక్కడున్నదీ, ఎవరితోటి వ్యవహరిస్తున్నదీ కొనకుండా ఉన్నావు. లోపలుండిపోయావు - బ్రతికావు. బయటకొస్తే నీ బండారం బయటపడేది' అని కేకలేసుకుంటూ వీధిలోకి పోతున్నాడు.

'సరిదా. పో అయ్యా, ఇక్కడ ఏమి చేస్తివి - అక్కడా అద్దా చేస్తువూ' అన్నాడు ఇక్కడ తమిళ సోదరుడు.

ఈ మాటవిని బయటకు వెడుతున్న యువకుడు ఆగి, 'ఏం చేస్తానా, డొక్క బద్దలు చేస్తాను. నీకు దిక్కున్న చోట చెప్పుకోవాలి. నే నెవరనుకుంటున్నావో - ఆంధ్రుణ్ని - తెలుసా - ఆంధ్రుణ్ణి - పదహారణాల ఆంధ్రుణ్ణి-మొగాడవైతే రా...' అంటుండగానే, నలుగురు కుర్రాళ్లువెళ్లి, వాడిని రెక్కట్టుకుని బయటకు లాక్కెళ్లి రోడ్డుమీద విడిచిపెట్టారు.

ఇదేమి టన్యాయం, మనవాడిని అలా ఈడ్చేస్తున్నారు అంటూ మా భద్రం, కొంచెం ఉద్రేకంతో లేచాడు. 'వెధవ అల్లరి నువ్వూను. పోనీ అని ఊరుకుంటూంటే మరీ రోజురోజుకీ న్యూసెన్సుగా తయారయ్యాడు. ఈమాటు క్లబ్బులో అడుగుపెట్టిచూడు, ఏం చేస్తామో' అంటూ వచ్చారు ఈ యువకులు.

'అయితే మన పదహారణాల ఆంధ్రుడు ఇక్కడ మెంబరు కాదన్నమాట' అన్నాడు రామం, తెల్లబోయి.

"కాడు నాయనా కాడు. సభ్యత్వం ఉంటే వాడూ మనకు మల్లేనే బేడ ఆంధ్రుడో పావలా ఆంధ్రుడో అయి ఊరుకునేవాడు అన్నాడు శర్మ.

'బాబూ, గురువుగారూ, నాకు తెలియక అడుగుతాను. ఈమధ్యన ప్రతివాడూ ఇదొకటి ఆరంభించాడు...పదహారణాల ఆంధ్రుడిని అంటూను. దాని భావమేమిటి స్వామీ' అన్నాడు రామం. 'మరేనండి. ఈ మధ్యన మరీ ప్రతివాడూ ఆరంభించాడు' అన్నాడు టప్పయ్య.

'ఏముందీ. ఇదే. ఇప్పుడు ప్రత్యక్షంగా చూచావుగా. ఇంకా సందేహమెందుకూ' అన్నాడు శర్మ.

'ఏమిటి బారిష్టరుగారు. మౌనము వహించారు. తమ అభిప్రాయం సెలవియ్యాలి,' అన్నాడు శాస్త్రి.

'అభిప్రాయమేముంది. నాకూ ఇలాటి సందేహమే కలిగింది. ఆ అనే పెద్దమనుష్యులనుకూడా ఒకరిద్దర్ని అడిగాను. వాళ్లేమీ సమాధానం చెప్పలేక నవ్వి ఊరుకున్నారు. మా శిరోమణి చెప్పినట్లు దీని సంగతేదో తేలుద్దామని కొంత రిసర్చి ఆరంభించాను' అన్నాను. 'వినుడు- వినుడు. అవధరింపుడు శౌనకాది మహామునులారా - అవధరింపుడు. ఆం శెలవివ్వండి సూతమహాశయా' అన్నాడు శాస్త్రి. అందరూ నవ్వారు. 'సూతోవాచ. కానివ్వండి' అన్నాడు మళ్లీ శాస్త్రి.—

నేను చెప్పానుకాదూ, ఎవ్వరూ సరియైన సమాధానం చెప్పలేదు. ఇది బాగుంది కాదు. పోనీ ఒకడిని వెంటాడి వాడి మాటలూ చేష్టలూ జాగ్రతగా కనిపెడితే ఏమన్నా తేలకపోతుందా అనుకున్నాను. మా ఇంటికెదురుగా ఒక ఆసామీ ఉండేవాడు. అతను గంటకథమం నాలుగైదు సార్లైనా ఈ పదహారణాల ప్రయోగం చేస్తూండేవాడు. అందుకని నెమ్మదిగా అతని స్నేహంచేసి అస్తమానం అతనితో అతని నీడలా తిరగడం మొదలెట్టాను. మనకీ శిష్యులు బయలుదేరుతున్నారని అతను చాలా సంతోషించాడు. నాలుగు రోజుల్లోనే తేలిపోయింది.

"ఏమిటి" అన్నాడు శర్మ.

ఏమీ లేదు. వడ్లగింజలో బియ్యపుగింజ. నేను కనిపెట్టిన విషయాలు ఒకటి రెండు చెపుతే మీకే తెలుస్తుంది. పొద్దున్నే లేచేవాడు. దంతధావనంచేసి తలేనా దువ్వుకోకుండా, ఆ గూడకట్టుతోటే పైకి వచ్చేవాడు. ఇంటిదగ్గ రెప్పుడూ గూడకట్టే కాని కట్టేవాడు కాడు. అతనన్నమాటేమిటి యువకులను ఎవర్ని చూచినా అరవల గూడకట్లో లేకపోతే తురకల లుంగీయో. పదహారణాల ఆంధ్రుడు చచ్చినా పంచ కట్టడు. గూడకట్టే అయితే అది మళ్ళీ సంగవరకూ పైకి మడిచి కట్టవలసిందే. ఇది మొదటి సూత్రం. మా ఆసామీ తిన్నగా కాఫీహోటలుకు నడిచేవాడు - అరవ కాఫీ హోటలుకు. నేను ఒకటి రెండు సార్లు, మన తెలుగు వాళ్ల హోటలుకు తీసుకు వెడదామని ప్రయత్నం చేశాను.

'పోనిద్దురూ - వెధవ హోటలు - మనవాడు హోటలు పెట్టడమేమిటి - అది అరవలసొమ్ము. అది వాళ్ల జన్మహక్కు. అందుకు పుట్టారు. అవసరమైతే అందుకు చస్తారు కూడాను' అన్నాడు.

అక్కడ ఫలహారంకూడా ఇడ్లీ సాంబారు ప్రధానంగా సేవించేవాడు. 'ఏమిటో మీరు దురభిమానం పెట్టుకుని మనవాళ్లూ మన హోటళ్లూ అంటారుకాని చస్తే ఇలాటి ఇడ్లీలుకాని ఇలాటి సాంబారుకాని మన వాళ్లు చెయ్యగలరుటండీ, కబుర్లుకాని' అనేవాడు - హోటలునుంచి పైకిరావడంతోటే ఏదోవంక కల్పించుకుని అరవవాళ్లను తెగ తిట్టేవాడు.

ఒకమాటు గానసభ అవుతుంటే వెడదాము రమ్మన్నాను. 'ఎవరు పాడేది' అన్నాడు.

'మనవాడేనండి. కొత్తగా తయారయ్యాడు. చాలాబాగా పాడతాడన్నాను.

'వాడిబొంద పోనిద్దురూ. మనవాళ్లకు సంగీతం ఏమిటి. శాస్త్రీయసంగీతం అరవవాళ్లసొమ్ము. వాళ్లు నిఘులు దక్షిణాదిని పుట్టిన గాడిద అరుపుకూడా అందంగా ఉంటుందంటే నమ్మండి. మనకు సంగీతం ఏమిటండీ. శాస్త్రీయ సంగీతానికి దాక్షిణాత్యులు. లఘుగానానికి ఔత్తరాములూను. నామాట వినండి. దానికి తగలేసే డబ్బుతో నాలుగు సినిమాలు చూడొచ్చు' అన్నాడు.

'రండి అయితే సినిమాకే పోదాం' అన్నాను.

'అబ్బే! వెధవ తెలుగు పిక్చరేదో ఆడుతోంది. అదేమిటి చూచేది? ఏదైనా హిందీ ఫిలిము అయితే బాగుంటుందికాని'

'అదేమి టలా అంటారు. బోలెడన్ని తెలుగు పిక్చర్లు వస్తున్నాయి. బోలెడంత డబ్బూ వస్తోంది వాటికి. చాలా బాగున్నాయని అనుకుంటున్నారు అంతాను' అన్నాను.

'డబ్బుకేంలెండి. వెధవడబ్బు. డబ్బురావడంవేరు. చిత్రం బాగుండడం వేరు. ఏమంటారు. మామూలుజనాని కేం తెలుస్తుంది. పైవాళ్లకుమట్టుకు? మనవాళ్లకు సరియైన అభిరుచులు లేవు. రసగ్రహణ శక్తి లేదు. ఏమీ లేదు. నాలుగు డబ్బు లెక్కడో కొట్టుకురావడం, మంచిరోజుచూచి డైరెక్టరని బోర్డు కట్టుకోడం, ఓ చిత్రంతీసి మన నెత్తిన రుద్దడం. అందులో అందమా! కళా! కథా! ఏముంటుంది. అసలు హిందీవాళ్లలాగ ఉత్తమచిత్రాలుతీస్తే మనవాళ్లకు వాటినిచూచి ఆనందించే శక్తికూడా లేదు. మనవాళ్లన్నదే, వట్టి....... పోనిద్దురూ, నాకెందుకు' అని ఊరుకున్నాడు.

నేను అంతటితో ఊరుకోక 'అదేమిటండి. మనవాళ్లు సాహిత్యరంగంలోనూ, నాటకరంగంలోనూ, అన్నిటిలోనూ చాలా ఉన్నతశ్రేణిలో ఉన్నారని విన్నాను. మన ఆధునిక కవిత్వం, కథానికలు, నాటికలు మొదలైనవి ఇతరరాష్ట్రాలవాటికంటె ఏమీ తీసిపోవనీ, తీసిపోవడమేకాదు వాటికంటె చాలా బాగుంటాయనికూడా విజ్ఞులు చాలామంది అనగా విన్నాను. అంతేకాకుండా నాటకరంగంలోకూడా ప్రదర్శనంలోనేమి, అభినయంలోనేమి మనసే పెచెయ్యంటారు!' - అన్నాను.

'అబ్బే! డబ్బా! వట్టిడబ్బా! అదొక్కటే మనకు చేతనైనది! వాయింపు, డబ్బాయింపూను. నాటకం అన్నప్పుడు బెంగాలీ నాటకం. కథలన్నప్పుడు హిందీ

కథలు, బెంగాలీ కథలు. నాటకాలన్నారు బెంగాలీవాళ్లదే అగ్రతాంబూలం. ఆ విషయంలో, అంతేనే కాని, మనకి సాహిత్యం నాటకం. అబ్బెబ్బే! నాదగ్గర అంటే అన్నారు కాని ఎవ్వరిదగ్గరా అనకండి నవ్వుతారు' అన్నాడు.

'అయితే మీకు హిందీ, బెంగాలీ వగైరా భాషలు బాగా వచ్చునన్నమాట' అన్నాను.

'అబ్బే రావండి. చదువుదామని ఉన్నది కాని తీరికేదీ.'

'అయితే వాళ్ళ పుస్తకాలేవీ చదవలేదన్నమాట.'

'లేదు. చెప్పాకాదూ, తీరిక లేదని.'

'మనవాళ్ళ పుస్తకాలు చదివేఉంటారు'

'చంపారు. మన పుస్తకాలా. నాకేం మతి లేదనుకున్నారా, పని లేదనుకున్నారా! తెల్లవారి లేచి మన ఉమ్మాయి జగ్గాయిలు రాసిన చెత్తాచెదారం చదువుతూ కూచుంటాననుకున్నారా! మీరు చాలా పొరపాటు పడ్డారు.'

'నిజమే సుమండీ. క్షమించాలి. మీకు నాటకాలమీద అభిమానం ఎక్కువలా ఉన్నది. నాటకాలు చాలా చూచి ఉంటారు!'

'అభిమానమున్నమాట వాస్తవమే కాని, నేనేం చూడలేదు. ఇలా వృథాగా తగలెయ్యడానికి తీరికాలేదు. డబ్బూ లేదు. నేను పదహారణాల ఆంధ్రుణ్ణి. తెలుసునా అండి.'

'నిజమే సుమండీ. పోనీ ఏవో రెండు నాటకాలూ, నాలుగు నవలలూ మీరే రాసి పారెయ్యకూడదు. ఆదర్శప్రాయంగా ఉంటాయి.'

'అదే అనుకుంటున్నాను సార్. అయినా ఒక్క క్షణం తీరిక ఉండదండి. చస్తున్నాను నీళ్లలోటి.'

'ఎందుకు తీరిక లేదు? ఇన్నాళ్లినుంచీ అడగడం మరచిపోయాను. మీరేం చేస్తున్నారు.'

'ఆఁ. ఏం లేదులెండి. ఏదో చేద్దామనుకుంటున్నాను. బోలెడన్ని ఉన్నాయి చెయ్యవలసినవి. దేనికీ ఊపిరి తీసుకోనివ్వరు. ప్రతిదానికీ నన్నే చంపడం. ఎన్నికని చావను. మీటింగు పెట్టించాలంటే నేను. దేవుడు కళ్యాణమంటే నేను. ఊళ్లో సంతర్పణంటే నేను. ఎన్నికలంటే నేను. పెళ్లంటే నేను. పురుడంటే నేను. చావంటే నేను. వాటిలో మధ్య నేను చస్తున్నాను.'

'ఒక్క మాటలో చెప్పాలంటే ఈ భూభారమంతా మీరే మోస్తున్నారందురూ! అబ్బా! కాస్త మనిషైనా ఎంత పని చేస్తున్నారు. పోనీలెండి దేవుడికి కాస్త విశ్రాంతి కలుగచేశారు. సంతోషం' అన్నాను.

'ఏమిటండీ! మీ కేం వేళాకోళంగా ఉన్నట్టుంది. పెద్దమనిషిలా కనపడ్డారు. కూడా కూడా తిరుగుతున్నారు. పోనీ దానివల్ల మీ క్షేమైనా ఉపకారముంటుందేమోనని ఊరుకుంటే, నాకే తాటాకులు కడుతున్నారూ. మీమాత్రం వెటకారం మాకూ తెలుసు నండోయి. మేమేం *Grandmothers* అనుకోకండి. మేము పదహా...'

'అబ్బెబ్బె! ఎంతమాట! మీరు పదహారణాలాంధ్రులన్న సంగతి తెలుసు. అది వరకు కాకపోయినా మీ సహవాసంవల్ల తెలుసుకున్నాను. మీరు పదహారణాల ఆంధ్రులు గనుక, మీకు ఆంధ్రుల చరిత్ర కాని, ఆంధ్రుల వేషభాషలుకాని, వారి శిల్పం, సాహిత్యం, సంగీతం, సంస్కృతీ వగైరా మీకేమీ అవసరంలేదు. అవన్నీ ఏపో మాలాటి అణా బేడా ఆంధ్రులపని. మీరు ఊరికే అనాథలను అనుకరిస్తూ, ప్రతి స్పర్ధ్యానికీ వాళ్లని యాచిస్తూ, పొగుడుతూ, వెనకాలవాళ్లని తిడుతూ, ఇక్కడ చావలేఖరాబు చేస్తూ ఎక్కడికెళ్లినా ఆంధ్రులంటే ఇంతేకాబోలు ననిపించేటట్టు పెద్ద గొంతుకతో అరుస్తుంటే చాలు. అదే మాకు పదివేలని ఆంధ్రజాతి ఆ జన్మాంతం మీకు కృతజ్ఞులై ఉంటారు? అన్నాను తీవ్రంగా.

'ఇదుగో'...అని ఏదో అనబోయాడు.

'చాల్లేవయ్యా నడువు, నీసంగతి తెలుసుకుందామనే ఇన్నాళ్లూ తిరిగాను తెలిసింది. దయిచెయ్యి' అన్నాను, బహువచనం విడిచిపెట్టి. ఏదో అనబోయి చేపలా నోరు తెరిచి మళ్లీ ఏమీ అనకుండానే గబగబా చక్కాపోయాడు.

ఇది బాబూ నా రిసర్చివల్ల తేలినవిషయం. మీ అనుభవం ఏమిటో మరి.

"రైట్ నూటికి నూరుపాళ్లూ కాదుకాదు రూపాయికి పదహారణాలూ కరెక్టు. తభావతేమీ లేదు. ఇంతటితో వందన సమర్పణ లేకుండా పోదామా...ఇక పోదామా... ఆటలు, మాటలు, పోటులు మానేసి పోదామా. ఇక పోదామా" అన్నాడు శర్మ.

★

నాటిక :

మనిమాపు

ప్రయోక్త:
మానవునిలో ఎన్నో తీరని కోరికలు, రహస్యమైన వాంఛలు వుంటాయి. వీటిని జీవితంలో సాధించాలని చేసే యత్నాలకు, బాహ్య జగత్తులో అంతరాయాలుంటాయి. ప్రజాభిప్రాయము, శాసనము, చట్టము— మొదలైనవి కొన్ని, పోలీసువాని ఎర్ర టోపీ వీటి చిహ్నము.

అందుచేత అరాజకమైన మానసిక ప్రవృత్తులు కొన్ని, పగటి కలలుగానూ, మరి కొన్ని నిద్రావస్థలోనూ రూపొందుతాయి. ఈ వాంఛలు అడవి మృగాలలాంటివి. ఏదో విధంగా, ఉపబుద్ధి కల్పించిన బందిఖానాలోంచి బైటపడాలని గర్జనలు చేస్తూంటాయి. జాగ్రదవస్థలో, వీటిని అణిచి పెట్టి తాళంవేసి, ఎర్ర టోపీని చూస్తే కలిగే భయాన్ని, సీలుగా వేస్తాడు - మానవుడు.

కాని, ఎప్పుడో ఒకప్పుడు, అతని మానసిక నైరాశ్యాన్ని ఆధారం చేసుకుని మృగాలు బైటపడతాయి. అలాంటప్పుడు అతని చేష్టలకు అతను బాధ్యుడు కాడుట. కొందరు మానసిక శాస్త్రజ్ఞులు వ్యక్తపరచిన యీ సిద్ధాంతానికి వైకుంఠం చరిత్ర తార్కాణం. బాల్యంలో దిగవిడిచిన ఏవో వింత అనుభవాల వొత్తిడివల్ల వైకుంఠం తన బుద్ధిమీద అధికారం పోగొట్టుకున్నాడు. వికృతమైన అసంతృప్త వాంఛలు అతన్ని చుట్టుముట్టాయి.

వైకుంఠానికి చిన్నప్పటినుంచీ నాటకాలంటే పిచ్చి, గొప్ప నటుడు కావాలని— పాపం, కాలేదు. ఆకాశం సంధ్యని ముసుగులా కప్పుకుంది. ఆ రాత్రి నాటకానికి ముందుగానే టిక్కట్టు కొనుక్కుందామని బైలుదేరాడు. జనం కిటకిటలాడుతున్నారు. తోపిడిలో అతనికి టిక్కట్టు దొరకడం లేదు. దూరంగా ఆ అమ్మాయిని చూశాడు. ఎందుకో చిన్ననాటి సత్యవతి జ్ఞాపకానికొచ్చింది. సత్యవతి — సత్యభామ వేషం, అతను కృష్ణుడు. ఎప్పటికైనా సాధ్యమా? సత్యవతికి పెళ్లయింది. భర్త రమణారావు. ధనికుడు. తనో? టిక్కట్లు ఐపోయాయిట. పోనీ, ఆ అమ్మాయి దగ్గరగా కూర్చుని నాటకం చూడ్డానికైనా నోచుకోలేదూ? అంతే - అతనిలోని మానసిక అధోలోకం - తాళం వూడింది. మృగాలు బైటపడ్డాయి.

వైకుం: సోదరులారా! పరమేశ్వరుని భక్తులారా! దయచేసి అందరూ నిశ్శబ్దంగా కూచోవాలని ప్రార్థిస్తున్నాను. అయిపోవచ్చింది. చిత్రాతిచిత్రమైన యీ నాటకం, యింతవరకూ మీరు కని, విని ఉండరు. వేషాలు వేసుకోవటం పూర్తి అయింది. ఒక్క నిమిషం - ఒకే ఒక్క నిమిషం ఓపిక పట్టండి. నాటకం ప్రారంభించబోతున్నారు. దయచేసి అందరూ కూర్చోవాలి. (నాటకధోరణిలో) సత్యా! దీనికే ఇంత అచ్చెరువందనేల? (మెల్లగా) అబ్బాయ్ 5½ వాయించు.

కొన్నిగొంతులు. హేయ్... హేయ్... హోయ్...

వైకుం: (దీనంగా) నవ్వుతున్నారుగదూ మీరు...? నవ్వండి. నా బ్రతుకింత నవ్వులపాలవుతుందని నేననుకోలేదు. నాకేమనిపిస్తున్నదంటే - ఇంతమందిని నవ్వించగలిగిన నేను - ఎంత గొప్పవాణ్ణో అని. కానీ, మా ఆవిడ నవ్వితేమట్టుకు నాకు మండిపోతుంది. నవ్వుతున్నదాని ముఖానికి, తారుపూయాలనిపిస్తుంది. కానీ దగ్గరకెడితే...

ఎగతాళిగొంతు: ఏమనిపిస్తుంది స్వామీ...?

వైకుం: శుభం. ఇంతవరకూ మీరీ కార్యక్రమాన్ని శ్రద్ధగా చూచినందుకు, మీ అందరికీ నా ధన్యవాదాలు. తరువాత కార్యక్రమం వెంటనే ప్రారంభమవుతుంది.

ప్రయోక్త: అంటూ వైకుంఠం రెండు చేతులూ చాపి, అల్లిబిల్లి తిరిగాడు. జనం గొల్లుమని నవ్వారు. అతన్ని చూస్తూ చాలా మంది నిలబడిపోవటంవల్ల ట్రాఫిక్ ఆగిపోయింది. గుంపుకు రెండువైపులా కార్లు, జట్కాలు, రిక్షాలు, సైకిళ్లు, ఆగిపోయాయి. అర్జంటు పనిమీద హడావుడిగా వెళ్ళిపోయే ఓ ఆఫీసరు, ఆలస్యాన్ని సహించలేక హారన్ కొట్టాడు. జనం తొలిగారు. దోవ యిచ్చారు. కారు మెల్లిగా పోతున్నది. వైకుంఠం కారువెంట పడ్డాడు. దానితోబాటు కొంతదూరం పరుగెత్తి, ఒక్క దూకుతో వెనక కూచున్నాడు. సరే- కొండొక కాలానికి కారు ఆగింది. కారుతోబాటే వైకుంఠంకూడా ఆగాడు. అంతలోకే అతనికొక సరిక్రొత్త ఆలోచన కలిగింది.

వైకుం: ఈ దరిద్రంతో నేనెంతకాలం జీవించను...? ఎన్ని బాధలని అనుభవించను...? అట్టే శ్రమలేకుండా ఒక విధి దొరికితే బాగుండును. పోనీ, నేను రైల్లో, వెడుతున్నప్పుడు - నే నెక్కిన పెట్టెగాక- మిగతావన్నీ తలక్రిందులైతే, ఎంతో, బావుంటుంది. అందరిదగ్గర డబ్బా పోగు చేసుకోవచ్చు. దేనికైనా అదృష్టముండాలి. కలిసివచ్చే గీత వుండాలి.

ఒకరు: ఏమిటోయ్ వైకుంఠం....యేదో గీత ఉండాలంటున్నావు. ఏమిటది...?

వైకుం: ఆఁ! ఏమిటీ నువ్వనేది నీలకంఠం...?

నీలకం: ఏదో గీత ఉండాలంటుంటేను- అదేమిటోనని అడుగుతున్నానోయ్.

వైకుం: గీత ఉండటమేమిటి...?

నీలకం: నువ్వే అంటున్నావుగదుటోయ్ యిప్పుడు..."

వైకుం: ఇప్పుడు నేనామాట అన్నానా నీలకంఠం...? ఎవరు చెప్పారు నేనన్నానని...?

నీలకం: నేను విన్నాను.

వైకుం: (బిగ్గరగా) ఎప్పుడు విన్నావ్..?

నీలకం: (కొంత తగ్గి) ఇప్పుడేగదుటోయ్ నువ్వన్నది. పైగా కస్సిరజేస్తావేం?

వైకుం: (మామూలుగా) ఇదుగో! నీలకంఠం ... ఒక్క విషయమడుగుతాను నిజం చెబుతావా...?

నీలకం: నేను నీకెప్పుడన్నా అబద్ధాలు చెప్పానా వైకుంఠం...?

వైకుం: నాకు తెలుసు - నువ్వు నా శ్రేయోభిలాషివి. నాతో అబద్ధమాడవు. నీకు తెలుసుగదూ...?

నీల: ఏ విషయం వైకుంఠం...?

వైకుం: (యేడ్పు గొంతుతో) అదే - ఆ విషయమే. నీకు తెలుసుగదూ...?

నీల: ఎందుకలా విచారిస్తావోయ్ వైకుంఠం...? విచారించి మనమేమీ చేయలేం. ఊరుకో... ప్రమాణపూర్తిగా నాకాసంగతి తెలియదు. ఇన్నిటికీ నువ్వంటున్నది దేన్నిగురించి...?

వైకుం: అదే—పరకాయ ప్రవేశం.

నీల: (నవ్వి) హారి నీ అసాధ్యం కూలిపోను. పరకాయప్రవేశంగురించి నాకేమి తెలుసోయ్...?

భారతవర్షానికి చైనా జోహార్లు!

(చైనీస్ కవి యుహాన్ షుయి - వ్రాసినగీతం ఆంగ్లానువాదానికి ఆంధ్రానువాదం: నం. రా.)

రమణీయమ్మా దేశము!
సుమనోహరమా దేశము!
హరితకంబళాచ్ఛాదిత
మల్లుతోచునా దేశము!

విప్పారిన రోజావిరు
లొప్పారను పల్లెములై.
వెన్నెలలో తరుల క్రింద
వన్నెలీను నెమ్మిపురులు.
నిత్యమచట వసంతర్తు
నృత్యఖేల సాగిపోవు.
రమ్యతకది పారమ్యము
రత్నగర్భ కుపమేయము.

వేనవేలు వీరులు తమ
వేడినెత్తు రొలికించగ
పరిపుష్టమ్మయిన భూమి!
ప్రజలందరు మనవలెనే
ధీరులు, సాహసులవిచల
దీక్షాపరులైన సీమ!

రెండు వేల యేడులుగా
దృఢమైత్రీ బంధితులము.
కాలపు కరవాలము కర
కాబోనిది మన నెయ్యము.
మన తొంబది యారుకోట్ల
జనగణముల సహజీవన
యాత్ర కెదురు నిలువలేవు
అత్యున్నత నగములైన!

మన చెలిమి సమస్త ధరణి
అనుసరింప దగిన సరణి.
వీచుడో హో! వేవేగను
దీచీపవనములారా!
పెకింగ్ నగర పౌరవరుల
అకుంఠిత స్నేహభావ
బంధురమగు నాగీతము
భద్రముగా గొంపోవుడు!
తాళ తరుల మందానిల
తరంగములు మూర్ఛరించు
ఆ గంగా తటమునను
అనవరతము కుసుమితమై
పొంపెసగెడి సీమదనుక,
గొంపోవుడు నాగీతము!



భారత దేశంలో పర్యటిస్తున్న చైనీస్ సాంస్కృతిక ప్రతినిధులు.

★ మునిమాపు ★

వైకుం: అబద్ధమాడుతున్నావు. నీకు తెలుసు.

నీల: తెలియదు.

వైకుం: నీకు తెలుసు.

నీల: నిజంగా నాకు తెలీదు వైకుంఠం..

వైకుం: అయితే - ఆ మాట నీ కెట్లా తెలిసింది...?

నీల: ఏ మాట...

వైకుం: 'గీత' అన్న మాట.

నీల: (నవ్వి) ను వ్వే గదు టో య్ అన్నావు.

వైకుం: భగవంతుడు సాక్షిగా చెబుతున్నాను. ఆ మాట నే ననలేదు.

నీల: (విసుగ్గా) సరే, పోనీయ్. అన లేదులే. నేనే పొరబడి ఉంటాను. మరి, నేను వెడతాను వైకుంఠం. అవతల నాకు చాలా పనులున్నై.

వైకుం: (నిట్టూర్చి) అమ్మయ్య! జిడ్డు వెధవ యెంతకీ వదిలాడు గాదు. వీడి పేరు నీలకంఠమా - నీలకంఠం. పాచి వెధవ.

నీల: (పచ్చి కోపంగా) ఏమిట్రా ను వ్వంటున్నది....? నేను జిడ్డు వెధవనా...?

వైకుం: ఎవ రన్నారు నీలకంఠం నిన్నా మాట...? ఆ మాట నిన్నన్న వెధవాయ అడ్రస్ సేమిటి...?

నీల: (రెచ్చి పోయి) ఈ వేషాలు నాదగ్గర సాగవోయ్ వైకుంఠం. నోటి కొచ్చినట్లు పేలావంటే డొక్క బద్దలు చేస్తాను తెలుసా...?

వైకుం: గురవయ్యగారూ...యెందుకలా నోరు పారేసుకొంటారు...? నేను నీ కొట్లో - ఒక్క దమ్మిడీ వెచ్చంగూడా వాడలేదు...మా ఆవిడ వాడిందంటావా? అందుకు నేనా బాధ్యుణ్ణి. వెనకాముందూ చూడకుండా, అలా బాకీ పెంచినందుగ్గాను, రేపు దానిదగ్గర గోళ్లూడగొట్టి పుచ్చుకో నేను కాదు కూడదంటే, అపుడను. ఎవరో చేసినతప్పుకు, నామీద కేకలేయడం భావ్యమేనా - గురవయ్యా భగవంతుడు యీపనికి మెచ్చుతాడా...?

నీలకం: దొంగవెధవ. అన్నీ వేషాలు వేస్తున్నావు...వేషాలు, ఒళ్లు దగ్గరుంచుకొని మసులుకో. లేదా - పోలీసులకు రిపోర్టిస్తాను.

వైకుం: దేవాదిదేవా! ఆదిమధ్యాంత రహితా! పరాత్పరా! నాతప్పు క్షమించి, నన్ను రక్షించు. నాకు తెలియదు. లేకపోతే, మొన్న రాత్రి నీ సన్నిధానంలో అలా చుట్టకాల్చను. ఈ పాపవిమోచనార్థం, నేను దండకారణ్యంలో ఘోరాతి ఘోరంగా తపస్సు చేస్తాను. నాకు ముక్తిని ప్రసాదించండి.

ఒకగొంతు: ఏవఁయ్యోయ్! ఏమిటిది..? నడివీధిలో పద్మాసనం వేసుక్కూచున్నావ్. లే...లే....

మరోగొంతు: పాపం! పిచ్చివాడులా వుంది.

వైకుం: అయ్యయ్యో! పారిపోండ్రా

పారిపోండి. మిలటరీవాళ్ళొస్తున్నారు. ఊc...త్వరగా...త్వరగా పారిపోండి.

(ప్రయోక్త: అంటూ వైకుంఠం పరుగు పుచ్చుకొన్నాడు. గోడ్డువెనక్కి జారుతోంది. చెట్లు, యిళ్ళు, బళ్ళు, వెనక్కి పోతున్నాయి. కానీ, వైకుంఠం ఏటు వైపూ చూడటంలేదు. అతనలా పరుగెడుతూనే వున్నాడు. కారుతున్న చెమటను తుడుచుకొంటున్నాడు. అడ్డమొస్తున్న క్రాపును సరిచేసుకొంటున్నాడు. అలా చాలాదూరం పరుగెట్టాడు. విపరీతంగా ఆయాసమొచ్చింది. డొక్కలు యెగిరిపడుతున్నాయి. ఊపిరి పీల్చడమే కష్టమయింది. ఇక నడవనుగూడా నడవలేకపోయాడు. కాళ్లు గుదులుకట్టాయి. ప్రక్కనేవున్న ఓ యింటి అరుగును ఆశ్రయించాడు వైకుంఠం.

వైకుం: ఇవ్వాళ యెవరిముఖం చూశానో గానీ, భలే గండం తప్పించుకొన్నాను. నిజంగా అదృష్టవంతుణ్ణి. కాకపోతే, ఆకిషన్‌లాల్ ఒక్క పట్టాన నన్ను వొదిలి వుండునా...? నే నెంత ప్రయత్నించినా, బకాయి వెళ్లమారటం లేదు. అప్పులు చేయక తప్పటం లేదు. ఎక్కడెక్కడి డబ్బూ తిండిక్రింద హతమారిపోతోంది. ఇక అప్పెలా తీర్చను...? వచ్చే వాడీ - యేమో త్రిమో చెల్లువేస్తే, అది కాస్తా వడ్డీక్రింద జమపడి, అసలు అలాగే వుండిపోతుందాయె. సాధ్యమయినంతవరకూ, ఆ కిషన్‌లాల్ గాడికి అందకుండా తిరుగుతున్నాను. తపేమని వీధిమూల యెదురయ్యాడు. గుప్పెడు దుమ్ము ముఖాన చిమ్మి కాలికి బుద్ధి చెప్పాను. లేకపోతే, యింకేమయినా వుందా...? నా పరువు నిలువునా తీసేవాడు. అరె...యిదేమిటీ...నాగుడ్డ లిలా తడిశాయేం...?

(ప్రయోక్త: అని వైకుంఠం ముందుకు చూశాడు. చిత్తడిగా వాన, కాటుకలా చీకటి. వైకుంఠం చొక్కావిడిచి పిండాడు. తల తుడుచుకున్నాడు. బురద చిందింది గావును, ధోవతి అలుగ్గుడ్డలా తయారైంది. గాలితీవ్రతకు జల్లు వసారాలోకి పడుతోంది. ఇక అక్కడ ఉండటం భావ్యం కాదనుకొన్నాడు. వానతగ్గేవరకూ, ఈ యింట్లో తలదాచుకోవటం మంచిదనుకొన్నాడు. అనుకొని మెల్లిగా తలుపు తట్టాడు. లోపలినుండి...

స్త్రీ కంఠం: ఎవరండీ...?

వైకుం: నే నే - నేను...

స్త్రీ కం: నేననుకొంటూనే ఉన్నాను. మీరు తిరిగొస్తారని. యిందాక నేను వద్దన్నా వినిమీరు వెళ్ళారు. ముద్దగా తడిసిపోయి వున్నారు. నామాట విన్నట్లయితే, ఉండండి.. లాంతరు తెస్తున్నాను. ఓహ్...యెవరండీ మీరు...?

వైకుం: మాది చాలా దూరదేశమండీ. ఈ ఊళ్ళో బంధువులున్నారు. చూసిపోదామని వచ్చాను. మధ్యలో నే వానవచ్చింది. అందాకా, యీ గడపదాక నిలుచుంటాను. మీకేమీ అభ్యంతరం లేదుగదా...?

స్త్రీ కం: ఫరవాలేదు. ఇలా లోపలకు వచ్చి నిలుచోండి. వెధవజల్లు...మరీ లోపలకు కొడుతోంది.

వైకుం: ఈ ఊళ్లో వైకుంఠంగారని - మీకు తెలిసే వుంటుంది.

స్త్రీ కం: నే నెప్పుడూ చూడలేదండి. మావారు, యెప్పుడో అతన్నిగురించి చెప్పినట్లు జ్ఞాపకం.

వైకుం: అతను నాకు చాలా దగ్గరబంధువండీ. దూర దూరాల్లో వుండడం మూలాన్ని రాకపోకలు అట్టే లేవు. ఈ మధ్య వాడి నాన్న జబ్బున పడ్డాడుట. చూచిపోదామని వచ్చాను.

స్త్రీ కం: క్రొత్తవారుగదా! ఈ రాత్రి ఆ వైకుంఠంగారి యిల్లు కనుక్కోగలరా..?

వైకుం: ఈ ఉత్తరంలో యింటి అడ్రసు కూడా రాశాడండి. ఏ బండినో కట్టించుకొని—

స్త్రీ కం: కాకపోతే, యీ రాత్రి మా యింట్లో వుండిపోండి. ఉదయమే మావారు పంపిస్తారు. వారుగూడా వచ్చే వేళయింది.

వైకుం: ఆహా! ఈనాడు నా జన్మ సార్థకమయింది. ఎన్నో యుగాలనుండి నేను

ఈ నెల మహోన్నతమైన "సంక్రాంతి" బంపర్!

భారత్ క్రాస్‌వర్డ్స్ రూ. **1,00,000** REGD NO 1866

4 బహుమతులు మొదటి బహుమతి రూ. **50,000** ఇతర బహుమతులు రూ. **50,000**

బయటఊరు పోస్టు తేది **6-1-55.** మదరాసు ముగింపు తేది **8-1-55**

1	భారతీయ పురాణములలో — ఎవరేది కోరిన అది ఒసంగునని [చెప్పబడుచున్నది	కల్పతరు	కామధేను
2	—ఉన్నతమైన మతము లేదు	సత్యమునకంటె	ప్రేమకంటె
3	చట్టము—చెప్పబడుచున్నది ...	కఠినమైనదని	నిష్పక్షపాతమైనదని
4	కొందరు ధనవంతులు చాల—యుందురు ...	లోభులుగా	దానపరులుగా
5	—నిర్మూలించిన నేగాని, ప్రభుత్వము స్థిమితముగాయుండజాలదు..	ప్రతిపక్షాన్ని	అనీతిని
6	సత్ప్రవర్తనవంతులు వారి—బహిరంగముగా ఒప్పుకొందురు ...	ఓటమిని	లోపములను
7	—ఖడ్గముకన్న బలమైనదని చెప్పబడుచున్నది ...	ప్రేమ	కలము
8	—ప్రజల క్షేమమునకై లక్ష్యమొనరించుచున్నది ...	ప్రజాపాలన	సమూహ పాలన
9	వైజ్ఞానిక వృద్ధికూడ ఇంతవరకు—జయింపలేదు ...	భూకంపముల	తుఫానుల
10	కష్టాదులలోయున్న మానవుడు తన—సహాయమెదురుచూచును ...	బంధువులనుండి	స్నేహితులనుండి
11	పెద్ద రైల్వే జంక్షనులందు—సహజము ...	జన ఒత్తిడి	సందడి
12	నిర్ణయములేని వ్యాపారములందు—సహజము ...	లాభము	నష్టము
13	—ఎవరికైనను వేచియుండదు ...	కాలము	అలలు
14	—ఎంతటి బలశాలియైనను బలహీనుని చేయును ...	ఇడుములు	వ్యాధి
15	—కొందరి విద్యార్థులకు చాల తలనొప్పి ...	చరిత్ర	లెక్కలు
16	—దేశదేశములందును వ్యత్యాసముగ యుండును ...	ఆచారములు	డబ్బు చెల్లుబడి

వరుస 1-కి రు. 1. రు. 3-కి 4 వరుసలు. రు. 6-కి 16 వరుసలు. రు. 8-కి 32 వరుసలు. రు. 16-కి 128 వరుసలు.

1
2
3
4
5
6
7
8
9
10
11
12
13
14
15
16


ముఖ్య గమనిక :—పోటీదారులు భారత్ క్రాస్‌వేర్డ్స్ షరతులకు బద్ధులు. మనియార్డరు రసీదు లేక వచ్చు కూపనులను, మద్రాసు ముగింపు తేదికి పిమ్మట వచ్చు కూపనులను నిరాకరింపబడును. రు. 2-కి తక్కువ వసూలుకు కమిషన్ లేదు.

Name ______________ Collctor No. ______

Address ______________

M.O. Rpt. No ______ Rs. ______ Coupon Rpt. No ______ Date ______


NO. 127



విశేష బహుమతి! ఈ పోటీయందు మొదటి బహుమతి పొందు ఒక్కొక్కరికి 1 B.S.A. సైకిలున్ను, రెండవ బహుమతి పొందు ఒక్కొక్కరికి ఒక 15 జువల్స్ చేతి గడియారమును బహుమతిగా ఇవ్వబడును.

గొప్ప అవకాశము! మీరును ప్రయత్నించండి!! విజయము తప్పదు!!!

అన్నిచోట్ల, కలెక్టర్లు, డిపో ఏజెంట్లు కావలెను. దరకాస్తులకు 0-2-0 స్టాంపు పంపవలెను.



BHARATH • CROSSWORDS • 75, HARRIS ROAD, - MADRAS • 2.

★ [illegible] ★

అన్వేషిస్తున్న నా స్వప్నసుందరి, ఇక్కడ యిలా ప్రత్యక్షమైంది. ఒహ్హో....యేమి సౌందర్యం...యేమి తారుణ్యం...

స్త్రీ కం: (భయంతో) ఎవరవయ్యా నువ్వు...? ఏమిటా మాటలు. మనిషివి కాదూ...? వానలో వున్నావుగదా అని-లోపలకు రానిస్తే - యిదిటయ్యా నువ్వు చేసే పని...?

వైకుం: ఇదుగో చూడండమ్మా! ఇక్కడ - మీరు - నేను తప్ప, యెవ్వరూ లేరు గదా, మీరీ మాటలన్నీ యెవరి నంటున్నట్లు...?

స్త్రీ కం: ఎవరన్నా వుంటే - నీ వీపు యెప్పుడో బద్దలయివుండేది. ఊఁ.. ముందు బైటికి నడువ్. లేకపోతే, నలుగుర్నీ పిలిచి గడ్డి పెట్టిస్తాను.

వైకుం: ఎందుకలా కోపగించుకొంటారండీ...?

స్త్రీ కం: నోర్ ముయ్. ముందు బైటికి నడు ఊఁ...నడువ్......దొంగ వెధవ. ముచ్చులాగా వచ్చి...యివిట్రా నువ్వు అనవలసిన మాటలు. నేను నీ స్వప్నసుందరినా, నాకోసం వెదుకుతున్నావా. ? తాగుబోతువెధవ... తాగుబోతువెధవాని...

వైకుం: (దీనంగా) అమ్మతోడమ్మా! భగవంతుని సాక్షిగా చెబుతున్నాను ఒట్టు వేసుకుంటున్నాను నే నా మాట అనలేదండీ

స్త్రీ కం: సరేలే వెళ్లు. లేకపోతే, నలుగుర్నీ పిలిచి...

వైకుం: (రుద్ధకంఠంతో) లేదు. లేదు. నే నా మాట అనలేదు ముమ్మాటికీ అనలేదు. మనసులో అనుకొన్నాను. అంతే. ఊరికే — మనసులో అనుకొన్నాను. నా ఆలోచనలన్నీ అందరూ వింటున్నారు. నా స్వగతాలు ప్రతివారికీ వినిపిస్తున్నాయి. హయ్యో! నే నెలా బ్రతకను...? ఏమి చెయ్యను. నే నెక్కడో చెడిపోయాను ఎక్కడో తప్పిపోయాను. దయచేసి నన్ను కాస్త వెదకండి. వెదికి - నన్ను నా కొప్పగించండి.

ప్రయోక్త: అన్నాడు వైకుంఠం. అతను మాట్లాడే ధోరణిచూచి, యింటావిడ జడుసుకొంది. దభీమని తలుపు వేసుకుంది. వైకుంఠం గట్టిగా నిట్టూర్చాడు. భరాలున వీధిలోకి దూకాడు. ఎవరో ధనికుడు వీధిలో హత్యగావింపబడినట్లు చెప్పుకొంటున్నారు. ఈ జనంలోంచి బైటపడి అతను యింటికొచ్చేసరికి చాలా ప్రొద్దుపోయింది. అయినా భార్య - అతనికోసం కనిపెట్టుకొని కూచునివుంది. అతను తూలుకొంటూ వచ్చాడు. భార్యలేచి...

భార్య: ఇప్పటిదాకా రాలేదేమండీ...?

వైకుం: చిత్తం. ఈపూట కాస్త ఆలస్యమయిందండీ మా ఆవిడ నిన్ననే పుట్టింటికెళ్లిందండీ అదీగాక నాకు పెద్దదిక్కంటూ యెవరూ లేరండీ అందుచేత, నేనే చెయ్యి కాల్చుకోవలసి వచ్చిందండీ. ఇంకెప్పుడూ లేటుగా ఆఫీసుకు రానండి

భార్య: (నిట్టూర్చి - దిగులుగా) లేవండి.

(49-వ పేజీ చూడండి)

పెద్దకథ:

సుశీల

1

ఆమె పేరు సుశీల. అతడు సుగుణభూషణరావు. సుశీల తండ్రి పద్మనాభరావుగారు జిల్లా జెడ్జిచేసి కొద్ది నెల్లకు పూర్వమే పింఛను పుచ్చుకున్నవాడు. ఆస్తిపాస్తుల విషయంలో ఆయన మొదట్నించీ జాగ్రత్తగల మనిషే అనాలి. భూవసతి యెంత వున్నదో ఖచ్చితంగా తెలియకపోయినా, బెజవాడలో మూడు మేడలున్నయ్; ఒక దాంట్లో తాము ఉంటూ రెండు అద్దెకిచ్చివున్నారు. మద్రాసులో వున్న మరొక మేడను ఏదో బ్యాంకు ఆఫీసుకి అద్దెకిచ్చారు. మొత్తంమీద సంవత్సరానికి ఆరు వేలదాకా వారికి యిళ్లమీదనే ఆదాయం వస్తుందంటారు తెలిసినవాళ్లు.

పద్మనాభరావు గారికి పుత్రసంతానం లేదు, ఇద్దరే ఆడపిల్లలు. సుశీల రెండో కూతురు. పెద్ద అమ్మాయిని బెంగుళూరులో యిచ్చారు. అతగాడు ఈమధ్యనే 'ఇండియన్ అడ్మినిస్ట్రేషన్ సర్వీసు'లో నెగ్గాడట. రెండవ కుమార్తెను ఆంధ్రలోనే వొక సంపన్నుల యింట్లో యివ్వాలని ఆలోచించుతూ వుండగా సుగుణభూషణుడి తండ్రి శ్రీనివాసరావుగారితో పరిచయమైంది.

శ్రీనివాసరావుగారు మొదట్లో అంత కలవాడు కాకపోయినా స్వప్రయోజకత్వం వల్లనే వొక లక్షాధికారి కాగల్గాడు. వారిది బెజవాడ దగ్గర్లోనే వొక గ్రామం. బ్రతుకు తెరువు చూసుకోవడంకోసం పైపంచతో పట్టణానికి వచ్చాడు. కొందరి మిత్రుల ప్రోత్సాహం వల్లనైతేనేం, అప్పట్లో ఆయన కదే ఉత్తమంగా తోచడంవల్లనైతేనేం కంట్రాక్టు వ్యాపారంలో కాలు పెట్టాడు. ఆనాడే కుడిభుజం అదిరింది. అదృష్టానికి నాందీ పలికింది. కాలచక్రంతో పాటే శ్రీనివాసరావుగారి జీవితచక్రం దశలు దాటుకుంటూ అప్రతిహతంగా అభ్యుదయ మార్గాన పురోగమించింది. ఈ నాడు ఆంధ్రలోగల అదృష్టవంతులలో శ్రీనివాసరావుగారొకరు. ఒక చిన్న అరకుగుల వంతెననించి అరవైలక్షల విలువగల వొక బ్రిడ్జివరకూ జరిగిన కాంట్రాక్టుల్లో ఆయనకు భాగం వుంటూనే వచ్చింది. ఆయన స్వంతం అని చెప్పుకోబడే మూడుబస్సులు ఇప్పటికీ వొక పెద్దలైనుమీద నిరుపద్రవంగా ప్రయాణీకుల్ని చేరవేస్తూనే వున్నయ్. ఇదిగాక ఒక పెట్రోల్ బంకులో భాగం, పేరుమోగిన ఒక హోటల్లో వాటాకూడా వున్నట్టు జనానీకానికి తెలిసిన సత్యమే.

శ్రీనివాసరావు గారికి సుగుణ భూషణరావు ఒక్కడే కొడుకు కావడంవల్ల ఆస్తికంతకీ అతడే అధికారి కాగలడనే ఆశ కలిగింది పద్మనాభంగారికి. అంతకుముందు నించీ తానెవ్వరికోసం యీ ఆంధ్రావని

◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆

ఘట్టి కృష్ణమూర్తి

◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆

అంతా గాలించాలనుకొంటున్నాడో అతను తానున్న పట్టణంలోనే విలయడం ఆయనకు బ్రహ్మానందమయ్యింది. వెతగబోయిన తీగ కాలికి తగిలిందనుకున్నాడు.

అప్పటికి సుగుణ భూషణుడు బెజవాడ కాలేజీలోనే బి. ఏ. సీనియర్ చదువుతున్నాడు. అక్కడే ఇంటర్ సీనియర్‌లో చదువుతున్న సుశీలకు అతణ్ణి యేదోవిధాన పరిచయం చెయ్యాలనే పద్మనాభంగారి ప్రయత్నం సఫలమయింది. శ్రీనివాసరావు గారితో పరిచయమూ మరింత బలపడింది. అడపాదడపా యేదో పని కల్పించుకుని కాలేజీకి వెళ్లి అతణ్ణిగురించిన వివరాలన్నీ స్వయంగా తెల్సుకున్నాడు పద్మనాభంగారు -

అతను క్లాసులో చురుగ్గానే వుంటాడని, మార్కులుకూడా 1, 2, తరగతులలోనే యింతవరకూ వస్తూవున్నాయని, కాలేజీలో జరిగే వార్షికోత్సవాల సందర్భంలోగానీ, మరి యితర సమావేశాల విషయంలోగానీ సుగుణ భూషణుడు పాల్గొన్నవే చాలా వరకూ వున్నయ్యని, నాటకాలు, వ్యాసాలు ఉపన్యాసాలలో గత మూడుసంవత్సరాల నించీ యితడిదే మొదటి బహుమానమని - వొకనాటిరాత్రి యివ్వన్నీ సుశీలకు విన్పించాడు పద్మనాభంగారు -

"మన ఆంధ్రలో యింతకంటే మంచి సంబంధం దొరకడం కష్టం నువ్వు సరేనంటే మిగతావిషయాలన్నీ శ్రీనివాసరావు గారితో అడిగి తేల్చుకుంటానన్నాడు.

ఆ మర్నాడు అతణ్ణిగురించి సుశీల కొన్ని తెలుసుకున్నది కాలేజీ విద్యార్థినుల సహాయంతో—ఆ సంగతే తండ్రికి చెప్పి తనకితడంటే ఇష్టంలేదన్నట్టు తేల్చింది - మొత్తం మీదచదువులో తెలివిగలవాడేనన్నది. కాని పుస్తకాలపురుగై యెప్పుడూ చదువుతూ వుండడంవల్ల ప్రపంచజ్ఞానం అంతగా అలవడలేదన్నది. అతడికి లెక్కలన్నా, సైన్సు అన్నా గొంతులో వెలక్కాయ పడుతుందన్నదే. అందుకనే మూడవ పార్టులో తెలుగు అభిమాన భాషగా తీసుకుని చదవడంవల్ల బయటి ప్రపంచానికి అతడెన్నడూ పనికిరాడన్నది. ఆ భాషలో చదివే ప్రాచీనగ్రంథాలతోపాటు కొన్ని మూఢవిశ్వాసాలుకూడా వారిలో పాతుకుపోయే ప్రమాదం వున్నది. నాగరక జీవితానికి అలవాటుపడే తాహతు వారికి ఉండదన్నది. దేనికీ ముందడుగు వేయలేరు, అటువంటి వారితో బ్రతకడం నరకతుల్యమే నని తేల్చింది సుశీల.

—అయినా పద్మనాభంగారు కూతురి అభిప్రాయాలకు భిన్నంగా యిలా చెప్పుకుపోయారు—

"శ్రీనివాసరావుగారీ పట్టణంలో గల పెద్దమనుష్యుల్లో వొకరు. స్వప్రయోజకత్వం వల్ల పైకివచ్చినవాడు. బొత్తిగా వొక డిగ్రీ అన్నా వుండకపోతే బాగుండదనే వుద్దేశ్యంతోనే కొడుకుని బి. ఏ. చదివించాడు. కాని అతను ఉద్యోగంచేసి సంపాదించాలనే మాటలేదు. పరీక్షులైన మొన్నాటినించే కొడుక్కికూడా తనతోపాటే యీ వ్యాపారంలో అనుభవం గడింపచెయ్యాలని ఆయన కోరిక. గ్రూపులు యేవైతేనేం; ఇంతటి ఆస్తికి వారసుడు కాగలవాడు అక్షరజ్ఞానం కలిగి తన వ్యవహారం చక్క

ట్టుకో గల్గినవాడై వుండేచాలు. ప్రపంచపు నడకల్ని అర్థంచేసుకో గలిగితే అతడే జీవితాన్ని చక్కదిద్దుకుంటాడు. అతని అభిరుచు లేమిటో యీ నాడే వూహించుకుని నిరుత్సాహపడడం అంత బాగుండదేమో..." అని.

"అదికాదు నాన్నా, పదిమందిలో సరదాగా తిరగడమన్నా, కబుర్లు చెప్పడమన్నా అతను చెడ్డ అసహ్యించుకొంటాడట!" అన్నది సుశీల.

"అలా కాదమ్మా, చదువుకునే విద్యార్థికి యెవ్వరితో అవసరాలుంటయ్ చెప్పు! నాలుగు రోజులుపోతే అందరూ అతని దగ్గిరకే వస్తారుగదా!" అంటూ మనసులో మోసులెత్తిన ఆశలను కళ్ళల్లో కనబరుస్తూ కూతురి మొహంలోకి చూశాడు పద్మనాభంగారు. "నువ్వన్నింటికీ యిలాగే చెబుతావు అతని కసలు ప్రపంచజ్ఞానమే లేదంటేను" అని సణుక్కుంటూ అక్కణ్నించి లేచి వెళ్లింది సుశీల. 'ఇంకా చిన్నతనం' అని గొణుక్కుంటూ తల పంకించి వూరుకున్నాడు జడ్జీ గారు—

2

శ్రీనివాసరావుగారి మేడ, ఆ పేటలో పెద్దవారి యిళ్ళవరసలోనే వున్నది. తాను ముమ్మరంగా కాంట్రాక్టు వ్యాపారం చేసే రోజుల్లోనే సిమ్మెంటుతోను, ఇనుముతోను పోతపోయించి కట్టించాడు. ఆ వీధి మలుపు తిరిగేసరికే రెండు ఫర్లాంగుల దూరానికి పచ్చని దీపం వెలిగే ఆర్చి వొకటి, ఆ దీపం 'కిందుగా ధర్మనిలయం, అనే పంచరంగుల అక్షరాలు ఎవ్వరినైనా యిట్టే ఆకర్షించేయగలవు.

సైకిల్ రిక్షా సిమ్మెంటు రోడ్డుమీద సాఫీగా సాగిపోతుంటే తాపీగా యేదో ఆలోచించుకుంటున్న జడ్జీగారు 'ధర్మనిలయాన్కి కొచ్చాం బాబూ!' అనే రిక్షావాడి అదిలింపుతో తుళ్ళిపడి, కొంకికర్ర కింద మోపి అడుగు రోడ్డుమీద పెట్టారు.

ఒక్క గడియసేపు లోపలకు చొరబడడానికి సందేహించారు. దానికి తగిన కారణంకూడా లేకపోలేదు. ప్రస్తుతం తనువికాంతంగా సంప్రదించడానికి శ్రీనివాసరావు గారింటికి వచ్చాడు. కాని లోపల నలుగురైదుగురు వ్యవహారం తేల్చుకునే ధోరణిలో మాట్లాడుకు పోతున్నారు. ఇప్పుడు తాను హఠాత్తుగా అడుగుపెట్టి వారి సంప్రదింపులకు భంగం కలిగించడమా, వెనక్కు నడవడమా, అని వో ఘడియసేపు గుంజాటన పడ్డారాయన—

శ్రీనివాసరావుగారిని ప్రస్తుతం వొకటే సమస్య యెదుర్కొంటున్నది. తాత్కాలికంగానైనా రాజధాని విజయవాడ గుంటూరుల ప్రాంతానికి రాకపోవడంతో తాను అంతకుముందునించీ వేసుకొంటున్న కొన్ని సమగ్రమైన పథకాలకు భంగం వాటిల్లింది. దీనిని ఇంతటితోనే మడిచిపెట్టి వూరుకోవడమా లేక ఏదోవొక మార్గాన సాఫల్యం సంపాదించడమా అనేది ఒక సమస్య. తనలాటివాడు—జిల్లాలో ప్రముఖ కంట్రాక్టర్లలో వొకడుగా పేరుపొందినవాడు—తాత్కాలిక విఘాతాలవల్ల నిరుత్సాహుడై చేతులు ముడుచుక్కూర్చోవడం ప్రాణహానికంటే భయంకరంగా తోచింది. అదే సమస్యకు పరిష్కారావకాశంకోసం తోటివారు అయిదుగురితో సంభాషణలు సాగిస్తున్నాడు ప్రస్తుతం. వారి సంప్రదింపులలో ప్రపంచ రాజకీయాలవగ్గిర్నుంచీ, స్వతంత్ర దేశాలు, రాష్ట్రాల అవతరణ, రాజధానుల నిర్మాణం అందుకు కంట్రాక్టర్ల బాధ్యతలు, విధులు మున్నగు విషయాలు పుంఖానుపుంఖంగా దొర్లిపోతున్నయ్ - అయితే ప్రస్తుతం రాజధాని నిర్మాణం - తాత్కాలికంగానే కానీయండి - మరో మారుమూల నిర్మింపబడుతుందనడం, అందుకు అవధికూడా నిర్ణయింపబడడం జరిగినై. ఇప్పుడు తమ కర్తవ్యమేమిటి? అనే ఆలోచనే వారి నింత వివాదానికి గురిచేసింది. సంభాషణలు తీవ్రధోరణిలో సాగిపోతున్నయ్. కొంతసేపటికి వొక నిర్ణయానికి రాకుండానే సమావేశం రేపటి ఉదయానికి వాయిదా వేసుకుందామనుకున్నారు. సాధారణమైన ఏవో విషయాలుమాత్రం చర్చించుకుంటున్నారు. సరిగ్గా పద్మనాభం గారు గేటు తలుపు తీసుకుని లోపల అడుగు పెట్టడం వారు కుర్చీలలోనించి లేవడం వొకేక్షణాన జరిగినై. జడ్జీగారికి స్వాగతం పలకడం, కంట్రాక్టరు సోదరులకు గుడ్ నైట్ అనడం వొకేసారి నిర్వర్తించుకున్నాడు శ్రీనివాసరావుగారు

పద్మనాభంగారిలా తలవనితలంపుగా తన కోసం రావడం ముందుగా కొంత విభ్రాంతి కలిగించకపోలేదు రావుగారికి. అయినా లౌకికవ్యవహారాలలో నిగ్గుదేలిన వ్యక్తి కనక తనలో కలిగిన యీ భావం పైకి వ్యక్తం కాకుండానే యిష్టాగోష్ఠి సంభాషణలోకి దిగాడు. జడ్జీగారు, తాను కార్యార్థికనక వచ్చినవిషయం వెల్లడించక తప్పిందికాదు. రావుగారింట్లోనూ పిల్లా మేకా యెవ్వరూ లేకపోవడంవల్ల వారి యేకాంతసంభాషణకెట్టి ఆటంకమూ కలగలేదు. సుగుణభూషణుడు వీరి విషయం పట్టించుకోనట్టే తన గదిలోకూర్చుని యేదో ప్రబంధం సవిమర్శంగా చదువుకొంటున్నాడు; ముఖ్యమైన ఘట్టాలను వ్రాసుకొంటున్నాడు.

తాను వచ్చిన వ్యవహారం సంగతి బైట పెట్టాడు జడ్జీ గారు. ఆఁ.హా!...అన్నాడు శ్రీనివాసరావుగారు. 'అయినా అబ్బాయిని కూడా అడిగి చూడాలి. బి. ఏ. పరీక్ష పూర్తయ్యేవరకూ వాడూ వివాహంమాట తల పెట్టనన్నట్టుగా విన్నా న'న్నారు. 'నా అభ్యంతర మింతేను, వాడు వొప్పుకుంటే యేక్షణానైనా జరిపించేయ గల' నన్నారు.

"అయితే చదువు పూర్తిఅయాక్క కార్యక్రమం యేవిఁటంటారు? అతణ్ణికూడా యీ వ్యాపారంలోనే..." అంటూ ఆసక్తితో అటు చూశాడు జడ్జీగారు.

"అంతేనండీ, లేకపోతే యీ రోజుల్లో చదువులవల్ల సంపాదించి యేడిసిందెవరంటారు? కాకపోతే అప్పటి రోజులు గనక అక్షరజ్ఞానంతోనే అన్నీ చక్కబెట్టుకొచ్చాం. ఈనాడు ప్రతివాడికీ యేదో వొక డిగ్రీవుండడం వొక ఫాషను. అయినా వాడికంత ఆయువూ వచ్చినట్టు తోచదు. కొంత ప్రపంచజ్ఞానమన్నా తెలుస్తుంది కదా అని చదివిస్తున్నాను. ఊళ్లో కాలేజీ కదా!" అన్న శ్రీనివాసరావుగారి సంభాషణల ధోరణిలో జడ్జీగారి సందేహాలకు చాలా సమాధానాలు దొరికినై. ఇలా అన్నాడు. "నేనూ అదే అనుకొన్నానండీ!

ఎలాగైనా నాలుగు రోజుల పాటు ఇంటావిడకు దూరంగా ప్రశాంతంగా కాలక్షేపం చెయ్యాలని ఆయనకు ఒక కోరిక పుట్టింది. సాయంత్రానికే తిరిగి వస్తానని ఆవిడతో చెప్పి ప్రయాణం అయినాడు. రైలు కదిలే సమయానికి మెల్లిగా చెప్పాడు.

"ఒక వేళ సాయంత్రానికే కనుక రాలేకపోతే నీకు టెలిగ్రాం ఇస్తాను. ఏం?"

"ఎందుకండి వృథాగా డబ్బు ఖర్చు చెయ్యటం. మీరు వ్రాసి కోటు జేబులో పెట్టుకున్న టెలిగ్రాం ఫారం నేను ఇంటి దగ్గర ఉండగానే చదివేశాను.


వానాకాలం

★ సుశీల ★

ఉద్యోగాలలో వుండే క్లిష్టతను పూర్తిగా అర్థం చేసుకొన్నవాడిని కనక చెబుతున్నాను. ఈ రోజుల్లో వుద్యోగస్థులంటే గౌరవమే పోయింది బొత్తుగా. పెద్దపెద్ద ఉద్యోగాలలోనే తల ప్రాణం తోకకు వస్తున్నది. ఈ గ్రాడ్యుయేట్లవంక జూసేదెవరు? తెల్లారిలేసే యేమూలజూసినా వీళ్ళే అయిపోయినారు. వ్యాపారంలో వున్న స్వతంత్రజీవనం ఉద్యోగాలవల్ల సాధ్యం కాదు సుమండీ! అమ్మాయిని ఇంటర్ వరకూ చదివించినా కేవలం ప్రపంచజ్ఞానం దృష్టితోనే ఈ పరీక్షలు కాగానే మాన్పించేస్తాను. పిల్లలవిషయంలో నాకూ పట్టుదల హెచ్చే! మన స్నేహం క్లబ్బుగోడలతోనే పరిమితం కాకూడదని నా తలంపు. ఒకరినొకరం అర్థం చేసుకున్నవాళ్లం తాహతుకి తగిన సంబంధం చేస్తే అమ్మాయి సుఖపడుతుందనే యిలా వచ్చాను. మరి మీరు కూడా అందుకు కాదనకుండా వుంటే శుభం అనుకుందాం" అంటూ జడ్జీగారు చాలించారు.

శ్రీనివాసరావుగారు మొదటిమాటనే మరల ఆవృత్తిచేసి అబ్బాయి అంగీకారమే నా అంగీకారమన్నారు అందుకుకొంత అవకాశం యివ్వదల్చుకున్న జడ్జీగారు తాత్కాలికంగా సమ్మతించి యింటికి వెళ్లిపోయారు.

3

శ్రీనివాసరావుగారికి యిదీ సముచితంగానే తోచింది జడ్జీగారి సంబంధం ఖాయమవాలేగాని తను సమానఫాయాలోవున్న వొకరితో వియ్యంపొందినవాడౌతాడుగా! పద్మనాభంగారినాడు పింఛను పుచ్చుకొని వుండవచ్చు. కాని అది యెంతలేదన్నా యింగువకట్టిన గుడ్డ. ప్రస్తుతం తనకి న్యాయశాస్త్ర సంబంధమైన కొన్ని సలహాలు కావాలి! కేవలం తమకున్న స్నేహాన్ని పురస్కరించుకొని అడిగేకంటే, వియ్యం పొందిన తరవాతనే వారితో ఆ విషయమై సంప్రదించడం బాగుంటుందికదూ! అవసరమైతే ఆయనా కొంత భారం పైన వేసుకోగలడు కూడా.

రాజధాని విజయవాడకు రాకపోవడంతో తను వేసుకున్న పథకాలన్నీ తారుమారయినై. పోతే యిప్పుడు మధ్యప్రదేశ్‌లో కొన్ని వ్యవహారాలు పరిష్కారం కావాలి. చాందాలో కొన్ని తావులందు ఫారెస్టు కాంట్రాక్టుకు అవకాశం వున్నదని అది లాభసాటిగానే వుండవచ్చునని మిత్రుడు గంగాధరం వ్రాశాడు అక్కడ తను పలుకుబడి సంపాదించడం నేటి పరిస్థితుల్నిబట్టి ముఖ్యావసరం. కాగా పోగా విశాలాంధ్ర యేనాటికైనా అవతరించవచ్చు. చాందాజిల్లాలో కొంతభాగం ఆంధ్ర ప్రాంతానికి అంటివున్నదనేది ప్రత్యక్షసత్యం. అక్కడ తనొక ఆంధ్రప్రముఖుడుగా పేరుపొందితే ముందుముందు కోటలో పాగా వేసినట్టేగా!

పుటిన భూమిని వదిలిపోలేకనే యింత కాలం యీ విజయవాడలో కొట్టుమిట్టాడుతున్నాడు. అయినా అభివృద్ధి సూచకమైన వాతావరణం సన్నగిలుతున్నట్టున్నది. ప్రతి వ్యవహారానికీ వివాదాలు పెరగడం తప్ప తనమట్టుకు తనకు అభ్యుదయం అడుగంటుతున్నట్టే వున్నది.

తను ఇండియన్ యూనియన్ పౌరుడుగా యీ దేశంలో యే ప్రాంతానికైనా వెళ్ళగల హక్కు కలిగివున్నాడు. దానికి తగిన తాహతులేదని చేతులు ముడుచుకూర్చోవడంలో అర్థంలేదు. ఎక్కడైనా జీవనవిధానం నిర్ణయించుకోగల హక్కు భారత రాజ్యాంగం తనకు ప్రసాదిస్తోంది. ఈరోజుల్లో యిక్కడి బస్సుల వ్యవహారం కూడా అంతంతమాత్రంగానే వున్నది. వీటిని అమ్మివేసి అక్కడే సర్వీసు మొదలు పెట్టవచ్చు.

ఈ సంవత్సరం దాటితే సుగుణ భూషణుడు చేతికి ఆసరాగా వుంటాడుగా!

★ సుశీల ★

అయినా వాడు వట్టి వెంకి వెధవ. అసలు ఇంటర్‌తోనే చదువు చాలించి తనకు చేదోడుగా వుండమంటే విన్నాడు కాడు. బి. ఏ. లు యమ్. ఏ. లు ప్యాసై వీళ్లు అఘోరించేదేమిటి? ధనమూల మిదంజగత్, చేతిలో రూపాయివుంటే పాదిగి పిల్లలు పెట్టించాలిగాని, ఎంత డబ్బు తగలబోస్తే మటుక్కు యీ కాలేజీలు ఉద్ధరిస్తాయ్యా?

జడ్జీగారు చెప్పినట్టు ఈ రోజుల్లో ఉన్న తోద్యోగాలలోనే తలప్రాణం తోకకు వస్తున్నది. అందులోనూ మనవాడు యమ్. ఏ. ప్యాసై యేలెక్చరరో అయితే యేమిటి గౌరవం? అసలీ ఎడ్యుకేషన్ డిపార్టుమెంటువాళ్లకి అధికారం మున్న. దానితోపాటు పలుకుబడీ, మర్యాదాకూడా మన్నా. వెధవది టోపాగుమాస్తాకున్న విలువైనా వుండదు. కంట్రాక్టరు శ్రీనివాసరావు ఏకైకపుత్రుడు లెక్చరరు అనిపించుకొంటే తన కెంత తలవంపులు? వెధవలు ఇలాటి వాళ్లా తండ్రిని మించిన ' కొడుకులు అయేది? పుటకతోనే తనకు సంక్రమించిన యీ వ్యాపారదృష్టి వాడికెందుకు అలవడి వుండకూడదూ? పుస్తకాల పురుగై కూర్చుంటే కాళ్లదగ్గిరకు వచ్చి పడుతుందా లక్ష్మి? ఇంతకూ వాడిసంగతి యేటూ తేల్చుకోనిదే జడ్జీగారికి మాటయివ్వ కూడదు.

ఇంతచేసినా చివరకు వాడు మాట దక్కించుతాడో, లేదో? నాలరోజుల క్రిందట గుంటూరు సంబంధం విషయమై చెప్పినప్పుడు నసేమీ అని మొరాయించాడు. - తిరపతిరావుగారు ఆ పట్టణంలో పలుకుబడిగల వ్యక్తి. వీడు వట్టి దురదృష్టవంతుడు కాకపోతే దానికి నీళ్లొదులుకుంటాడా? ఆయన కూతురు పెళ్లి కూడా యీపాటికి అయిపోయివుంటుంది. చెడిపోయేవాళ్ళకి చెయి అందించి పైకి తెచ్చేవాళ్లెవరు? ఇలా ఆలోచనల త్రాడు అల్లుకుంటూ వుండగానే శ్రీనివాసరావు గారికి కునుకు పట్టింది—

4

కుకుణ భూవణుడికి తెల్లవారుఝామున మూడుగంటలకే మేల్కొని రాత్రి తాను ఆలోచించుకున్న అంశాలను వొక రూపానికి తెచ్చుకొనడం అలవాటు. ఆ సమయంలో అతనికి యెక్కువ ప్రశాంతత గోచరిస్తూ వుంటుంది. ప్రపంచమంతా నిద రోతున్న నీరవంలో కొత్తవూహాలు ఉదయించడం అతడికి అదొక హర్షనీయమైన జీవిత సత్యం.

అప్పుడు తను సమాలోచిస్తున్నది లౌకిక ప్రపంచానికి బొత్తిగా సంబంధంలేని విషయం; అది సాహిత్యోపస్కారకం మాత్రమే. సాహిత్యంలో సమాసానికి గల స్థానమేట్టిది! అనేది అతడి విచారణీయాంశం. వచ్చేవారంలో జరగబోవు చర్చాసంఘంలో దీనిపైనే మాట్లాడాలని యెంతో సామగ్రి సమకూర్చుకుంటున్నాడు. అందుకు తగిన ప్రబంధాలను తదితర గ్రంథాలను తిరగవేసుకొంటున్నాడు.

కొద్దిదినాల క్రిందటనే తమ కాలేజీలో వొక సభ యేర్పాటయినప్పుడు వారివలన కొన్ని మాటలు విని వున్నాడు. ఆనాటి నించీ అతడికీ ఆలోచన తట్టింది. అది యెంతవరకు సత్యమో సమాలోచించి వొక నిర్ణయానికి రావాలని పట్టుదల.

కవి, తాను చెప్పదల్చుకొన్న దానికి ఒక విధమైన గాంభీర్యము, శిల్ప చమత్కృతి ఆపాదింపబడాలనే ఔత్సుక్యంతోనే యిట్టి సమాసప్రయోగానికి పూనుకుంటాడని ఆనాడు అతడు విన్నమాట. అందుకే అల్లసాని పెద్దన చిత్రించిన ప్రవరుడు "అంబర చుంబిశిరస్సరఝ్ఝురీ పటల ముహుర్ముహుర్లుఠద భంగ తరంగ మృదంగ నిస్వనస్ఫుట నటనానురూప పరిఫుల్లకలాపకలాపిజాల" మైన శీత శైలమును గాంచడం జరిగిందా?

సురకన్య మేనక, గాధేయుడి "నేత్ర మార్గ పరిథీకృత మోహన మోహనాంగ రేఖాయతి మానగోపన వికంపిత ముగ్ధతరాంగుళీ గ్రహీతాయత సిక్తచేల కలితాంచిత కాంచి పదాభిరామయై" కన్నుల బడడంలోని ఉత్తేజకత పాఠకుడికి అనుభవయోగ్యమా, లేక ఆస్వాదనయోగ్యమా అనే సంగతి తేల్చి చెప్పివెయ్యాలనుకుంటూ, మరికొన్ని పద్యపాదాలనుకూడా గుర్తువుంచుకుంటూ వొక రూపానికి తెచ్చుకోలేక సతమత మౌతున్నాడు—

అతనికీ సాహిత్యాభిరుచి పెంపొందించిన వాడు అనంతుడు. వాడు ఇంటర్‌లో చేరిన దగ్గర్నుంచీ యిలాటి గ్రంథాల దొంతర్లు చేతబట్టుకొని పొద్దస్తమానమూ వేధించుకు తినడం, ఏ కృష్ణవొడ్డుకో సాయంత్రం షికారు వెళ్లినప్పుడు ఎదట వొక దుకాణం పెట్టినట్టు అన్నీ పరుచుకూర్చోవడం పరిపాటయిపోయింది. తనువద్దన్నా చెవిలో జోరీగలా యెంత సేపటికీ వదిలేవాడు కాదు. వినక తప్పేదీకాదు. క్రమంగా భ్రమరకీటన్యాయ మనేది తనయెడల నూటికి నూరుపాళ్ళు సార్థకమయింది. ఆ పిచ్చి తనను వేధిస్తున్న దిప్పుడు. అదే బి. ఏ. లో మూడవపార్టు తెలుగు తీసుకునేదాకా పాకింది. ఆంధ్రరాష్ట్రం అవతరించాక మరింత బలపడింది.

అనంతానికీ తనకూ యెవరో కొందరు కవులు ఆదర్శంగా కూడా నిల్చారు. అనంతుడితోపాటు తనూ కావాలనే మానసికంగా మారిపోయాడు. ప్రస్తుతపు తన మన స్తత్వమే వేరు; ఊహాలే వేరు. దానితోపాటు తను ఊహించుకుంటున్న ప్రపంచ స్వరూపమే వేరైపోయింది. ఇప్పుడాయన యెన్ని చెబితేమాత్రం యాంత్రికమైన భావాలతో యేకం కావడం యెలా సంభవం? ఒకొక్క యిటుకరాతికే సిమెంటురాచి పేర్చి, వొక వంతెననో, లేదా వొక రాదారి బంగాళానో నిర్మించి అదే చూపులకు సుందరమైన కట్టడమనుకొని మురిసిపొమ్మంటాడాయన. అది కేవలం తన బాహ్యదృష్టికి యింపులు కురిపించవచ్చుగాని మనసు వూహించుకునే తీరే వేరైనప్పుడు అచేతన పదార్థం సచేతనాన్ని వెక్కిరించగలదా? నిర్మించేవాడి హృదయంలో గల యాంత్రికశక్తి యేదో అందులో మిళితమై జీవనరహస్యాన్ని అపహాస్యం పాలు చేస్తున్నట్టు తోస్తుంది తనకి. తానూ వొక భవనం కట్టుకుంటాడు. కాని అది నీరసమైన కాల్చిన యిటుక ముక్కలతో కాదు; నవరసభావం దాల్చిన కమనీయ పదజాలంతో మాత్రమే. సచేతన హృదయం, వూహించి, భావించి నిర్మించింది కనక

అందులో అనుక్షణం చైతన్యరసం పుట్టి పడుతూ వుంటుంది. అమరత్వం ఆవేశించి, అదే పద్యాన్ని కల్యాణతోరణమై ఉజ్వల భావదీప్తితో వెలుగొందింప జేస్తుంది.— ఇలాటి భావనలో తలమునకలై వుండగా తలుపుతట్టిన చప్పుడయి తలెత్తి చూశాడు. గడియారం నాలుగున్నర కొట్టింది. తండ్రి పాదాలు తనవైపుకే నడుస్తున్నట్టున్నయ్. కుర్చీలో కొంచెం వొదిగివట్టుండగా సర్దుకుని డ్రాయరుమీద తెరచిపడివున్న కొన్ని పుస్తకాలు మడిచి దొంతరగా అమరుస్తున్నాడు. ఎదురుగుండావున్న కుర్చీలో కూర్చుంటూనే "... యెంతసేపయిందిరా లేచి?" అనడిగాడు తండ్రి శ్రీనివాసరావు గారు.

"ఇంతకుమునుపే" అని తలయెత్తకుండానే ముక్తసరిగా సమాధానం చెప్పాడు సుగుణభూషణుడు.

"అయితే నీకెప్పుడూ యీ పుస్తకాల గొడవేనా, నే చెప్పేది వినడం యేమైనా వుందా?" అన్నాడు తండ్రి.

"అదేవిఁటి నాన్నా? మీరు చెప్పింది యెప్పుడు వినలేదు, నాకు సరిపడినంత వరకూ వింటూనే వున్నానుగా" అన్నాడు కొడుకు.

"అక్కడే వొస్తోంది తంటా. నాకు సరిపడింది నీకు సరిపడదు, నీకు వొంటబట్టింది నాకు మనసుకెక్కదు. ఎన్నాళ్లని యీ ముసుగులో గుద్దులాట? ఏదో వొకటి తేల్చెయ్యాలిగాని" అని కొంచెం గద్దించి అడిగాడు తండ్రి.

"తేల్చేసేందుకు ఇందులో యేముంది నాన్నా, మీ రడిగేది వొకటేగా, అది మీ వ్యాపారంలో నన్నుకూడా పాల్గొనమంటారు. నా మనస్తత్వాని కది సరిపడదంటాను. నన్ను వృద్ధిలోకి తేవాలనే ఆకాంక్షే మీకువుంటే మరో మార్గం చూపడకూడదా? దీని కింతరాద్ధాంతమెందుకు చెప్పండి!" అంటూ వ్రాసుకుంటున్న కలం జేబులో పెట్టుకుంటూ ఆయనవంక ప్రశ్నార్థకంగా చూశాడు కొడుకు.

"అది [illegible] కాదురా అబ్బాయీ! నేను నమ్మినమా[illegible]యదో నీకు చెబుతున్నాను. నాలుగు డబ్బులు సంపాదించి మనిషిలా బ్రతకడం నేర్చుకోమంటున్నాను. ఈ రోజుల్లో అర్థంలేని వ్యక్తి వ్యర్థుడే" అన్నమాట నాకు తెలుసు. నీ కొయితాలూ పుస్తకాలూ యేనాటికీ కూడు పెట్టలేవు. ఎర్రని యేగానీ దొరక్క యెంతమంది యెన్ని బాధలు పడుతున్నారు? భగవంతుడు ఏదో యిచ్చాడు, దానిని చూపెట్టుకుని ముందు ముందు బ్రతికే మార్గమేదో ఆలోచించాలా, పుస్తకాలకు పురుగై యీ గదిలో కుళ్లి చావాలంటావా? నీ మూలాన నేను వేసుకున్న ప్లానులన్నీ బూడిదపాలై పోతున్నందుకు, చేతికి ఆసరాగావుంటే యెన్ని పనులు చక్కబెట్టుకు రావచ్చు! నీ మూలాన నలుగురిలో తలెత్తుకు తిరగటానికే చస్తున్నాను. గంగాధరం చూడు, వాడు చాందాలో వుంటే కొడు కిక్కడ యెన్ని కాంట్రాక్టులు నిభాయించుకు వస్తున్నాడు?" కొంచెం తీవ్రధోరణిలోనే చెప్పుకుపోతున్నాడు తండ్రి; మాటకు అడ్డువచ్చాడు కొడుకు.

"చాలునాన్నా, మీరు చెప్పేది అర్థం చేసుకోలేనంతటి అజ్ఞానుణ్ణికాదు. డబ్బు సంపాదించే విషయంలో మీ మార్గం వేరు, నా తరహా అంతకంటే భిన్నమైనది. ఎంత చాతకానివాడైనా బ్రతక్క చావడు. జీవితం వెళ్ళమార్చుకోడానికి కావలసిన ఉద్యోగం చేసుకోగలననే ధీమా నాకూ ఉంది"—కొడుకుని యింకా మాటాడనీయడం మానుషం దెబ్బతినేట్టు తోచింది తండ్రికి ఇలా అన్నాడు—"ఏమిటి నీ ప్రయోజకత్వం? ఒక వెధవ మోచేతికింద గంజి తాగడమే ఉద్యోగమా? మనిషై పుట్టినందుకు స్వతంత్రంగా బ్రతకాలి నలుగురిచేతా 'వీడు స్వతంత్రుడురా,' అనిపించుకోవాలి. ఉద్యోగాలుచేసి యీ గొఱ్ఱెతోకలతో కూడబెట్టేదేమిటోయ్? నేను సైపంచతో బెజవాడ వచ్చినరోజునే నౌకరీల్లో చేరినవారంతా యీనాటికీ మింగ మెతుకులేక గుడ్లు మిటకరిస్తున్నారు. ఆ గులామీవాళ్ళల్లోనే చేరాలనా నువ్వుకూడా?..."అంటూ కచ్చిగా కొడుకువంక జూశాడు. అతను తాపీగా యిలా చెప్పుకుపోతున్నాడు.

"నేనూ మీకో సంగతే చెప్పాలనుకుంటున్నాను. ఉద్యోగంచేసిన ప్రతివాడూ గులామైతే దేశం యేమయ్యేటట్టు? ఎవరికింద పనిచేసినా అతడూ దేశంలో వొక పౌరుడేగా! కష్టపడి గంజి తాగినవాడే భాగ్యవంతుడని నా భావం. చెయ్యాలనుకుని చేతినిండుగా పని దొరక్క యేడ్చేవాళ్ళెందరు? మీమట్టుకు మీకు స్వయం కృషివల్లనే పైకివచ్చాననే ధీమా వుండడం సహజమే. కాని అదంతా యథార్థము, న్యాయము అని నేను నమ్మలేను. కష్టార్జితం అనేదానికి అర్థమేమిటో మీకు చెప్ప సాహసించలేను. కాని ఇది కేవలం ధర్మదేవత గృహమేఅంటే యెలా నమ్మగలను చెప్పండి! ఈ యినప దూలాలు, ఈ కిటికీలు, ఈ దర్వాజాలు, ఇవ్వన్నీ కష్టార్జితం అనేదానికి అర్థాలే అంటారా? ఈ యినుముకి బదులు ఏ వంతెనలో, మరే బంగాళాలో గోగుచువ్వలూ గులకరాళ్ళూ చేర్చబడలేదంటారు? ఈనాడు ఈ విజయవాడలో మిమ్మల్నిగురించి నే నెన్ని మాటలు వింటున్నాను? నోరెత్తక తలవాల్చుకు వచ్చేస్తున్నాను. ఏమీ తెలియని అజ్ఞాని అయినా లోకం దృష్టిలో తన విలువ యెంతటిదో గ్రహించగలడుగదా!"

కొడుకు ఎత్తిపొడుపుతో తండ్రికి శివం పెరిగింది. అది యిలా విరుచుకుపడ్డది "ఛీ నోరుముయ్! ఇంటిగుట్టు లంకకి చేటన్నారు. ఎవరో గిట్టని వెధవలు చెప్పుకునే గాలికబుర్లా నీకు ప్రమాణాలు? ఒకడు బాగుపడుతుంటే యింకొకడు ఏడవడం అది లోకంలో సహజం. ఏడ్చేవాళ్ళమాటలు పట్టుకుని నువ్వు నాదగ్గిర అఘోరించడమా?

★ సుశీల ★

శ్రీనివాసరావు కొడుకింత చవట వెధవయ్యాడని అందరూ నవ్వుతున్నార్రా!" గుప్పెళ్లు బిగించి కోపంతో గుడ్లురిమి చూశాడు తండ్రి. కొడుకు మామూలు వైఖరిలోనే యిలా చెప్పుకుపోతున్నాడు—

"ఆ సంగతే మీకు చెప్పాలనుకుంటున్నాను నాన్నా! శ్రీనివాసరావుగారి కొడుకు అప్రయోజకుడనిపించుకోవడం పొరబాటని నాకూ తెలుసు. కాని, పుటకతోనే సహజంగా సంక్రమించిన కొన్ని సంస్కారాలను మాత్రం వాడు వదలలేకపోతున్నాడు. పెరిగిన వాతావరణం యెలాటిదైనా వీడినరాల్లో ప్రవహించేది రామస్వామిగారి రక్తమనే సత్యాన్ని మీరు కాదనగలరా? దానినిబట్టే జీవితవిధానం కూడా నిర్ధారణ అవుతున్నది"—వెర్రిగా అతని మొహంలోకి చూసి "ఛీ నోరుముయ్! ఏమంటున్నావ్?" అన్నాడు తండ్రి, కొడుకు చెప్పుకుపోతూనే వున్నాడు. "యథార్థమే అంటున్నాను. మీ రిన్నాళ్ళనించీ కప్పిట్టిన రహస్యాన్ని నేనీనాటికి తెల్సుకోగల్గాను. నేను రామస్వామిగారి కన్నబిడ్డనని, నా తల్లిదండ్రులు చిన్నప్పుడే చచ్చిపోతే మీరు నన్ను సంతానాపేక్షతో తీసుకువచ్చారనేది యథార్థం కాదంటారా. అయినా ఫరవాలేదు, నేనీ జన్మకు మిమ్మల్నే 'నాన్నా' అని పిలవడం నేర్చుకొన్నాను. మరొకరు ఆ స్థానాన్ని ఆక్రమించలేరు. రక్తస్పర్శ వేరైనప్పుడు స్వభావాలు, ఆలోచనలు కూడా విరుద్ధంగా వుంటయ్యనేది యథార్థం కాదంటారా? తెలుగుభూమిలో వొక కవిగా, కథకుడుగా గణ్యతపొందిన రామస్వామిగారి కొడుకు ఈనాడు కాంట్రాక్టు అఘోరిస్తున్నాడంటే ఆయన ఆత్మకు శాంతి వుంటుందా? అందుకే మీరు చెప్పేది నా చెవి కెక్కకపోవడం. కాని నాన్నా ఇది తప్ప మరేదైనా చెప్పండి! వీడు సానుభూతితో విచారించుతాడు"—

"అవును గ్రహించాను, అంతా అర్థమయింది. ఆ ధీమాతోనే యింతకాలం నాకు చేతికక్కరకురాకుండా బిగదీసుకూర్చున్నావన్నమాట! ఎవరో గిట్టని వెధవలు పురెక్కించివుంటారు. అయినా అతీ గతీ లేని వెధవని తీసుకొచ్చి అందలమెక్కిస్తే యేమవుతుంది మరి!" అని విదిలించి కొట్టాడు తండ్రి. కొడుకు ఇలా నిభాయించుకున్నాడు—"మీరలా అన్నారని నాకు కోపంలేదు ఈ జన్మకి మీరే నా తండ్రిగా చెల్లిపోతున్నారు. ఈ సూక్ష్మమైన భేదం మనల్ని దూరం చేయలేదనే నా భావన. నేను అభివృద్ధికివచ్చే ప్రతి సలహా మీరు చెప్పినట్లుగా వింటాను. మరి నన్ను జీవితంలో ప్రవేశపెట్టి విద్యాబుద్ధులు చెప్పించి వొక మనిషిగా రూపొందించిన వారూ మీరేగా ఆమాత్రం విశ్వాసం నాకు లేదంటారా?"—ఏదో వొక సమాధానం చెప్పాలని యిలా అన్నాడు తండ్రి "నాపైన కృతజ్ఞత అనేది వుంటే నే చెప్పినట్టు చేసుకుపోవాలి. నేనాలోచించిన ప్రతిదానికీ అడ్డంచెప్పి నాకూ కృతజ్ఞత వున్నదంటే సరిపోయిందిరా! నెలనాడు వచ్చిన గుంటూరు సంబంధాన్ని కాదన్నావ్. సరేపోనీ అనుకున్నాను. రాత్రే జడ్జీగారు పద్మనాభంగారొచ్చి మాట్లాడి వెళ్ళారు. నీ మూలాన యేమీ తేల్చి చెప్పడానికి వీల్లేకపోయింది. ఆలోచించి చెపుతానన్నాను. వారి అమ్మాయి సుశీల మీ కాలేజ్ లోనే ఇంటర్ సీనియర్ లో చదువుతోందట."—తండ్రి మాటకు అడ్డువచ్చి యిలా అన్నాడు కొడుకు "అవును సుశీల ఇంటర్ సీనియర్ లో చదువుతున్న సంగతి నాకు తెలుసు కాని,...".—

"కానీలేదు గీనీలేదు, వొప్పుకుతీరాల్సిందే. వచ్చిన ప్రతిదానికీ యేదో వంక పెట్టడం నా తాహతుకు సరిపడదు. అవతల పెద్దమనిషితో పని, అందరిలాగే ఆయన విషయంలోనూ ప్రవర్తించడానికి వీల్లేదు"—

"అయితే నేను తప్పక వొప్పుకుంటాననే యిప్పుడు చెపుతున్నారన్నమాట! కాని వొకటి చెప్పకుండా వుండలేను. జడ్జీగారు పెద్దకట్నం యిస్తాడనో, లేక పెద్ద ఘరానావారితో వియ్యం పొందుదామనే కుతూహలం చేతనో మీరింత ఘట్టిగా నన్ను వొత్తిడిచేస్తున్నారు. అవన్నీ యేనాటి మాటలు! నేను వారి అమ్మాయి విషయంలో బొత్తిగా తెలియనివాణ్ణి కాదుగా! తెల్లవారి కాలేజీ గడపలో అడుగుపెడితే ఏదో ఒక జాయిన కళ్ళబడక మానదు. అంతేగాక నేను కొన్ని వినివున్నాను కూడా. సుశీల వట్టి పెంకె మనిషి. క్లాసులోనే యెవ్వర్నీ లెక్కచెయ్యనట్టు విసురుకుంటూ పోతుంది. ఎదటివారికి యెక్కడలేని అహంభావమూ కనబర్చాలని గాలిపడగలా గెంతుకుపోతుంటుంది. ఒకనాడు మా కాలేజీలో వొక సభలో వొకడు మాట్లాడుతుండగా అతగాడితో లేనిపోని వివాదం పెంచుకుని అందరియెదటా వెక్కిరింత పాలయ్యింది. అలాంటి వాతావరణంలో స్వేచ్ఛగా పెరిగిందాయిరి! ఇప్పుడు సౌశీల్యం అలవడాలంటే యెక్కణ్ణించి వొస్తుంది మరి! ఆవిడగారు మేడ మెట్లు యెక్కి దిగుతున్నపుడు ఎందరు ఎన్ని కోణాలలో కెమేరాలను క్లిక్కుమనిపించారో లెక్కలేదు. అలాటి వ్యక్తి మనయింటికి వచ్చి యెలా ఇముడుతుంది? అయినా నేను ఈమాత్రమైనా వొప్పుకోలేదనే అక్కసు మీకు వద్దు. ఇది నాకొకపరీక్ష అనుకుంటాను" - కొడుకు మాటలు చాలించడంతోటే తండ్రి యిలా అందుకున్నాడు -

"ఏమైనాసరే జడ్జీగారిసంబంధం ఖాయపర్చుకోవాలనుకుంటున్నాను. చదువుకుంటున్నరోజుల్లో కొంచెం స్వేచ్ఛగా తిరిగినంతమాత్రాన యెల్లకాలమూ అలాగే వుండాలని యెక్కడున్నది?- "

"అదికాదు నాన్నా, వాళ్లకు మనుషుల విలువ తెలియదు మనుష్యుల్ని ప్రేమించడం గౌరవించడంకూడా యెరుగరు. వాళ్లు యేది నిజమనుకున్నారో ఆ వూబిలోనే మనల్నికూడా దింపాలని చూస్తుంటారు. క్రమంగా మనపై వుండాల్సిన గౌరవంకూడా వుండదేమో అని నా భయం. దేశంలో యెందరిని చూడడంలేదు - "

"చూడకేం చూస్తూనే వున్నాం. ఏది యేమైనాసరే ఇది ఖాయం కాక తప్పదు." అని బలగుద్ది చెప్పేశాడు తండ్రి.

"సరే మీయిష్టం నావిషయం ముందే చెప్తున్నానుగా!" అన్నాడు కొడుకు. ఆమాట వింటూనే అక్కణ్ణించి లేచి వెళ్లాడు శ్రీనివాసరావుగారు. (ఇంకావుంది)

అట్టమీద బొమ్మ

చంకనున్న బుట్ట కిందపెట్టి, కింద పడివున్న కాగితంముక్క తీసుకొని అక్కడే చతికిలబడింది సుబ్బులు. కాగితంలోని అక్షరాలను కూడ గల్పుకొని చదవటానికి ప్రయత్నిస్తూ, అలాగే కూర్చుండిపోయింది. ఎంతసేపు అలా కూర్చుందో ఏమోకాని, ఆ దారినే వెళ్తున్న రామి కేకేసేంతవరకు ఆమె ఈ లోకంలో లేదు.

* * *

సుబ్బులు ఆ చిన్న పల్లెలోనే పుట్టి పెరిగింది; పేదకుటుంబం. ఉన్న నాలుగు కుంటల పొలంలో నడుంవంచి పనిచేసి, ఆ రైతుకు ఈ రైతుకు ఆపనీ ఈపనీ చేసిపెట్టి సంసారం గడుపుకొస్తున్నాడు, సుబ్బులు తండ్రి వెంకయ్య. మోతుబరీ రైతులు ఆ పల్లెలో చల్లగా వున్నంతవరకూ అతని కేమంత దిగులులేదు. కాని అతని దిగులల్లా సుబ్బులు పెళ్ళి.

సుబ్బులు పెళ్లీడుకొచ్చింది. అందానికి తక్కువంటామా, పల్లెపడుచుల సౌందర్యమంతా ఆమెలో మూర్తీభవించివుంది. పనీపాట విషయానికా నడుంవంచి ఇంటి పనులే గాకుండా పొలం పనుల్లోగూడా తండ్రికి సాయం చేస్తుంది. కాని వచ్చిన చిక్కల్లా ఈమధ్య సుబ్బులు మారిపోయింది. ఎక్కడ ఏ కాగితంముక్క కన్పించినా దాన్ని తీసుకొని అక్కడే చతికిలపడటం, దాన్ని చూస్తూ తనపని మరచిపోవటం - ఇదీ వరుస.

పెళ్ళీడుకొచ్చిన పిల్ల ఈవిధంగా మారిపోవటం తండ్రి వెంకయ్య మనస్సు తల్లడిల్లింది; తల్లి నెత్తీ నోరు కొట్టుకుంది, పిచ్చేమోననే అనుమానంతో. చప్పున పెళ్లి చేస్తే పిచ్చి దానంతటదే కుదురుతుందని అయినవాళ్లు నలుగురూ సలహా ఇచ్చారు. ఈ విషయం ఆనోట ఆనోటబడి పల్లంతా పాక్కకముందే, పిల్లకు పెళ్ళిచేయాలనే ఉద్దేశ్యంతో తగిన సంబంధంకోసం వెంకయ్య వెదుకసాగాడు.

* * *

సుబ్బులుకు, గ్రామ పెద్దైన చౌదరిగారి కూతురు పార్వతికి చిన్నప్పటినుండి ప్రాణస్నేహం. ఒకర్నొకరు విడచి ఒక్కక్షణం గూడా వుండేవాళ్లుకాదు. తద్వారా రెండు కుటుంబాలుగూడా ఒకరికొకరు చేదోడువాదోడయ్యారు. పార్వతి, సుబ్బులు స్నేహాన్ని చూచిన నలుగురూ, "ఇదేంటమ్మా, పెళ్లయితే ఎలా! ఇద్దరూ ఒకణ్నే కట్టుకుంటారేమిటి!" అని ముక్కు మీద వేలేసుకొని, ముసిముసిగా నవ్వుకునేవాళ్లు. కాని ఏడాది క్రితం పట్నంనుండి ఓ పెద్ద సంబంధం కలిసివస్తే చౌదరిగారు పార్వతికి పెళ్లిచేశాడు. పార్వతి సుబ్బుల్ని విడవలేక విడవలేక విడిచివెళ్లింది అత్తగారింటికి. అయితే సంవత్సరం తిరక్కముందే పురిటికి పుట్టింటికి తిరిగొచ్చింది. సుబ్బులుకు, పార్వతికి మధ్య ఏర్పడిన ఏడాది ఎడబాటు వాళ్లిద్దరినీ మరింత దగ్గరగా చేర్చింది.

అయితే పట్నంనుండి తిరిగొచ్చిన పార్వతికీ, పల్లెలో పుట్టిపెరిగిన పార్వతికీ చాలా తేడావుందని సుబ్బులు గ్రహించటానికి ఎంతో కాలం పట్టలేదు. మునుపటి పార్వతి ఒట్టి అమాయకురాలు; ఎప్పుడూ బొమ్మల

రామచంద్

పెళ్లిళ్లతోటి, ఆటపాటలతోటి, పాలేళ్ల వెంటబడి పిల్లిపెసరకాయలు ఏరటంలో కాలం గడిపిన పల్లెపడుచు. నేటి పార్వతి, అంతా పట్నం వాళ్లపద్ధతిలో కట్టుబొట్టు జుట్టుల్తో ఎప్పుడూ ఏదో పుస్తకాలు తిరగేస్తుండే నాగరికవతి. ఇంతలో పార్వతి అంతగా ఎలా మారిపోయిందా అని సుబ్బులు ఆశ్చర్యపోయింది.

పార్వతి మొగుడు పట్నంలో ఏదో ఉద్యోగం చేస్తున్నాడు. పల్లెనుండి పట్నంలో పార్వతి కాలు పెట్టగానే, ఆమెను తనుండే వాతావరణానికి అనుగుణంగా మార్చే బాధ్యత తనపైనే వున్నదని అతడు గ్రహించాడు. గ్రహించటమేకాదు, ఆమెను లాలించి, ఆమెకు బోధించి ఆర్నెల్లల్లో ఆమెను పూర్తిగా మార్చాడు. తీరిక సమయాల్లో ఆమెకు చదువను వ్రాయను నేర్పాడు. ఇప్పుడామె పుస్తకాలు, పత్రికలు చదువగలదు. తేట తెలుగులో భర్తకు, ముత్యాలవంటి అక్షరాలతో ఉత్తరాలు వ్రాయగలదు.

పెళ్లిసమయంలో సుబ్బులు పార్వతి భర్తను చూసింది. సూట్లు బూట్లతో టిప్‌టాప్‌గా వుండే అటువంటి భర్త దొరకటం పార్వతి ఎంతో అదృష్టవంతురాలనుకుంది. ఆమెపై గౌరవం సుబ్బులులో అధికమైంది.

పురుడు పోసుకొని, పండంటి పాపాయితో పార్వతి అత్తగారింటికి వెళ్లేంతవరకూ సుబ్బులు ఆమెను హత్తుకొనేవుంది. తీరిక సమయాల్లో పార్వతి సుబ్బులుకు పత్రికల్లోని కథలు, పట్నంలోని వింతలు విశేషాలు చెప్పుతుండేది. రానురాను సుబ్బులుకు, తనూ చదువుకోవాలనే కోర్కె ఉద్భవించింది. ఉద్భవించటం ఆలస్యం, పార్వతి చెవులో చల్లగా వూదింది. పార్వతి ఎంతో సంతోషంతో, సుబ్బులుకు, అంత శ్రమ లేకుండానే అక్షరాలు గుణింతాలు నేర్పింది. అక్షరాలు కూడ కల్పుకొని చదవటంవరకూ వచ్చింది సుబ్బులుచదువు. కాని ఇంతలో పార్వతి అత్తగారింటికి వెళ్ళిపోయింది. ఆనాటినుండి వీధిలో దొరికే కాగితాల్ని ఏరి దాచటం, వాటిని అటు ఇటు తిప్పి ఎంతో కష్టంతో చదవటం—ఆమెకు పరిపాటయింది. విద్యపై ఆమెకున్న అభిలాష వల్లనైతేనేం, అందుకు ఆమె పడుతున్న శ్రమవల్లనైతేనేం, రోజు రోజుకు సుబ్బులులో ఉత్సాహం అధికమవసాగింది. చక్కగా చదవటం అలవాటయింది. కాని చదవటానికి పుస్తకాలు లేవు. తండ్రిని అడిగితే తంతాడేమోనని భయం. తల్లి చీవాట్లు వేస్తుందనే అనుమానం. అందుచేత దొరికిన కాగితమ్ముక్కల్ని చదవటంలో తృప్తిపడసాగింది ఆమె. కాని ఎప్పుడూ పనిపాటల్లో ఉత్సాహంగా వుండే పిల్ల, ఇలా కాగితముక్కలేరి, వాటిని చూస్తూ వేటిని పట్టించుకోకపోవటం ఆమె తల్లితండ్రులకు విచారమే వేసింది. పెళ్ళిచేసి తమ బాధ్యత వదిలించుకోవటానికే నిశ్చయించుకున్నారు.

* * *

నలుగురు రైతులు నాలుగు చేతులు వేసి సుబ్బులు పెళ్లి అయిందనిపించారు. వెంకయ్య తన బరువు తీరిందని ఎంతో సంతోషించాడు. పెళ్ళికొడుకు పక్కనే వున్న పల్లెటూరివాడు. పదహారణాల రైతు. నా అనేవాళ్లెవరూ లేరు. అంతగా లేకపోయినా ఏదో కొద్దిగా వున్నవాడు. సుబ్బులు ఆస్తిపాస్తులు చూసి అతడామెను పెళ్ళిచేసుకోలేదు గాని ఆమె అందచందాల్ని, అణుకువను పనిపాట్లను చూసి పెళ్లిచేసుకున్నాడు. భర్త ఇంట్లో కాలు పెట్టినప్పటినుండి అన్నివిధాలా అతనికి తోడ్పడుతూ,



జలయంత్రం

ఫోటో: సీతారామరాజు ... —మద్రాసు.

అట్టమీద బొమ్మ

తలలోని నాయికగా మెలగసాగింది సుబ్బులు. ఆమెకు ఇంట్లో ఏ కొరతా లేదు. అత్తమామల పోరు లేదు. ఆడబడుచుల పోరు అంతకంటే లేదు. ఓ ప్రక్క తనను ఆరాధించే భర్త, మరో ప్రక్క ఉండటానికి తగిన ఇల్లు, తినటానికి తిండి అన్నీ సవ్యంగానే వున్నాయి. కాని ఇన్నీ వున్నా ఆమెకు ఒకే ఒక లోటు కన్పించసాగింది. తన చదువు, తన చదువు అత్తగారింట్లో అంతమై పోతుందేమోనని భయం. ఎన్నో సార్లు భర్తను అడుగుదామనుకొనేది పుస్తకాలు తెమ్మని. కాని ఆయన ఏమనుకుంటాడో అని నోటివరకు వచ్చిన మాటను దిగమ్రింగేది. అందువల్ల ఆమె చదువు కోమటి కొట్లోనుండి వచ్చే పొట్లాల కాగితాలు భద్రంగా దాచి, భర్త లేని సమయంలో తలుపులన్నీ మూసి దొడ్లో కూర్చుని వాటిని చదవటంతోటే సరిపోయింది. ఆ కాగితాల్లో కొన్ని అర్థమయ్యేవి, కొన్నంటలు అర్థమయ్యేవి కావు. ఏవేవో వార్తలు, విశేషాలు, తల తుద లేని కథలు ఎన్నో వుండేవి వాటిలో. ఎలాగైనా పుస్తకాలు సంపాదించి చదవాలి, ఇంకా చదువుకున్నా ననిపించాలి, అనే ఆశ ఆమెలో నానాటికీ అధికమవసాగింది. రోజు రోజుకు ఉత్సాహం ప్రబలసాగింది. గడచినదానికి ద్విగుణీకృతమౌతున్న ఉత్సాహం ఆమెలో ధైర్యాన్ని రేకెత్తించింది. ఆ ధైర్యంతో ఎలాగైనా భర్తను ఒప్పించి, ఓ పుస్తకం తెప్పించాలనే నిర్ణయానికి వచ్చిందామె. భర్తను అడగటానికి నిశ్చయించుకుంది.


కాని ఆమె తనకుతానై భర్తను అడగక ముందే, అతడే అడిగాడు ఆమెను ఓరోజు, "సుబ్బూ, ఇవాళ బస్తీ వెళ్తున్నా, నీకేమైనా కావాలేమో చెప్పు, తెస్తాను," అని.

సుబ్బులు కొంచెంసేపు తటపటాయించింది. నవ్వుతో ముఖంలో వెన్నెల కురిపిస్తూ, "నేను కావాలన్నది తప్పకుండా తెస్తారా!" అనుమానంగా అడిగింది.

"ఓ, తప్పకుండా. ఏం కావాలేంటో చెప్పు," అన్నాడాతడు, ఆమెను దగ్గరకు తీసుకొని, బుజ్జగిస్తూ.

"ఊహూ చెప్పను," అంది ఆమె కళ్లు మూసుకొని, పెదవులపై చిరునవ్వును చిలికిస్తూ.

"చెప్పవూ, చెప్పకపోతే ఒట్టు" గిలిగింతలు పెడ్తూ అన్నాడాతడు. ఏ నగలో, చీరలో, తినుబండారాలో కోరుకుంటుందనుకుంటూ.



వింతకోణంలో కుతుబ్ మినార్

ఫొటో: ఆర్. పి. రంగారావు—సికింద్రాబాదు.

"అయితే చెప్పనా...ఓ పుస్తకం కొనుక్కోరండి," ధైర్యాన్నంతా కూడగట్టుకొని అడిగిందామె.

"పుస్తకమా!" కట్టుకోవటానికి చీరో, అలంకరించుకోవటానికి ఏ ఆభరణమో, తినటానికి ఏ తీపిమిఠాయో కావాలని అడగక, పుస్తకం కావాలంటుందేమిటని ఆశ్చర్యపోతూ అన్నాడు.

"ఆ, కథల పుస్తకం..." నీరసంగా అంది ఆమె కళ్లువిప్పి; తీసుకరానంటాడేమో అనే అనుమానంతో.

"నీకు చదువొచ్చా!" అమాయకంగా అడిగా డాతను, తనకు రానందుకు సిగ్గుపడుతూ.

"ఆ, నా స్నేహితురాలు నేర్పింది," ఏమంటాడో అనుకుంటూ అంది ఆమె.

"మరి ఇన్నిరోజులనుండి చెప్పలేదేం. సరే తెస్తాలే," అని లేచి, కండువా మొత్త

> "ఏమయినా సరే, ఇకమీదట నీవే పెత్తనం చేయాలంటే ఎంతమాత్రం వీల్లేదు అని నిన్న సాయంత్రం మా ఆవిడకి చెప్పేశాను".
>
> "భలే. అలా ఉండాలి. ఇకమీదట నువ్వు నలుగురిలో తల ఎత్తుకు తిరగవచ్చును."
>
> "ఇప్పుడే వీల్లేదు. నుదుటి మీద కట్టిన బొప్పి ఇంకా నయంకాలేదు."

వేసుకొని గొడ్లచావిడిలోకి వెళ్లాడాతడు. ఆమె అతడ్ని అనుసరించింది.

ఎడ్లను విప్పి, కుడితిపెట్టి, బండికట్టి బయలుదేరాడాతడు. మట్టిరోడ్డు మలుపు తిరిగేంతవరకు హుషారుగా వెళ్తున్న బండిని చూస్తూ నిలబడిపోయిందామె. ఆ చూపుల్లో ఆశ, అమితఉత్సాహం, ఏదో నిధిలభించబోతున్నదనే సంతోషం మిళితమై, అందమైన ఆమె ముఖంలో ఆనందపు వన్నెలు దిద్దాయి.

*   *   *

బస్తీచేరిన సుబ్బులు భర్త తన పనులన్నీ ముగించుకొని, భార్యకు పుస్తకం కొందామని ఓ పుస్తకాల షాపుకు వెళ్లాడు. షాపులో అడుగుబెట్టిన అతడ్ని అదోకలా చూస్తూ, కొట్టులో కుఱ్ఱవాడు ఏంకావాలని అడిగాడు. అద్దపు బీరువాల్లో వున్న పెద్ద పెద్ద పుస్తకాల్ని, లోపల తాడుపై వ్రేలాడుతున్న రకరకాల పుస్తకాల్ని వాటిపైవున్న అందమైన బొమ్మల్ని చూస్తూ, "ఓ పుస్తకం ఇవ్వండి," అని అడిగాడు.

కుఱ్ఱవాడికి నవ్వాగింది కాదు. "పుస్తకం అంటే ఏం పుస్తకం? ఇక్కడెన్నో పుస్తకాలున్నాయి," అన్నాడు వెకిలిగా.

"ఏం పుస్తకమేమిటి, కథల పుస్తకం. ఒకటివ్వండి," అమాయకంగా అడిగాడాతడు, కుఱ్ఱవాడు ఎందుకు నవ్వుతున్నాడో అర్థంగాక.

"కథల పుస్తకమంటే పేరులేదా? రకరకాల కథల పుస్తకాలున్నాయి. పేరు చెప్పితే ఇవ్వగలంగాని నీకేంకావాలో నాకేం తెలుస్తుంది," విసుక్కున్నాడు కుఱ్ఱవాడు; సుబ్బులుభర్తకు కోపంవచ్చింది, కుఱ్ఱవాడిమీదా, ఏ పుస్తకమో చెప్పకుండా పంపిన తన భార్యమీదా.

★ అట్టమీద బొమ్మ ★

లోపలఏదో పని చూసుకుంటున్న షాపు యజమాని వాళ్ళ సంభాషణ విని, బయటకు వచ్చాడు; అమాయకుడైన సుబ్బులు భర్తపై జాలి కల్గింది. పొగరుబోతైన కుఱ్ఱవాడిపై కోపం వచ్చిందాతనికి. లోపలికి వెళ్ళమని కుఱ్ఱవాడికి చెప్పి, "ఎవరికి బాబూ పుస్తకం?" అప్యాయతతో అడిగాడు సుబ్బులుభర్తను. చెప్పటానికి మొదట సంశయించినా, షాపు యజమాని కంఠంలో ఉట్టిపడుతున్న ఆదరంవలన చెప్పక తప్పిందిగాదు, తన భార్యకేనని.

"ఏం చదువుకొంది బాబూ," ప్రేమగా అడిగాడు షాపు యజమాని.

"పెద్దచదువు చదవలేదండి. ఏదో కొద్దిపాటి చదివింది. కథలపుస్తకం కావాలంట," నసుగుతూ జవాబిచ్చాడాతడు.

యజమాని షాపంతా ఒక్కసారి కలియజూసి, దగ్గరలోవున్న బీరువాలోనుండి ఓ పుస్తకం తెచ్చి, "ఇదిగో ఇదీ కథల పుస్తకమే. దీంట్లో అన్నీ కథలే. చాలా బాగుంటాయి. తీసుకెళ్లు. దీనివెల అర్థరూపాయి," అంటూ దాన్నతనికి ఇచ్చాడు. అతడా పుస్తకాన్ని తీసుకొని అటు ఇటు తిప్పి చూశాడు. అట్టమీద బొమ్మ అందంగా వుంది. అతన్నది ఆకర్షించటానికి అట్టేసేపు పట్టలేదు. పక్కజేబులోనుండి అర్థరూపాయి తీసి యజమానికిచ్చి, వెళ్లొస్తా బాబూ అని శెలవుతీసుకొని వెనుదిరిగాడు.

*   *   *

ఆ రోజంతా సుబ్బులు పనిచేస్తున్నదన్నమాటేగాని, ఆమె మనస్సంతా భర్త తీసుకురాబోయే పుస్తకంపైనే లగ్నమైంది. ప్రతి నిముషాన్ని ఎంతో కష్టంతో గడుపుతూ, అతని రాకకోసం ఆతృత పడసాగింది. సాయంకాలానికి అతడు రానే వచ్చాడు. వచ్చి, తెచ్చిన సామానంతా ఒక్కొక్కటిగా ఆమె చేతి కిచ్చాడు. కాని పుస్తకం లేదు. తెస్తానని అంతగా చెప్పిన భర్త, ఎందుకు తీసుకురాలేదో ఆమెకు అర్థంకాలేదు. కోపంతో, అవమానంతో ఆమె ముఖం వివర్ణమైంది. మారిన ముఖాన్ని చూచి అతడు నవ్వుతూ, కండువాలోనుండి పుస్తకాన్ని తీసి ఆమె కిచ్చాడు. ఆమె హృదయం ఒక్కసారి ఉప్పొంగిపోయింది. ఒక్కదూకులో సామానంతా ఇంట్లో పెట్టి, అలసిసొలసి వచ్చాడే భర్తకు నీళ్లు తోడి భోజనం వడ్డించాలనే అన్న మాటగూడా మరచి, పుస్తకంతో దీపంముందుకూర్చుంది. అట్టమీదవున్న అందమైన బొమ్మను చూస్తూ కొన్ని నిముషాలు అలాగే కూర్చుండిపోయింది. ఆమె ఆనందానికి అంతరాయం కల్గించటం ఎందుకని అతడలాగే గోడకు చేరగిలబడ్డాడు. కాని అంతలో గ్రహించిన ఆమె, మతిమరుపుకు తనను తాను నిందించుకుంటూ లేచి, పుస్తకాన్ని పదిలంగా అలమరులో పెట్టి నీళ్లు తోడటానికి దొడ్లోకి వెళ్ళింది.

*   *   *

రోజులు గడిచేకొద్దీ సుబ్బులుకు పుస్తకం తోటిదే లోకమైంది. త్వరత్వరగా ఇంటి పనులు తెమల్చుకోవటం, భర్త వచ్చినప్పుడు ఆయన అవసరాలేమో చూడటం తదితర సమయాల్లో పుస్తకంముందు కూర్చోవటం ఆమెకు పరిపాటయింది. ఒకటి, రెండు, మూడు, నాలుగు, అయిదుసార్లు గాదు ఎన్నోసార్లు చదివిన కథనే చదివింది. మొదట కథలంతగా ఆమెకు అర్థంకాలేదు. తర్వాత తర్వాత క్రమక్రమంగా అర్థమవసాగినవి. అర్థమయ్యేకొద్దీ ఆ కథలు ఆమె జీవితంపై సమస్యలు లేపాయి. తను, తన ఇల్లు, తన భర్త, ఆ పల్లె...అంతా ఏదో నరకంలా కనపడింది. తనను పార్వతితోనూ, తన భర్తను పార్వతి భర్తతోనూ పోల్చుకొంది. తనెక్కడ, వాళ్లెక్కడ!...కథల్లోని నాయకుడు, నాయకి ఆమెలో ఓ మహావిప్లవాన్ని లేవదీశారు. వాళ్ళంతా చదువుకున్నవాళ్లు, నవనాగరికులు. తన భర్త చదువులేనివాడు. పొలం పనుల్తో ఎల్లప్పుడూ సతమతమయ్యే అనాకారి. పగలంతా పొలంపని, రాత్రంతా నిద్ర ఇదీ అతని దినచర్య తనకాఇంట్లో సుఖం లేదన్నట్లు ఆమెకు అనుమానం వేయసాగింది.

పార్వతి నిజంగా ఎంతో అదృష్టవంతురాలు, నవనాగరికుడైన భర్త, పట్నంలో హాయియైన జీవితం.. తను ఆ అదృష్టానికి నోచుకోలేదు...ఏమిటో తెలియని వెలితి ఆమెను వేధించసాగింది. పోనుపోను ఆమె ఆలోచనలు అధికమవసాగాయి. కథల్లోని జీవితాలు ఎంత కమ్మగా వున్నాయి. ఆ నాయకుడు నాయకితో తన ప్రేమను ఏవిధంగా చెప్పాడు!—తన భర్త ఏనాడైనా తనతో ఆవిధంగా మాట్లాడాడా!... తన భర్త ఉఒక్ఠి పల్లెటూరి వాడు.. అతనికేవిమీ తెలియదు...అతడు చదువురానివాడు...

భర్త విషయంలో ఆమె శ్రద్ధ మందగించింది. ఒకటి రెండు సార్లు భర్త విసుక్కున్నాడు. కాని ఆమె ఒంట్లో బాగుండలేదేమో అనుకొని ఎందుకు విసుక్కున్నానా అని నొచ్చుకున్నాడు. దినాలు గడిచే కొద్దీ సుబ్బులులో రేగిన

విప్లవం తీవ్రరూపాన్ని ధరించసాగింది. ఆ భర్తతో సంసారం చేయటం ఆమెకు కష్టమని తోచింది. కాని ఆ భర్తను కాదని తనేమవాలి, అనే ప్రశ్న మాత్రం జవాబు లేకుండానే మిగిలిపోయింది.

*   *   *

ఆరోజు భోజనం చేస్తూ భర్త అడిగాడు, "ఏమే సుబ్బూ, అదోకలా వుంటున్నావు. ఒంట్లో బాగుంటం లేదేంటే," అని.

ఆమె మాట్లాడకుండా అతనికి మజ్జిగ వడ్డించింది.

"మాట్లాడవేమే, ఉలుకూ పలుకూ లేకుండా ఊరుకున్నావ్! మీ ఇంటికి వెళ్లాలని వుందా చెప్పు, వెళ్లొద్దువుగాని," ముద్దమింగుతూ అన్నాడాతడు.

ఆమె అతనివైపు ఆశగా చూసింది; కొంతకాలం అతనినుండి దూరంగా వుంటే బాగుంటుందేమో నని.

"పాపం దిగులుపడ్డావేంటే, పుట్టింట్లోళ్లను చూడాలని. ఇంతమాత్రానికే బెంబేలు పడాలా. పదా, రేపు మంచిది చూసి దిగబెట్టివస్తా," అంటూ లేచి చేయి కడుక్కోని లోపలికి వెళ్లాడు.

అన్నంతిని, ఇల్లంతా సర్ది, తలుపులన్నీ మూసి పడకగదిలోకి వెళ్లింది సుబ్బులు. ఆ రోజంతా మట్టిపనుల్లో మునిగివుండటంవలన భర్త గురకలుపెట్టూ నిద్రపోతున్నాడు.

దీపపు కాంతిలో అమాయకమైన అతని ముఖం, విశాలమైన వక్షం, మెలితిరిగిన కండలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. నుదుటిపైన చెమట బిందువులు ముత్యాల్లా మెరుస్తున్నాయి. అన్నిరోజులనుండి ఆమె లోలోపల రేగుతున్న దుమారం ఒక్కసారి పటాపంచలైంది అతని నవ్వుముఖం చూడగానే.

"అతడు నీవాడు...నీభర్త...నిన్నెంతగా ప్రేమిస్తున్నాడో గ్రహించావా! నీ సుఖాన్ని అతడెంతగా కాంక్షిస్తున్నాడో అర్థం చేసుకున్నావా? ఆ కథలు గాథలు నీబోటివాళ్ళకు కాదు...అవన్నీ పైపై మెరుగులు. ఆ మెరుగులకు లోబడి నిన్ను నీవు మరచిపోవటం నీ నాశనానికే కారణమౌతుంది ..." ఎవరో బోధ చేస్తున్నట్లు ఆమెకు అన్పించింది.

"ఈ చదువు సంధ్యలు నీకొద్దు. నీ ఇల్లు వాకిలి చూసుకో. నీవు చదివి చేయబోయేదేమీ లేకపోగా, అర్థంలేని వ్యథలో కుళ్ళి కృశించాల్సిందే. ఎంతో ఆదరంతో, అనురాగంతో నిన్ను ఆదరించి, పువ్వుల్లోపెట్టి పూజించే అమాయకుడైన నీ భర్త హృదయంలో స్థానం కోల్పోతావు జాగ్రత్త," ఆమెలోనుండి అంతరాత్మ హెచ్చరించింది. ఆమె కళ్లు అశ్రుపూరితాలయినవి. పశ్చాత్తాపంతో ఆమె హృదయం పరితపించింది. ఎవరో తనచేతిని పట్టుకొని ముందుకు లాగుతున్నట్లు, గబగబ అలమరు దగ్గరకువెళ్ళి తనలో రేగిన మహా విప్లవానికి కారణమైన పుస్తకాన్ని తీసింది. పైనున్న బొమ్మను ఒక్కసారి తీక్షణంగాచూసి, అట్టను చింపి అవతల పారేసింది. పుస్తకంలోని కాగితాల్ని ముక్కలు ముక్కలుగా చింపి, దీపానికి అంటించి కాల్చివేసి, పడకటింట్లోకి వెళ్ళింది. సుఖమంతా తనదే అన్నట్లు భర్త మైమరచి నిద్రిస్తున్నాడు. జరిగిన దానికి ఓ వేడినిట్టూర్పు వదలి, ఏమీ జరగలేదన్నట్లు మనస్సును నిర్మలం చేసుకొని అతని పక్కనే పడుకొని నిదురపోయింది.

*   *   *

పొలానికి వెళ్లవలసిన పనుండటంవలన, సుబ్బులుభర్త కోడి కూయకముందే లేచాడు. రోజూ తనకంటేముందు లేచే భార్య ఆనాడు ఇంకా నిదురపోతుండటం వలన మొదట ఆశ్చర్యపడినా, రాత్రి ఆలస్యంగా పడుకుందేమోననుకుంటూ పెద్దగా ఆవులించి, దీపం తీసుకొని బయటకువెళ్లాడు. గుమ్మం ప్రక్కన కాగితాలు కాల్చిన బూడిద పడివుంది. దూరంగా తను తెచ్చిన పుస్తకంమీది అట్ట పారేసివుంది. అట్టను తీసుకొని దానిమీది బొమ్మను పరీక్షగా చూశాడు. అట్టమీది బొమ్మ తనను చూసి నవ్వినట్లనిపించి, తనూ నవ్వాడు. కాని దానికే మాటలు వచ్చివుంటే...! ★

(ఓ మరారీ కథ చదివిన తర్వాత)

పిల్లి మొగ్గలు

భూపయ్యగారు తనకొడుకు రాఘవరావుకి రామనాధయ్యగారి రెండో అమ్మాయిని చేసుకుంటామని ఆ ఉదయంపూట కబురు పెట్టటంతో, ఆ రోజూ మర్నాడూ ఆవూరివారందరికీ వేరే భోజనాలు చెయ్యవలసిన అవసరం కన్పించలేదు. ఎక్కడచూసినా ఇద్దరూ, ముగ్గురూ, నలుగురూ మనుషులు చేరటం - ఇదేమాట, ఇదేసందడి, ఇదే గుసగుసలు; చెరువుదగ్గర, పొలంగట్లమీద, వంతెనమీద, వరండాల్లో, వంటిళ్ళల్లో; వయసులో వున్నవాళ్లూ, వయసుమీరినవాళ్ళూ, వయసు మళ్ళినవాళ్ళూ, అంతా ఎవడో యోగివచ్చి రెప్పపాటికి ఊళ్లోవాళ్లందరికీ తలో వీసెడు బంగారము ఇస్తాడన్నంత సంభ్రమము, ఆశ్చర్యము కల్గించిం దావార్త. అరుచుకుంటూ చెప్పేవాడొకడు, చిరునవ్వుతో చెప్పేవాడొకడు, కంటిగిలుకుచాటున చెప్పేవాడొకడు, నొసళ్లెగరేసి నోరుతెరచి చెప్పేవాడొకడు, నమ్మనివాడొకడు, అసలు మాట్లాడలేకపోతున్నవాడింకొకడు.

ఇహ రామనాధయ్యగారి కుటుంబం సంగతి సరేసరి. బయటవున్న సంరంభమంతా మనసు పట్టరాని ఆనందంతో ఉక్కిరిబిక్కిరై ఏదో శక్తికి నిబద్ధులై పోయారు. కీలకం ఎక్కడుందో తెలియకుండా మద్రాసులో అటూ ఇటూ జయ్యిన వెళ్లి జయ్యినవచ్చే 'ఎలక్ట్రిక్' ట్రెయిన్లమాదిరుంది ఇంట్లోవాళ్లస్థితి. వాళ్లెప్పుడూ చూస్తుండే బిందె, తొట్టి, రోలు, స్తంభం, పాకా అన్నీ కొత్త అర్థాన్నీ, కొత్త అందాన్నీ తెచ్చుకున్నవి. రామనాధయ్యగారిభార్య కనకమ్మగారు ఉప్పెన వచ్చినంతపనిగా బడబడ మాట్లాడేస్తూ వచ్చేపోయేవాళ్లని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది.

రామనాధయ్యగారు లోపల పొంగుకొస్తున్న భావావేశాన్ని పైకి కనపడనీయకుండా కాస్త తమాయించుకు తిరగాలని వ్యర్థప్రయత్నాలు చేస్తున్నాడు.

"బుద్ధా డెక్కడి కెళ్లాడే గేదెల్ని తోలుకుపోకుండా? ... పదిగంటల వేళవుతుంటే" అన్నాడాయన ఆఖరుకి.

ఈమాటలేమీ వినిపించుకునేస్థితిలో లేని కనకమ్మగారు ఒక చేత్తో ఏదో చట్టీ, రెండో చేత్తో పెద్దచెంబూ పట్టుకుని గబగబా బయటకువచ్చి చేతులూపుతూ అన్నది:

"ఏమండీ! ఆ బయటికిపోయి ఆ మంగలా డెక్కడున్నాడో కాస్త పిలవకూడదూ? రాముడితల, అబ్బబ్బ! ఎంత రోతేస్తుంది? అన్నీ నేను కనుక్కుంటే కనుక్కున్నట్టు, లేకపోతే లేదూ..."

సి. ధర్మారావు

భార్య ఎంత బిగ్గరగా అరుస్తుంటే అంత బాగా వినిపించుకోని అలవాటులోవాడు రామనాధయ్యగారు. భార్య చెంబు చేత్తో పట్టుకొచ్చిన కారణంగా పాలు తియ్యటానికని గేదెని ఇవతల కట్టెయ్యమంటున్నదని ఊహించి చరచరా చావిట్లోకిపోయి గేదెనూడతీసి బయట మేకుకు కట్టివేద్దామనుకున్నవాడు కాస్తా వరండాలోకి తోలుకొచ్చేస్తున్నాడు.

"అయ్యయ్యో! నారాత పాడుగానూ... ఆగేదెక్కడికండీ, ఇదంతా తోలుకొస్తున్నారూ? ఆ మంగలాణ్ణి పిలవండంటే ......"

"మంగలాడేమిటే?"

"ఆగేదేమిటి?"

"పాలు తీసావని"

"పాలుతీసి ఎంతసేపైందండీ, అయ్యో! నారాత పాడుగానూ..." ఈ ధోరణిలో వుంది వాళ్ల పరిస్థితి. ఇహ రామనాధయ్యగారి అత్తగారి పరిస్థితి గగోలుగా వుంది. వరండాలో ఓమూల చతికిలబడి మనవరాల్నుద్దేశించి "సరోజమ్మా! అమ్మాయ్, సరోజమ్మా!" అని కేకలు. లోపల్నుంచి మనిషీరాదు, సమాధానమూ రాదని తెలుసు. తెలిసీ అరుస్తూంటుంది.

"నా బంగారానివిగదే నాతల్లీ! ఎంతకళే తల్లీ నీముఖాన! ఆలచ్చిందేవే పుట్టిందిగదే నాతల్లీ...నువ్వు పుట్టినప్పుడే అన్నాను కాదుటే ఆమాట నేను...నా చిట్టితల్లీ..." ఇలా సాగుతున్నది ఆమె వాక్ప్రవాహం.

కథానాయిక అంతా కలలావున్న ఈ అయోమయంలో సాధ్యమైనంతవరకు ఎవరికీ కనుపించకుండా ఇంట్లో అటూ ఇటూ తిరుగుతున్నది. ఈ పెళ్ళిలో ప్రత్యేకమైన విశేషం తెలియని పిల్లలు పెళ్ళన్న కోలాహలంలో వున్నారు.

ఇంత అలజడికి కారణం వున్నది. భూపయ్యగారు ఆ ఊళ్లోకల్లా పెద్దఆసామి; ఎనభై ఎకరాల రైతు. పెద్దమండువాలోగిలి ఇల్లూ, తోటా, దొడ్డీ, అట్టహాసం. సరే. జమీపద్ధతిలోని అందరు పెద్దరైతులకు మల్లే కొద్దో, గొప్పో అప్పువున్నా అది అంత లెక్కలోదిగా ఎవరూ చెప్పుకోరు. ఇహ రాఘవరావో, తండ్రికి ఒక్కగానొక్కడు, బుద్ధిమంతుడు, అందగాడు, పట్టణంలో డాక్టరుకోర్సు నాలుగోయేడు చదువుతున్నవాడు. రామనాథయ్యగారు అయిదుగురు బిడ్డలతండ్రి. ఏడెనిమిదెకరాల ఆస్తి. ఒక కొడుక్కీ, పెద్దకూతురుకీ పెళ్లిళ్లు చేశాడు. ఈరెండోకూతురు సంగతి ఆలోచిస్తున్నాడు. ఇంకా ఇద్దరు మగపిల్లలున్నారు.

పోనీ ఈరెండుకుటుంబాలకీ ఏదైనా దగ్గర సంబంధము వున్నదాంటే అదీ లేదు. ఈ మధ్యే చనిపోయిన భూపయ్యగారి భార్య రమణమ్మగారితరఫున రామనాధయ్యగారు అతిదూరపు బంధువు. ఆ చుట్టరికాన్ని పురస్కరించుకుని ఆయన పెద్దరైతుగదా అని భూపయ్యగార్ని పులుముకుని తిరగటాని కెప్పుడూ ప్రయత్నించలేదు; ఆయన స్వాభిమానం గల మనిషి. ఎవరింటికీ సాధారణపరిస్థితుల్లో వెళ్ళే అలవాటులేని రాఘవరావుమాత్రం తను వూళ్లోవున్న రోజుల్లో రామనాధయ్యగారింటికి వాళ్ల పెద్దబ్బాయి వెంట వెళ్తూండేవాడు అప్పుడప్పుడూ. అది అతని వినయవిధేయతలకీ, పేదవాళ్ళ నే తూష్ణీంభావములేని బంధుప్రీతికీ తార్కాణంగా చెప్పుకునేవాళ్లు ఊళ్లో. అంతకుమించి ప్రత్యేకసంబంధ మేమీ లేనికుటుంబాల్లో వియ్యము సంభవించిందంటే సంచలనకారకం కాదూ మరి?

* * *

మొదట్లో ఆశ్చర్యచకితులైన మనుషులు క్రమంగా ఆ 'థ్రిల్' నించి కోలుకుంటు

న్నారు. ఆ తర్వాత విషయం పూర్వాపరాల్ని గూర్చిన ఆలోచనలో, జిజ్ఞాసలో పడ్డారు. వాళ్ళవాళ్ళ హృదయాల్లో ఏదో వుంటుంది. దానికి తగ్గట్టుగా వాళ్ళ మెదడుల్ని వంచుకుంటారు, వంకరచేస్తారు. అందులో తెలివైనవాళ్లు అంతకంటె తక్కువ తెలివైనవాళ్ళ మెదడుల్ని వంచటానికి ప్రయత్నిస్తూ, విరగ్గొట్టటానిక్కూడ వెనుదియ్యరు. మొత్తంమీద తర్జనభర్జనలు జరుగుతున్నయ్. మొదటిరోజుల్లో నూటిగానే ఆ వివాహవిషయాన్ని ప్రస్తావనలోకి తెచ్చినవాళ్ళు ఇప్పుడు పరోక్షపద్ధతుల్ని అవలంబిస్తున్నారు.

పెళ్ళి ముహూర్తాలవీ నిర్ణయింపబడుతున్నారు. ఆడపెళ్ళివారు లగ్నలేఖ పంపే గడువుదగ్గర పడుతున్నది.

ఆ సాయంకాలము ఊరు తూర్పువైపు బజారుమూల నలుగురూ చేరి పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు. సంభాషణ రకరకాలవిషయాలమీదనుంచి పాకి పూర్ళొ పెళ్ళివిషయంమీదికి మళ్ళింది. ఒకడు దగ్గరగా చేరి గొంతు తగ్గించి అన్నాడు.

"అయితే నర్సయ్యబాబాయ్! భూపయ్యగారు ఇట్టా ఎందుకు చేస్తన్నాడంటావ్?"

నర్సయ్యగారు నోట్లో చుట్టతీసి బూడిద రాలుస్తూ ఏదో అనబోతున్నాడు.

"ఆ! రాఘవరావుకి మొదట్నుంచీ ఈళ్ళమ్మాయంటె ఇష్టమే ననుకుంటా" అన్నాడు యువకుడొకడు ఇంతలోనే. ప్రపంచపద్ధతుల్లో ఇంకా అతని మనస్సు చెడినట్టు లేదు. లేకపోతే ఇంత పెద్ద విషయానికి అంత చిన్న కారణం అంటగడతాడా? ఏదో పెద్ద 'ఖూపీ' తియ్యవలసినంత సంగతి వుండివుండాలి. అందు చేత అందరూ అతన్ని "పానకంలో పుడకలా నువ్వేమిటిరా, బాబాయ్‌ని చెప్పనీయక" అని మందలించారు. పెద్దవాడు నర్సయ్యగారన్నాడు.

"ఆగండిరా. అన్నీ కోప్పడతారేరా? ఆడు చెప్పేదేదో చెప్పనీయండి" అని పైపంచ మోకాళ్ళచుట్టూ చుడుతూ "అయితే అబ్బాయ్!, సుబ్బారావ్! నువ్వు అన్నది నిజమే అనుకుందాము. మరా సంగతి ఇంతకాలము ఏదో పేద్దరహస్యములాగుంచాల్సిన పనేముందిరా?" నర్సయ్యగారు చిరునవ్వు నవ్వాడు. సుబ్బారావుదగ్గరనించి సమాధానము లేదు. నర్సయ్యగారి ప్రశ్నకి జవాబుకూడానా? అందరూ నవ్వారు. ఆఖరికి ఆయనన్నాడు

"నాకూ ఎంతో చటల్లేగురా, అయినా ఒకటనుకుంటా. మీరు పరీచ్ఛగా నూస్తన్నారో లేదో రాగవరావుకి వెనకొచ్చినంత జోరుగా సంబంధాలు ఈ రెండుమూడేళ్ల నించీ రాటల్లేదు..."

"అవును, అదీ నిజమే..."

"ఆ, మరి ఎందుకనంటావ్?"

ఎవరూ మాట్టాడలేదు. అది ఆయనే చెప్పాలి:

"పాపంలాగ పెరిగిపోయిందంటరా, ఋణం" శ్రోతల్లో ఆసక్తి హెచ్చింది. బాగా దగ్గరకు జరిగారు.

"ఏదో కొద్దో, గొప్పో వుందని అంటారుగాని, ఇంతపాప మనుకోలేదే బాబాయ్"

కాస్సేపు నిశ్శబ్దం.

"అయితే, ఎంతుండొచ్చునంటావ్ బాబాయ్?"

"సరిగ్గా మన కెట్టా అంతుబట్టదిగాని, రెండులచ్చల పైచిలుకే..."

"అబ్బా, అందుకనే మరి..."

"ఆ, అదైనా నాకు తెల్సినంతమట్టుకి ......"

"ఛా! మరి నీకు తెల్సినట్టు ఎప్పుడూ అనలేదేమే బాబాయ్?"

"ఎబ్బే! మనకెందుకురా ఒకళ్ళసంగతి అనవసరంగా ఇప్పుడేదో మాటొచ్చిందిగనకన్నాగానీ..."

శ్రోతలకి అది నమ్మకపోవటానికి కారణమేమీ కన్పించలేదు.

"ఎందుకూ, నామట్టుకి నానేత్తో నేను ఎనభైఅయిదు వేలు పట్టుకొచ్చా ఈ అయిదారేళ్లనుంచీ ఇక ఒక్కసారిగామాలు ఒక పదివేల పద్దొకటి చెల్లువేయించుకొచ్చా"

శ్రోతలు దట్టమైన ఆలోచనలో పడ్డారు. వాళ్ళ ఆలోచనల్లాగ చీకటి వ్యాపిస్తోంది

"స్త్రీలు తమకు తెలియదని ఒప్పుకొనే సంగతి ఒక్కటన్నా ఉన్నదంటావా?"

"ఒకటి ఉన్నది. తల్లీ తండ్రీ చూసిచూసి ఇటువంటి వాడికి తన్నిచ్చి ఎందుకు పెళ్లి చేశారో అనే విషయం."

చుట్టూ. కాస్సేపాగి రామయ్యగారి వెంకటసుబ్బయ్య అన్నాడు.

"ఇది నిజమైతే అయివుండొచ్చు, ఆ పాపము పుణ్యము నాకు తెలవదుగాని ఒకటి మట్టుకి తెల్సు..."

శ్రోతలు తిరిగి శ్రద్ధాళువులై ఆయనవైపు తిరిగారు.

"నిరుడు ఊడ్పుల్లో ఒకసారి ఆళ్ల తుమ్మల చేలో నిలగట్టిననీరు బుంగలు పడిపోయింది. చెపుదామని రొయ్యా ఆళ్లింటికి. మిట్ట మధ్యాహ్నం. రాగవరావు ఎవడో బైరాగాడితో చెయ్యి చూపించుకుంటున్నాడు. రాగవరావు - ఇంకా స్నేయితు డెవడో వుండాడు- ఇద్దరూ బైరాగి మాటలకి ఎగతాళిగానవ్వుతున్నారు. నవ్వొద్దని ఆళ్ళమ్మేమో కొప్పడతన్నది. ఆ డొకమాటన్నాడు..."

"ఏమని?"

"'మీ అబ్బాయికి దూరపు సంబంధము జయముండదని'. వాళ్లమ్మంది, 'నవ్వుతా

"మీ కుక్కను వెతికి పట్టి ఇచ్చిన వారికి 50 రూపాయల బహుమతి ఇస్తామని ప్రకటించ మంటారా?"

"అవునండి! 50 కాదు 100 రూపాయలయినా ఇస్తాను"

"పాపం ఆ కుక్క చాలా నమ్మకమైనది కాబోలు - అంత ఎక్కువ డబ్బు ఖర్చు చేస్తున్నారు."

"ఎంత మాత్రం కాదు. మనలో మాట. అది నా కుక్క కాదు. మా ఆవిడది. దీని విషయంలో ఎంతబహుమతిఅయినా ఇస్తానని చెప్పవచ్చు. ఏమంటారా! దాన్ని కాస్తా మూడు రోజుల క్రిందే గంగార్పణం చేశాను.

★ పిల్లి మొగ్గలు ★

లేమిటి, నీ జాతకంలోకూడా అటానే వుందట,' అని. ఇక సరే ఈ వూళ్ళోనూ చుట్టుపక్కలా ఈ పిల్లకి చాల్న పిల్ల లేదు గదా!" అపాడు వెంకటసుబ్బయ్య. శ్రోతలు మళ్లీ ఆలోచనలో పడ్డారు. వర్సయ్యగారన్నాడు.

"అట్లా అనుకున్నా రమణమ్మగారు చచ్చిపోయిందిగదా! ఇక ఈళ్లకి పట్టుకున్న దెయ్యంటి ఇయన్నీ"

"అందులో బూషయ్యగారి కిట్టాం టియ్యంటే వడి దనలు"

మొత్తంమీద ఇదంత నమ్మదగ్గది కాదన్నట్టు తేల్చారు నలుగురూ.

ఇంతలో వాళ్లకి పరిచితమైన దగ్గు విన్పించింది. నలుగురూ మాట్లాట్టం మానేశారు. ఆ కంఠం వెంకయ్యగారిది. ఆయన్ని మామూలుపరిస్థితుల్లో నూటిమనిషని నలుగురూ ఒప్పుకుంటారు. ఎందుకైనా మంచిదని అందరూ నోరు మెదపకుండా కూర్చున్నారప్పుడు. ఆయనదగ్గరకొచ్చి చుట్టచుడుతూ అన్నాడు.

"ఒరేయ్, ఇందాకట్నుంచీ కొట్టుకొస్తావుండి ఇన్నాను. ఏమిట్రా ఆపిచ్చి కూతలు? ఇప్పుడంటే అన్నారుగాని మళ్ళీ అనబాకండా పాపపు మాటలు. కళ్ళు పోతయ్"

"ఆ ఏదో తోసనికబుర్లలేవే" అన్నాడు ఒకడు.

"తోసని కబుర్లయితే ఇట్టాగా?" అని కాస్సేపాగి అన్నాడు. "దానిసంగతి నేను జెపుతా ఇనండి. పెళ్లి తర్జనభర్జనలో భూపయ్యగారింటికాడ మావోడు లేడూ? ఆడికి రాగవరావుకి మొదట్నుంచీ ఈపిల్ల దానిమీదే సూపు. అయితే లాంచనాలు కూడా పెట్టుకోలేని ఈ సంబంధం ఆళ్లమ్మకి సుతరామూ ఇష్టంలేదు. ఈవూళ్లోనో దగ్గిర్లోనో కాస్తి యెల్లనిపిచ్చుకుండా కట్నం ఇచ్చేకాడ చేసుకోవాలనుండేది. బూపయ్య-ఆయన దర్మరాజు - ఏమీ మాట్టాడేవాడు కాదు. ఇకామె రొల్లిపోయింది. ఉప్పుడీ డిప్ప పెకారమే కాని స్తన్నాడాయన. అంతేగాని ఈ యెదవకబుర్లేం కాదు." ఎవరూ మాట్టాడలేదు.

"ఇంకా కూకున్నారేరా, అన్నాలే శవ్వలా?" అని రోజూలాగ చావడిపాకలో పడుకోటాని కెళ్లిపోయాడు. ఆయనముందు ఎవరూ మాట్టాడలేరు. అది ఆయన నూటి స్వభావానికి విజయం. తాత్కాలికమైనా, ధర్మము, అధర్మము ముఖాముఖి ఎదుర్కొన్నప్పుడే దేనికైనా స్పష్టమైన విజయం లభించేది. అది రామాయణ, మహాభారతకాలాల్లో జరిగేది. కాని ఇప్పుడు అధర్మం, ధర్మాన్ని అధర్మంగా ఎదుర్కొంటుంది. అందుచేత ధర్మం, ధర్మంగా ఎదుర్కోవాలంటే ఓడి తీరుతుంది.

వెంకయ్యగారెళ్లాక సంభాషణ క్రమంగా కోలుకుంది.

"ఇష్టమంట మొదట్నుంచీ, ఇష్టం! ఇక డబ్బుమీదేనా ఇష్టంలేంది? కట్నాలూ, ఆస్తులూ వదులుకుని ఎవడైనా ఎర్రగా బుర్రగా వుందని అడ్డమైనదాన్ని చేసుకుంటాడా? అసలాడు బస్తీలో ఇట్టాటాళ్ల నెంతమందిని చూశాడో?..."

"మీరెరగరు, ఈళ్ళ తాతయ్య రామయ్యని. మూడుపెళ్లిళ్లు ..." అన్నాడు ముసలిపండు శీతయ్య.

"మంచిమాటన్నావు, తాతా! చేసుకోటం, మొహం కొట్టేశాక వదిలెయ్యటం ...మళ్లీ ఇంకోదాన్ని..."

"ఓరి, ఎవరికి తెలియనయ్యేరా! ఇట్టాటి రొయ్యన్ని బుద్ధులు లేకపోతే, మూడు లచ్చలాసామీ మూడెకరాలాడి ఇయ్యాని కళ్తాడూ? ఎక్కడైనా వుందా లోకంలో ఇది? ఇష్టాలంట, ఇష్టాలు" అన్నాడు వర్సయ్యగారు పంచ దులుపుకుని లేస్తూ.

* * *

లగ్నలేఖ పంపేది రేపనగా రామనాథయ్యగారి బావమరది వచ్చాడు, సరుకులికి గుడివాడ వెళ్లామని. రామనాథయ్యగారు కస్సుమని లేచాడు.

"గుడివాడాలేదు, బెజవాడాలేదు, ఎవళ్లింటి కాళ్లు పాండి. 'వియ్యానికైనా, కయ్యానికైనా ఈడూజోడూ' అన్నారు పెద్దలు. ఆళ్లకి లేకపోతే మనకైనా వుండాలి జ్ఞానం..."

బావమరది మొహాన నెత్తురుచుక్క లేదు.

కనకమ్మగారంది:

"మూడురోజుల్నుంచి ఇట్టా సాగించారురా...ఏమిటో ఇది, బంగారమంటి సంబంధం..."

"నోర్మూయ్! బంగారం! బంగారమైతే ఈ యదవ మొహాలదగ్గిరికి రావొచ్చారు..."

"అయ్యొ, మన్ని మూశా?...అమ్మాయిని చూసిగానీ..."

"అదిగో పళ్ళూడగొడ్తాను...నీ అందం, నీ పిల్లఅందం చూసి పడి ఛస్తున్నారు ... నీకూ నాకూ తెలియకపోతే లోకం కోడై కూయటల్లా?"

బావమరది అన్నాడు. "నువ్వూరుకో అప్పా! ఏమిటి బావయ్యా ఇంతకీ?"

"ఏమిటేమిట్రా ఇంకా? ఇంకా నయం, పిల్లదాని గొంతుకోక్కసేవాళ్ల మన్యాయంగా, ముండలమటాకొరుకిచ్చి! ఇంతెందుకురా, నేనన్నీ ఆలోచించే చెప్తున్నాను, నీకొక దణ్ణం, పెళ్లిలేదు, పెటాకులూ లేదు నువ్వింటికిపో." ఈ కేకలు విన్నాక ఇహ ఈ పెళ్ళి జరగదని లోకానికి రూఢి అయింది. అయితే ఈవార్త భూపయ్యగార్నీ, ఆయన హితుల్నీ తప్ప ఎవర్నీ ఆశ్చర్యపరచలేదు. అది ఆయన్ని క్రమంగా ఉద్రేకపరచింది; రాఘవరావుని దిగులు పరచింది. నేడు సమాజంలో ధర్మం పిల్లిమొగ్గలు వేస్తోంది. ★

వనితాలోకం

మహిళా సమస్యలు

1. స్త్రీలు-సత్యాగ్రహాలు

మద్యనిషేధం రద్దుకావలెనని యితీవల ఆంధ్రదేశంలో సాగింపబడిన సత్యాగ్రహంలో స్త్రీలుగూడా పాల్గొన్నారు. సత్యాగ్రహం విరమింపబడిన తరువాత ప్రభుత్వంవారు యీ స్త్రీలను మునుముందుగా విడుదలచేశారు. సత్యాగ్రహాభిమానులు వీరిని గౌరవ పురస్సంగా ఎదుర్కొని పూలమాలలతో సత్కరించి స్వాగతమిచ్చారు. ఒక ప్రజాయుద్యమంలో పురుషులతో బాటు స్త్రీలు పాల్గొని చెఱసాలలకు పోవడం ప్రశంసనీయమే కాని ఏ మద్యపానము సప్తవ్యసనములలో ఒకటై మానవులను నీతివిదూరులుగను, జారచోరత్వాది దుర్విషయలాలసులుగను, హంతకులుగను, దోపిడిగాండ్రుగను, వ్యాధిగ్రస్తులుగను, దారిద్ర్యపీడితులుగను చేస్తున్నదో, ఏ మద్యపానంవల్ల భారతదేశమునందలి అనేకమంది యిల్లాండ్రు కూటికి గుడ్డకు దూరమై జీవితసుఖమన్నది లేకుండా నిత్యము తిట్లతోను కొట్లతోను నానా యాతనలనుభవిస్తూ దుఃఖంతో కుమిలిపోతున్నారో, ఏ మద్యపానరతుల బిడ్డలు నానావిధ దురభ్యాసములకును, వ్యాధులకును గురై జాతికి కళంకమై దేశానికి భారమై హేయమైన జీవితం గడుపుతున్నారో, దేశంలోని సమస్త నేరాలకు దురంతాలకు ఏది మూలకందమో, అటువంటి మద్యమును నిషేధింపరాదని సాగింపబడిన సత్యాగ్రహంలో స్త్రీలు గూడా పాల్గొనేటట్లు చేసి వారిని సంభావించడం ఎటువంటి ధర్మమో తెలియడంలేదు. ఇది

◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆

"ఉత్తర"


◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆

ఏవిధముగా చూచినా స్త్రీలు వ్యతిరేకించవలసిన విషయంగాని ఆమోదించవలసిన విషయంకాదు. స్వార్థపరులైన రాజకీయ వర్గాలవారు ఇట్టి సందర్భములలో స్త్రీలచేత సత్యాగ్రహం చేయించడం వారి వ్రేలితో వారి కన్ను పొడిపించడంగా ఉన్నది.

త్రాగుబోతులైన భర్తలవల్ల కాయకష్టం చేసే పాటకపుజన కుటుంబాల్లో స్త్రీలు అనుభవిస్తున్న బాధలు యిన్నీ అన్నీ కావు. ప్రొద్దుటినుండి చెమటోడ్చి తెచ్చిన కూలి డబ్బులు యింటికి తీసుకరాకుండా సరాసరి కల్లు సారా దుకాణాలకే పోయి ఆ డబ్బులతో తప్పత్రాగి మత్తెక్కి పెనిమిటి వీధుల వెంట దొర్లుతూ ఉంటే యింటివద్ద యిల్లాలు పిల్లలకైనా కాచిపోసేందుకు గింజలులేక ఒకవంక అల్లాడుతూ, మొగుడు పోలీసుల చేతుల్లో పట్టుబడి జైలుకుపోయి చావుదెబ్బలు తినకుండా వాడిని రక్షించడానికి తన కూలి డబ్బులు గూడా పోలీసువాళ్ళ చేతుల్లో పెట్టి తానూ తన బిడ్డలూ ఆకటిచిచ్చుతో అల్లాడుతూ ఉంటుంది. కూలినాలిచే జీవించే నిరుపేద సంసారాల్లో ఇది నిత్యము జరుగుచుండే వ్యవహారము. పేదవారేమిటి, భాగ్యవంతులైనా త్రాగుబోతువాని భార్య కష్టము ఆమెకే తెలియాలి. ఇటువంటి మద్యము నిషేధింపరాదని సత్యాగ్రహము చేయడము, దానిలో స్త్రీలు గూడా పాల్గొనడమూ చూస్తే ఇంతకంటె అమానుషమైన దుర్ఘటన వేరొకటి లేదనిపిస్తుంది. నిజంగా మన స్త్రీలు చేయవలసిన సత్యాగ్రహం యిది గాదు. ఏ యిళ్లలో దొంగతనంగా కల్లు సారాలు తయారవుతున్నాయో, ఏ ఉద్యోగబృందముయొక్క దుస్స్వార్థకాంక్షా ఫలితంగా మద్యనిషేధ కార్యక్రమము విఫలమైపోతున్నదో, వాళ్లను అన్వేషించి పట్టుకొని వాళ్ల వాకిళ్లముందు సత్యాగ్రహాలు, నిరశన వ్రతాలు సాగించవలసిఉంది.

(30 వ పేజీ చూడండి)





"రావోయి చందమామా! మా వింతగాథ వినుమా!"

విజయా వారి "మిస్సమ్మ" నుండి—
లైటింగ్ : మార్కస్ బార్ట్లే.

★ మహిళా సమస్యలు ★

అట్లా చేసినట్లయితే వారు తోడి స్త్రీలోకానికెంతో మేలు చేసినవారయ్యేవారు, వారు భారత నారీమణుల సుయశస్సును నిలబెట్టినవా రయ్యేవారు. వారి నామములు జగద్విఖ్యాతమయ్యేడివి. త్రాగుబోతు భర్తలవలన అనవరతము అల్లాడుతున్న వేలాది స్త్రీల హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములకు వారు పాత్రలయ్యేడివారు. ఉచితమైన యిట్టి సత్కార్యాచరణకు పార్టీ నేతల స్వార్థము అడ్డువస్తూఉంటే అమాయికలైన స్త్రీ లేమి చేయగలుగుతారు? ఆంధ్ర స్త్రీలకు స్వతంత్ర భావములు అలవడేవరకు ఈ రాజకీయ చతురంగంలో పావులు కాకతప్పదుగదా.

2. మగనికి భరణం

హిందూ వివాహ సంస్కరణ సందర్భంలో లోక్ సభలో చాలా విచిత్రమైన చర్చలు జరిగాయి. ఈ చిత్రములలోకెల్లా విచిత్రమైనది భార్య భర్తకు మనోవృత్తి యివ్వడం ఒకటి. స్త్రీ భర్తగలదై అతను విడిచిపెట్టినట్లయితే ఆ భర్తవల్లనూ, విగతభర్తృక అయితే అతని తండ్రి, అన్నదమ్ములు మొదలైనవారి వల్లను మనోవృత్తి తీసుకోవడం మనదేశంలో అనాదినుంచీ ఆచారంగా ఉన్నది. ఇప్పుడు రాజ్యాంగంలో స్త్రీ పురుషులకు సమాన హక్కులు ఏర్పడినందువల్ల భార్య భర్తవల్ల మనోవృత్తి పొందినట్లుగానే భర్త భార్యవల్ల మనోవృత్తిపొందే హక్కును కల్పించే బిల్లు వచ్చింది. లోక్ సభలో స్త్రీ సభ్యురాండ్రంతా దీనిని ఏకోన్ముఖంగా ఎదిరించారు. కాని లాభం లేకపోయింది. స్త్రీ ఆర్థికస్తోమతి కలదైతేనూ, విడాకులు ఆమే ముందుగా కోరిఉంటేను, స్త్రీ భర్తకు భరణం యివ్వడం సమంజసమేనని పురుషపక్షంవారు సమర్థించారు. రాజ్యసభలో కూడా యీ విషయం స్త్రీలు ఎదిరించినప్పటికీ 8 వోట్ల తేడాతో నెగ్గి స్త్రీ భర్తకు మనోవృత్తియిచ్చే విషయం స్థిరం చేయబడ్డది. పురుషుల మెజారిటీ ఉన్న సభలో పురుషులకు అనుకూలమైన శాసనములు చేయడంలో కష్టమేమి ఉంటుంది? అవలీలగా అయిపోతాయి - ఈ ఒక్క విషయమే చాలు స్త్రీలకు శాసనసభలో తగినన్ని స్థానములు లేకపోతే కలిగే అన్యాయాలు నిరూపించడానికి. హిందూ కుటుంబాల్లో స్త్రీలు అనాదినుంచీ మనోవృత్తి తీసుకొనే ఆచారం ఉన్నప్పటికీ, దీనిలో జరిగే అన్యాయాలకు అంతులేదు. ఒక్క వితంతుస్త్రీకి భరణం యివ్వవలసివస్తే బావలు మఱదులు మొదలైనవారు ఆస్తి దాచివేయడమో, అన్యాక్రాంతముచేయడమో, పెద్దపెద్ద ఆస్తిని కొద్దిగా ఉన్నట్లు చూపించడమో, ఇంకా యెన్నెన్ని అకార్యాలో చేస్తూ ఉంటారు. ఇక భర్త విడిచి పెట్టబడిన భార్యకు భరణం యివ్వవలసివస్తే ఆమె మంచిదికాదని బొంకి భరణం యివ్వకుండా తప్పించుకోడానికి విశ్వప్రయత్నం చేస్తూ ఉంటాడు భర్త. న్యాయంగా స్త్రీకి భరణం యిచ్చే ఏర్పాటులు అసలు శాసనంలోనే లేవు. మన హిందూస్త్రీలల్లో సంవత్సరానికి మూడు వరహాలు నాలుగు వరహాలు - అంటే 12 రూపాయలు, 16 రూపాయలు భరణం తీసుకుంటున్నవారుగూడా ఉన్నారు. ఇది, ఒకమనిషి మనుగడకు ఒక నెలకుగూడా సరిపోదు. కాని కోర్టువారు దాయాదులు చూపించిన ఆస్తినిబట్టి భరణం నిర్ణయిస్తారు. అది ఆ మనిషి బ్రతకడానికి చాలుతుందా అన్న ప్రశ్న వారి కక్కరలేదు. ఈ మనోవృత్తి వ్యవహారములు యింత అధ్వాన్నముగా ఉన్నవి గనుకనే మర్యాదస్తులైన తలిదండ్రులు అధీనం తప్పిన తమ పిల్లకు మనోవృత్తి అడగడం ఒక న్యూనతగా భావించి, పోనీలే మన కందటితోబాటు దానికీ పిడికెడన్నము లేకపోతుందా అని ఉదాసీనతలో భరణమే అడగకుండా ఊరుకోడం గూడా జరుగుతున్నది.

ఇటువంటి సందర్భంలో ఆడవాళ్లకు సమాన హక్కులు వచ్చీరాకమునుపే, యిచ్చియివ్వకమునుపె భార్యలవల్ల భర్తలకు భరణం యిప్పించవలెనని ఉభయసభలవారు తీర్మానించడం, వడ్డించేవాడు మనవాడన్న సామ్యం జ్ఞాపకానికి వస్తున్నది. అక్కడక్కడ ఒకరిద్దఱు పెద్దమనుషులు స్త్రీవల్ల 'పురుషుడు మనోవృత్తి తీసుకోవడమేమిటి నామర్దాపని' అని రాజ్యసభలో వాదించారు. కాని తమ పురుషులకు న్యాయం కలుగజేయవలెననే ఆతురతలో ఈ నామర్దా విషయం వారికి తోచనేలేదు. స్వజాత్యభిమానమంటె అట్లా ఉండాలె!

3. స్త్రీల ఉద్యోగాలు

స్త్రీలకు పురుషులకు అన్నిట సమాన హక్కులు అనే విషయం రాజ్యాంగంలో ముచ్చటగా చేర్చబడినా ఆచరణలోకి వచ్చేటప్పటికి అడుగడుగునా అవరోధాలు సందేహాలు వస్తున్నాయి. ఉద్యోగాలు యివ్వడంలో స్త్రీలకు పురుషులకు భేదం లేదన్నది నిజమైనప్పటికీ, వివాహితల విషయమై కొంచెం వ్యత్యాసం చూపక తప్పదని యీమధ్య పెద్దలే సెలవిస్తున్నారు. పండిత జవహర్‌లాల్ నెహ్రూవంటి సర్వ సమవాదికి గూడా యీ భేదం అవసరమని తోచడం ఆశ్చర్యంకలిగిస్తున్నది. కాని ఎవరుగాని వివాహితల విషయంలో యీ భేదం చూపడం సమంజసంగాలేదు. వివాహితలైన స్త్రీలకు ఉద్యోగాలు చేయడంలో సాంసారికమైన యిబ్బందులుంటే, అవి వారే సర్దుబాటు చేసుకుంటారు. అవకాశం ఉన్నవారే చేస్తారు. ఒకవేళ వారి విధులను వారు నిర్వర్తించలేకపోతే దానికి తగిన ప్రతిక్రియ ఉండనే ఉంటుంది. పని చేయకపోతే, చేయలేకపోతే ఎవరుగాని కూర్చోబెట్టి జీతం యివ్వరుగదా, ఇవ్వరని వాళ్ళకు తెలిసే ఉన్నదిగదా. కనుక వివాహిత స్త్రీలవిషయంలో ఉద్యోగములో భేదం చూపడం న్యాయంగా లేదనే చెప్పాలి.

4. ఎన్నికలు

ఆంధ్ర శాసనసభకు నిలిచే అభ్యర్థుల పేర్లు రోజు రోజు పత్రికల్లో పడుతున్నాయి. అన్ని పార్టీలవారు పోటాపోటీలతో అభ్యర్థులను నిర్ణయిస్తున్నారు. కొన్ని పార్టీలవారు ఎన్నికల మైత్రి నెఱపి ఒకే పక్షంగా అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తున్నారు. ఈ జాబితాలో స్త్రీ అభ్యర్థినుల పేర్లు వినరావడం లేదు. కడప రామసుబ్బమ్మగారి అధ్వర్యాన స్త్రీలు రాయబారం నెఱపినట్టుగూడా వినవస్తున్నది. కాని ప్రదేశ కాంగ్రెసు అధ్యక్షులు తగినంతమంది స్త్రీలు ఎన్నికల్లో నిలవడానికి ముందుకు రావడంలేదని వారికి సమాధాన మిచ్చినట్టుగూడా పత్రికలు తెలుపుతున్నాయి. అదునిజమే ఏమి ముందుకు వస్తారు?

వెనుకటికి బ్రిటిషు సామ్రాజ్యము ఇరవైమంది పెట్టుబడిదార్ల చేతుల్లో ఉన్నదని చెప్పుకుంటూ ఉండేవాళ్లు. ఆ సామ్రాజ్యమే ఏమిటి, నేటి ప్రజాస్వామ్య రాజ్యాలన్నీ పెట్టుబడిదార్ల చేతుల్లోనేఉన్నాయి. ప్రజాస్వామ్యమంటే ధనిక ప్రజాస్వామ్యమనే అర్థం చెప్పుకోవాలె. అవును, ధనం లేనివాళ్లు అభ్యర్థులుగా ఎట్లా నిలుస్తారు? గవర్నమెంటే పది వేల కర్చువఱకు ఆమోదించిఉంటే, ఇటువంటి పరిస్థితుల్లో స్త్రీ అభ్యర్థినులు ముందుకు రావడం ఎట్లా సంభ

వనితాలోకం:

చదరంగము మొదలైనవి

క్రీడలలో మానసిక వికాసము కలిగించేవి కొన్ని, శారీరక వికాసము కలిగించేవి కొన్నీను. టెన్నిస్, బాడ్మింటన్, హాకీ, క్రికెట్, పింగ్‌పాంగ్ మొదలైనవి బయట (*Out door*) ఆడ తగినవి. వీటికి బహిరంగస్థలము కావలసి ఉంటుంది. బంతులు, బ్యాట్లు, నెట్లు, బల్లలు ఒక్కొక్కదానికి కావలసిన సామగ్రి ప్రత్యేకముగా ఉంటుంది. మహిళా సంస్థలు, స్త్రీల క్రీడాసంఘాలు, మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలలు సాధారణముగా అన్నిరకముల క్రీడలలో స్త్రీలను బాలికలను ప్రవీణలను చేస్తున్నాయి. వీటిలో పోటీలు నడిపి గెలుపొందినవారికి బహుమాన ప్రదానాలు చేస్తున్నాయి. క్రిందటి నెలలో బొంబాయి నగరములో సినిమాతారలందరూ క్రికెట్ ఆడి కొన్నివేలు సంపాదించి జాతీయనిధికి విరాళ మిచ్చారట. వారందరి పేర్లుగల బ్యాటులను వేలము వేయగా కొన్నివేల రూపాయలు వచ్చినాయట. దానివలన తారలకు ఆటలో నేర్పే కాకుండా ధనార్జన కూడా చేకూరింది. ఈ క్రీడలవలన దేహము బలిష్ఠమై నవచైతన్యముతో ఆరోగ్యవంతముగా ఉంటుంది. నరములకు బలము కలుగుతుంది. రక్తము దేహమంతటా బాగా ప్రసారితమవుతుంది.

ఈతకూడా ఒక క్రీడ. నీటిలో చేపవలె ఈదుకొని పోవటము ఒక ప్రజ్ఞావిశేషము. ఈత వచ్చినందువల్ల నీటి గండాలనుండి తప్పించుకోవచ్చు. ప్రతి వ్యక్తికీ ఈతవచ్చి ఉండటము మంచిది. ఈ క్రీడకూడా దేహబలాన్ని పెంపొందించేదే. ఈత నేర్చుకోవటానికి ప్రతి గ్రామములోను స్త్రీలకు వసతులు తక్కువ. కొన్ని పట్టణాలలో మాత్రమే ఏర్పాట్లు ఉన్నాయి. ఆ కారణముచేత ఇది స్త్రీలందరికీ అందుబాటులో లేకపోతున్నది:

విస్తుందా? స్త్రీలు గూడా శాసనసభల్లో సమాన ప్రతిపత్తి ఉండవలసిందే నని ఎంతమంది నాయకులు సానుభూతి వాక్యాలు పలికినా, ద్రవ్యసాధ్యమైన పనికి స్త్రీలు ఎట్లా పూనుకోగలుగుతారు? స్త్రీలు అధిక సంఖ్యాకులుగా రావలెనంటే ఆయా పార్టీలవారే స్త్రీ అభ్యర్థినులను నిలిపి వారి విజయానికి కృషి చేయాలె. ఒక సీటుకు ఒక పార్టీ పక్షమున స్త్రీ అభ్యర్థిని నిలబెట్టబడినప్పుడు, మరొక పార్టీవారు గూడా అక్కడ స్త్రీ అభ్యర్థినినే నిలపడం నైతికమైన సామాన్య ధర్మంగా నిర్ణయించుకోవాలె. ఆ విధంగా అన్ని పార్టీలవారు స్త్రీల యందు అభిమానంతో నిర్ణయించినట్లైతే కొంతమంది స్త్రీలు శాసనసభలో ఉండే అవకాశం కలుగుతుంది లేకపోతే లేదు. కాని ఈ ధర్మమును పార్టీ నాయకులు గమనించడం సంభవిస్తుందా? ★

ఇల్లిందల సరస్వతీదేవి

స్త్రీలకు అన్ని సమయాలలో పరుగెత్తటానికీ, ఎగురుతూ ఆడటానికీ వీలుఉండదు. కొందరికి అటువంటి ఆటలలో అభిరుచి కూడా ఉండదు. వయసుమళ్ళిన స్త్రీలు, బలహీనముగా ఉన్న స్త్రీలు అటువంటి ఆటలకు అశక్తులు. అటువంటివారికి ఇంటిలో కూర్చుని ఆడేఆటలు అనేకరకాలున్నాయి. చీట్లు, కేరమ్సు, చదరంగము, పచ్చీసు, పులిజూదము, పరమపద సోపానపటము, మొదలైన ఎన్నో రకముల ఆటలు స్త్రీలందరికీ పరిచయమైనవే ఉన్నాయి.

పచ్చీసు, చదరంగము, పరమపదసోపాన పటము, పులిజూదము, పాచికలు అతి ప్రాచీనమైనవి. జూదము కూడా వీటిలో చేరినదే. పూర్వము రాజులు జూదమును నాగరికతకు చెందిన ఒక ఆటగా పరిగణించేవారు. పాండవులు కౌరవులు ఆడినది జూదమే. నలుడు పుష్కరుడు ఆడినది కూడా జూదమే. వాళ్లు రాజ్యాలనే పణముగా పెట్టి ఆడేవారు. మన వాఙ్మయములో ఎక్కడ చూసినా సొగటాల ఆటలే కనుపిస్తాయి. పార్వతీ పరమేశ్వరులూ, రుక్మిణీ కృష్ణులూ, సత్యభామా కృష్ణులూ తీరిక సమయాలలో ఆడిన ఆటలు పాచికలతోనే.

ఆ కాలపు స్త్రీలు పరమపద సోపాన పటము ఎక్కువగా ఆడేవారు. నిచ్చెన ఎక్కిన సంతోషము పామునోట బడగానే మాయమవుతుంది. పటమునిండా చిన్నవీ పెద్దవీ నిచ్చెనలూ పాములూ ఉంటాయి. కష్టసుఖాలతో నిండిన ప్రాపంచికదృష్టి నలవరచుకోవటాని కీఆట అనువైన దనుకొనే వారు. ముక్తిసాధనగా దీనిని భావించేవారు.

చదరంగము ఇంటిలోపల ఉండి ఆడే ఆటలలో ప్రధానమైనది. దీనిలో రాజు, మంత్రి, శకట్లు, గుఱ్ఱాలు, ఏనుగులు, బంట్లు ఉంటాయి. ప్రతి పక్షానికీ ఒక రాజు, ఒక మంత్రి, రెండు శకట్లు, రెండు గుఱ్ఱాలు, రెండు ఏనుగులు, ఎనిమిదిబంట్లు ఉంటాయి. ఎనిమిది గడులు నిలువుగా, ఎనిమిది గడులు అడ్డముగా ఉండి, పేకకు తగినట్లే చతురముగా ఉంటుంది పటము. ఇది ఇద్దరు ఆడే ఆట. దీనిలో ఒక్కొక్క పావుకు ఒక్కొక్క విధమైన నడక ఉంటుంది. ఈ ఆటకు ఎన్నో నియమాలూ నిబంధనలూ ఉన్నాయి. ఎదటి పక్షములోని రాజుకు 'షహ్' అనాలని ఇద్దరి ఆశయమూను. ఆటలోని నిబంధనలకు కట్టుబడి, నియమాలను పాలిస్తూ, ఆత్మరక్షణ చేసుకొంటూ శత్రుసైన్యములో మెసలుతూ తన సైన్యాన్ని చాకచక్యముతో నడిపించాలి. శత్రురాజును ముట్టడించి 'షహ్' అనాలి. వేసే ప్రతి ఎత్తూ ఆ దృష్టితోనే వెయ్యాలి. ఎదటివారి నడకనూ దృష్టినీ బాగా గమనించాలి. ఎత్తుకు పైఎత్తు వేయటములో నైపుణ్యము కనబరచాలి. ఇంత నేర్పుతో ఆడిన ఆటలో గెలవటము సంభవిస్తే ఎంత ఆనందము కలుగుతుందో చెప్పలేము. పది ఊళ్లు గెలవగల శౌర్యపరాక్రమాలు కలిగినట్లనిపిస్తుంది. ఈ ఆట మేధస్సుకు పరిశ్రమను కలిగిస్తుంది. సామాన్యముగా మేధావులకే ఈ క్రీడయందాసక్తి. కొన్ని వారాల పర్యంతమూ ఒక ఆటను ఆడినవారుకూడా ఉన్నారు. ఈ క్రీడవల్ల రాజకీయములలో అవసరమైన పరేంగితము, సమయస్ఫూర్తి, నిశితదృష్టి మొదలైనవి అభివృద్ధి చెందుతాయని చాలామంది నమ్మకము.

గవ్వలతో పందెమువేసి పావులను నడిపించేది పచ్చీసు. ఇది నలుగురు ఆడవచ్చు, లేదా ఇద్దరు ముగ్గురుకూడా ఆడవచ్చు. నలుగురు రెండు పక్షాలుగా చేరి కూడా ఆడుతూ ఉంటారు. ఈ ఆటలో ఎదటి పక్షమువారి పావులను కనీసము ఒక్కదానినైనా చంపనిదే తనకాయలను లోపలికి (పంటగడి దాటకూడదు) తీసుకొని

అడ్డాకుల్లో విడాకులు

చాగంటి విశ్వనాధరావు

విరించి విరిచికట్టి పారేశాడు వాళ్లిద్దర్నీ యీ లోకంలో విదలింపుల్తో, అదలింపుల్తో అన్యోన్యంగా కాలం గడపమని. పెద్దలంతా "అనయోః దంపత్యోః అన్యోన్యం ప్రీతి రస్తు" అని దీవించి రామాన్ని, రాజ్యాన్ని ఒకటిగా చేసి తమ ధాన్యతను ఒదిలించుకున్నారు. రామం-రాజ్యం — పేర్లదాకా బాగానే వుంది కాని "రామరాజ్యం"మట్టుకు కాలేకపోయింది. దగ్గర సంబంధాలు కలుపుకుంటే ఆదరాభిమానాలు అభివృద్ధి పొందుతాయని తల్లీ దండ్రీ బలవంతంగా మేనరికం చేసేరు. నాజూకు నాగరికతా తక్కువంటూ ఎప్పుడూ ధుమధుమలాడుతూనే సంసారాన్ని నెట్టుకొస్తున్నాడు రామం. పరిశుభ్రం లేదంటూనో, ఎప్పుడూ జిడ్డోడుతూ వుంటావనో సాధిస్తూవుంటాడు రాజ్యాన్ని. అతను ఎంత అసహ్యించుకున్నా రాజ్యం స్త్రీసహజమయిన ఓర్పుతో కాలాన్ని గడుపుకొస్తూంది. ఎంత సహజమైనా రోజూ వాడుకొంటూవుంటే ఎంతకాలమొస్తుంది! తనూ యింతో అంతో స్కూలు ఫైనలుదాకా చదువుకుంది. లోకంలో మంచీ చెడూ చూస్తూంది. పిల్లల్తో, పసిపాపల్తో, భర్త ఆఫీసువేళ తొమ్మిదిగంటలకే అమర్చవలసే వంటల్తో, నిత్యం నిగనిగలాడుతూ పొడర్ల మెరుగుల్లో, అత్తర్ల ఘుమఘుమల్లో, యిస్త్రీ మడతల్లో సినిమా స్టార్‌లాగ నిత్యం అవుపడాలంటే సాధ్యమా? అన్నీ తెలుసుండీ యీ మొగాళ్లు ఆమాత్రం గుర్తించుకోకపోతే ఎలాగ అనుకుంటుంది.

ఆదివారం తీరుబాటుగా కూర్చున్నాడు, సిగరెట్టుమీద సిగరెట్టు తగలేస్తూ. ప్రక్కనే కూచుని బియ్యం బాగుచేసుకుంటూన్న రాజ్యం; "ఆ పొగని కాస్త అటు వొదలకూడదూ? రోజురోజుకీ ఎక్కువయిపోతున్నాయి పాడు సిగరెట్లు" అంది.

"ఇదుగో అస్తమానం ఆ సణుగుడే వద్దన్నాను. నా యిల్లూ నా డబ్బూను! నా యిష్టమొచ్చినట్టూ తగలెట్టుకుంటాను. నికెందుకూ? నువ్వవతల వరండాలో కూచోకూడదూ అంత పొగకే కందిపోయే సుకుమారివైతే?"

"ఎప్పుడు చూచినా చిర్రు బుర్రుమంటూనే వుంటారేమండి; సరదాగా ఓ మాట మంతీ లేకుండాను. ఇప్పుడు నా సణుగు డేముంది? సంపాదనలో సగం సిగరెట్లకే కర్చవుతూంది. ఇంట్లో చూస్తే బియ్యం నిండుకున్నాయి. పాపకి పాలడబ్బా మాట ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోరు. ఎలా వేగడం మీతో?"

"మీ బాబుగారి సంపాదన నేనేమీ కర్చుపెట్టడం లేదులే! రోజూ ఏదో ఒకటి నిండుకుంటూనే వుంటుంది. వెధవసంసారం నే చెయ్యలేను. ఆదివారం కదా అని యింట్లో కాస్సేపు కూచుందామంటే యేదో ఓ పోరు!" అని విసుక్కుంటూ చరచరా వెళిపోయేడు ఎక్కడికో?

ఇంతలో చంటిది వుయ్యాల్లోంచి లేచి ఏడవడం మొదలుపెట్టింది. "పాలడబ్బా తెమ్మంటే వినిపించుకోకుండా వెళ్లారే! యీ పిల్లతో ఎలా వెళ్లదియ్యడం?" అనుకుంటూ పిల్లని సముదాయిస్తూంది.

★ చదరంగము మొదలైనవి ★

పోకూడదు. పండపోతున్న ఇతరుల పావులను చంపటము అతి సంతోషకరమైన విషయము, చెప్పుకోతగిన ప్రజ్ఞ. ఒక పందెముతో రెండు మూడు కాయలను చంపటము ప్రజ్ఞావిశేషము. ఈ ఆటలో పందెముల పేర్లన్నీ ఉర్దూభాషలో ఉన్నాయి. పచ్చీస్, తీస్, దస్, చౌదా, బారా, అన్న పందేలతో పావులను నడుపుతారు. అప్పుడప్పుడు రెండు పచ్చీసులుగాని రెండు తీసులుగాని పడుతూఉంటాయి. వాటిని దో పచ్చీసనీ దో తీసనీ అంటారు. ఈ ఆటలో తప్ప మరే ఇతరవిధములైన క్రీడలలోను ఉర్దూపదాలు లేవు. భాష రాకపోయినా పందేల పేర్లు నేర్చుకొని ఆడి గెలిచి ఆనందిస్తూ ఉంటారు. ఈ ఆటవల్ల లౌకికజ్ఞానము అభివృద్ధి చెందుతుందని ఒక నమ్మకము.

పులి జూదములో మూడు పులులు, పదిహేను మేకలు. ఇది ఇద్దరు ఆడే ఆట. పులులకు మూడింటికే స్థలనిర్దేశ్యము ముందే అవుతుంది. ఇది మొదటి ఎత్తు. దీనిలో మార్పు ఉండదు. మేకలతో ఆడేవారు తమ వంతు ఆట వచ్చినప్పుడు ఒక్కొక్క మేకను గడిమీద పెడుతూ ఆడాలి. మూడు పులులు తలచుకొంటే పదిహేను మేకలను అవలీలగా తినివేయవచ్చు గాని, చుట్టు ప్రక్కల తిరుగుతూ పులి నోటి కందకుండా మేకలు తప్పుకొని తిరుగుతూ ఉంటాయి. బలవంతమైన సర్పము చలిచీమలచేత చిక్కినట్లుగా అతిసాధువులూ పిరికిజంతువులుఅయిన మేకలు గంతులువేస్తూ పులులనుకట్టివేస్తాయి. పదిహేను మేకలతో మూడు పులులను కట్టించలేమా అని అహంభావముతో బయలుదేరితే వెంటనే గర్వభంగముకూడా జరుగుతూ ఉంటుంది.

చీట్లలో, బ్రిడ్జి, రమ్మీ, బేస్తు, కుదేలుపట్లాట, మూడు ముక్కలాట, ఆతును, (వేలకు) మొదలైన రకాలు చాలా ఉన్నాయి. వీటిలో బ్రిడ్జి తప్ప తక్కిన ఆటలన్నీ అందరూ ఆడుతునే ఉంటారు. బ్రిడ్జి గణితముతో కూడినది కనుక ఇతరవిధములైన ఆటలవలె అందరూ ఆడరు. చీట్లాటలో చాలామంది డబ్బుపెట్టి ఆడుతూ ఉంటారు.

ఇళ్ళలో పనిచేసుకొని పిల్లలతో వేగివేగి ఉన్న స్త్రీలకు ఈ క్రీడలవల్ల మానసికముగా విశ్రాంతి కలుగుతుంది. గృహకల్లోలాలతో విసిగిపోయిన ప్రాణానికి హాయినిగొలుపగలిగినవి క్రీడలే. ప్రతిదినమూ విరామ సమయములో కనీసము ఒక గంటసేపు వీటిలో మనసును జొరనిచ్చినట్లయితే గృహిణికి గృహజీవనము నిస్సారముగా తోచదు. అట్లా అని వేళ గాని వేళలలో వ్యసనముగా క్రీడలతో కాలక్షేపము చేసినట్లయితే దైనందిన కృత్యాలకు సమయభంగము కలుగుతుంది. తమ కేవి హితము కూర్చగలవో, వాటి పరిమితు లెంతవరకో తెలిసికొంటే జీవితాదర్శము చేతి కందినట్లే. ★

వీధిలో పాలవాడు "అమ్మా ఆదివారం. బాబుగారింట్లో వుంటారని ఒచ్చేను లెక్క యిప్పించండం"టూ తయారయేడు. రోషం తోటీ, అవమానంతోటీ రాజ్యం ముఖం కందగడ్డలాగ జేవురించింది. "ఏమో మీ బాబుగారూ, నువ్వూ ఏ గంగలో దిగుతారో నాకేం తెలీదు. దిక్కుమాలిన సంసారం" అందామనుకుంది. కాని కొంచెం పస్తాయించి "ఆయ నిప్పుడే వీధిలోకి వెళ్ళేరు రామన్నా. రేపు నే నడిగి వుంచుతాను. ఇప్పటికి దయచేసి వెళ్ళు నాయనా" అంది. ఏ కళనున్నాడో కాని "అలాగేనండమ్మా" అంటూ దాటిపెట్టేడు.

"అక్కా విడాకులచట్టం పేసయిందిటే!" అంటూ శంకరం ఒచ్చేడు పేపరు పట్టుకుని.

"అవన్నీ నాకెందుకురా నీ ముఖం. స్వకీయాల్లోనే వుక్కిరిబిక్కిరౌతూ వుంటే రాజకీయాలు కూడాను! పాపని ఓసారి తియ్యి. పాలు నీళ్లు మరగబెట్టి పట్టుకొస్తాను" అంటూ వంటింట్లోకెళ్లింది.

* * *

"శశి ఏదీ?" అన్నాడు రాత్రి పదిగంటలకు యిల్లుచేరుకున్న రామం.

"మీకోసం కాని అన్నం తిన్నంటూ యిప్పటిదాకా చూసిచూసి యిప్పుడే నిద్రపోయింది."

"ఏకోవిధంగా బుజ్జగించి తినిపించాలి కాని యిప్పుడు పదౌతూంది కదా యిప్పటిదాకా దాన్ని పస్తుపడుకోబెట్టేవా? ముగ్గురు పిల్లల్ని కన్నావే కాని వాళ్ల నెలా పెంచాలో యీసరికి తెలీదు."

"మొదట్నించీ మీరు దాని కలా అలవాటుచేసేరు యిప్పుడు - కొత్తగా అర్ధరాత్రిదాకా కొంపకి రాకుండా తిరగడం మొదలెట్టేరు. మీ చేత యిది మాన్పగలిగేనా, దానిచేత అది మాన్పగలగడానికి? మీ కూతురది. మధ్య నా తప్పేముంది?"

"మాటకి మాట తెగులు! నువ్వు నన్నింట్లో వుండనిస్తేనా వుండడానికి! అహరహం పోరేనాయె! యిహ నీ భారతం కట్టిపెట్టి నాల్గు మెతుకులు వడ్డించు."

శశిని లేవదీసి తనతోబాటు భోజనానికి కూర్చోబెట్టుకున్నాడు. రాజ్యం వడ్డిస్తూ వుంది.

"అబ్బబ్బబ్బ! నాకీ నరకం ఎన్నాళ్ళురా బాబూ! నాలికమీద మొక్కలు మొలుస్తున్నాయే నీ వంటతోను! కూరలో ఉప్పులేదు. అన్నంనిండా బెడ్డలు. పులుసన్న పేరేకాని కాలకూటవిషం నయం దీనికన్న. ఇలా ఎన్నాళ్లు వేగడం నీతోను?"

"బియ్యం నిండుకుంటున్నాయని నాలుగురోజులనుండి మీకు జ్ఞాపకం చేస్తూనే వున్నాను. డబ్బా దులిపి వున్న కాడికి బాగుచేసి వండేనండీ. ప్రతిదానికీ గోరంతది కొండంతచేసి నన్ను నిందించడమే పని పెట్టుకు కూర్చుంటే నేనేం చెయ్యడం! మీ కెంత యిష్టం లేకపోతేమట్టుకు యిప్పుడు నే నెక్కడికి పోగలను. అగ్నిసాక్షిగా మూడుముళ్ళూ వేసి వివాహమాడేరు. ఇప్పుడు తప్పకుంటే తప్పుతుందా? నే నుబ్రతికున్నంతకాలం తప్పదు." అంటూ కంట తడిపెట్టుకుని తలుపు చాటుకు పోయింది.

"ఆహా! అదా నీ భరోసా? యివేమీ నాయనమ్మరోజులు, అమ్మమ్మ రోజులు కావే తప్పకపోడానికి! చూదువుగాని నా తడాఖా" అంటూ కంచంలో నీళ్ళు దిమ్మరించి లేచిపోయేడు.

* * *

"ఒరే శంకరం తపాలాబంట్రోతు నా చేత సంతకం పెట్టించుకొని కవరుయిచ్చి వెళ్ళేడు. నేను కోర్టుకు హాజరవాలిట! తక్కిన విషయాలు ఏమంత సరిగా తెలియలేదు. నువ్వోసారి చూడు." అంటూ శంకరానికో కవరిచ్చింది. అతను అది సాంతం చదివి "అక్కోయ్! మొదటికేసు మనదేనే!" అని గావుకేక పెట్టాడు.

"కేసేమిట్రా? ప్రతిదానికి వెటకారాలు నువ్వూను. వేళాపాళా లేదట్రా. సరిగా చెప్ప నన్నాట్టే విసిగించక."

"అయితే విను. విడాకుల చట్టం పేసయింది కదే! బావ నీకు విడాకు లిస్తాట్ట. అందుకని అతను కోర్టువారిని కోరేడు. కేసు విచారణరోజున మనమంతా కోర్టుకు వెళ్లాలి. ఏయే కారణాలవల్ల బావ నీకు విడాకు లిస్తాడో వాటిని బలపర్చే సాక్షులు, మీ యిద్దరితరఫున వాదించడానికి ప్లీడర్లు, మొదలుగాగల కోర్టుపక్షులన్నీ అక్కడ జేరతాయి..."

"అదిగోరా మీ బావగారు వచ్చేరు కాబోలు. వెళ్ళి వీధితలుపు తియ్యి.'

"తీస్తా కాని, నువ్వు అనవసరంగా ఏడుపులు, పెడబొబ్బలు పెట్టకుండా నే చెప్పినట్టు చెయ్యి. ఇప్పుడసలు నీకీ వుత్తరంసంగతే తెలియనట్లు నటించాలి. బావ ఏం చెప్పినా నువ్వు మామూలుగా నే మాట్లాడు. మచ్చుకేనా నీ ముఖంలో విచారచిహ్నం అవుపించకూడదు. రోజూకంటె సంతోషంగాను, చలాకీగాను వుండాలి జాగ్రత్త!"

★ అడ్డాకుల్లో విడాకులు ★

అంటూ శంకరం క్రిందకి వెళ్ళాడు తలుపు తియ్యడానికి. రాజ్యం వచ్చే వాళ్ళెవరా అని మేడమెట్లవేపు కళ్ళప్పగించి చూస్తూ దిగులుగా కూచుంది.

గబగబా రామం మేడమీదికే వచ్చాడు. కొరం రోజులనుండి అతనిలో చాలా మార్పు కనపడుతూంది. రాజ్యంతో అస్తమానం తగువులాడ్డం, చిరాకుపడడం మానీసేడు. ఇంట్లో ఉన్న కొద్దికాలం ఆమెతో శాంతం మూర్తీభవించినట్లు కాలం గడుపుతున్నాడు. కాని మనసులో లావా మరుగుతూనే వుంది. కాలకూటవిషాన్ని షరబత్తులాగ త్రాగించే విధానం ఎలాగా అని ఆలోచిస్తూ తియ్యని మాటల్తో ఆమెవల్లనే అంగీకారాన్ని పొందాలని, ఆమె నెలాగైనా ఒప్పించి తప్పించుకుందామనీ అతని ఆలోచన.

టేబిలుమీద సిగరెట్టు టిన్నులో ఓ సిగరెట్టు తీసి వెలిగిస్తూ "ఏం రాజ్యం అలా వున్నావు?" అన్నాడు.

"అబ్బే! ఏం లేదు. ఎలా వున్నాను? బడి విడిచిపెట్టినా పిల్లలింకా రాలేదేమా అని ఆలోచిస్తున్నాను. ఇంతలో మీరొచ్చేరు! వాళ్ళే అనుకున్నాను. ఇవాళింత వేగం యిల్లు జ్ఞాపకం వచ్చిందేమిటి కథ?"

"కథే మరి. నీతో వో ముఖ్య విషయం మాట్లాడ దల్చుకున్నాను. చాలా శాంతంగా వినాలి. పరిస్థితులన్నీ ఒక్కమారుగా తారుమారైతే ఆ పరిణామాన్ని నువ్వు భరించలేవని సంగతంతా నెమ్మదిగా బోధపరుద్దామనుకుంటున్నాను. నువ్వనవసరంగా ఉక్కిరి బిక్కిరై భయపడకూ?..."

"అక్కా నీ కొచ్చిన భయం బావకేం లేదు లేవే" అన్నాడు పాపాయి నెత్తుకుని షికారు చేస్తున్న శంకరం.

"అబ్బ! వుండవోయ్. ఇది వెటకారాలకి సమయం కాదు. చాలా సీరియస్‌గా వినాలి. పోనీ ఆ భయంతాలూకు గాలి నీకు తగుల్తుందిలే."

"నువ్వు వుక్కిపోయి నీళ్లు (చెమట) కారిపోతూవుంటే మేం చూస్తూ వూరుకొంటామా? ఆ గాలి నీకు మాత్రం తగలదూ? ఏదో సరదాగా వున్నా రనుకొని వచ్చేనంతే. మీరూ మీరూ మాట్లాడుకొంటూవుంటే మధ్య నేనెందుకు?" అని రాజ్యంవేపు 'నే వెళ్ళిపోతున్నాను, నువ్వు మట్టుకు చాలా జాగ్రత్తగా వుండాలిసుమా' అన్నట్టు చూసి క్రిందకి వెళ్ళిపోతాడు.

"మనం యిన్నాళ్ళబట్టి కాపరం చేస్తున్నాం కాని ఒకరి నొకరం అర్థం చేసుకోలేకపోయేము. ఆ వెలితి మన ముందు జీవితానికి అవరోధంగానే పరిణమిస్తూ వుంది. ఇలా ఎడముఖాల్తోటి పెడబొబ్బల్తోటి ఎన్నాళ్ళీదురీదగలం యీ సంసారాన్ని? అలా చెయ్యడం నిన్ను బాధపెట్టడం, నా అంతరాత్మని చంపుకోవడం! కాబట్టి నేనో నిశ్చయాని కొచ్చేను. నీకూ ఆట్టే బాధవుండదు, నా ప్రాణానికీ హాయిగా వుంటుంది, నే నిప్పుడు చెయ్యబోయే ఏర్పాటువల్ల. నెలనెలా నీకు కొంత డబ్బు కేటాయించబడుతూ వుంటుంది. నీ యిష్టమొచ్చినట్టూ నీ కర్చులు నువ్వు పెట్టుకుంటూ వుండవచ్చును. ఒకళ్ళ అడ్డేమీ వుండదు. బాగా ఆలోచించుకో!" అని రాజ్యం ముఖం పరిశీలనగా చూశాడు రామం.

బిలబిలా పరిగెట్టుకొంటూ శశీ అమ్మాజీ లోనికి వచ్చారు. తండ్రిని చూచి అమ్మాజీ కాస్త తగ్గి అమ్మఒళ్లో దాక్కుంది. శశి మట్టుకు తండ్రిదగ్గర కూచుంటూ "నాన్నా యివాళేం, మా బళ్లో మాంచి గారడీ చూసేం నాన్నా! వాడేం...వాడి బుగ్గమీసాలు, తట్టతలపాగా చూట్టానికి భయంగానే వున్నాడు కాని, మా బాగాచేసేడు నాన్నా. మరేం రెండుకోళ్ల బుట్టల్ని మా అందరికీ చూపించి వేరే వేరే పెట్టేడు. అందులో ఒకదాంట్లో ఓ పుంజుని, పెట్టని, నాల్గు పిల్లల్ని పెట్టేడు. కాని రెండో బుట్ట కాళీగానే వుంది. అదేదో చిన్న కర్రలా వుంది నాన్నా! దాంతో రెండు బుట్టల మీదా మూడుసార్లు కొట్టి రెండుబుట్టలూ పైకెత్తేడూ.. ఏముంది? ఆశ్చర్యం! ఎలా ఒచ్చేయో కాని ఆ బుట్టలోని పుంజూ రెండు పిల్లలూ రెండో బుట్టలోకి ఒచ్చేయి! మొదటి బుట్టలో పెట్ట రెండు పిల్లలూ మాత్రమే వున్నాయి. దాన్లోవి దీన్లో కెలా ఒచ్చేయి నాన్నా?" అంది.

"అదంతా గారడీవాడి మాయమ్మా! మీరు క్రిందికివెళ్లి మామయ్యను కథలు చెప్పమనండి" అంటూ రాజ్యం పిల్లల్ని క్రిందికి పంపింది.

"అంతా ఆడపిల్లలే కదా, ఒక్కడేనా మొగపిల్లవాడుంటే.." అన్నాడు రామం, అందుకు కారణం అంతా ఆమే అయినట్టు చూస్తూ.

"అవును దానికీ తప్పంతా నాదే!..."

"అని వేరేచెప్పాలా? మరో పెళ్లి చేసుకొనే నా యింటికి వంశాంకురాన్ని పొందాలి."

"అదేమిటండీ అలా మాట్లాడతారు? భగవంతు డిచ్చినదానికి మనమేం చేస్తాం? లోకంలో ఎక్కడయినా భార్యకి పిల్లలు కలగక ఆమె గొడ్రాలైతే, పిల్లలకోసం మళ్లీ పెళ్లిచేసుకుంటా రెవరైనా.. అది అందం చందం. నలుగురూ హర్షించే విషయం. కాని మొగపిల్లలకోసం నిక్షేపం లాంటి సంసారాన్ని ఒదిలి మళ్లీ పెళ్లి చేసుకోబోవడం మీదే మొదటికేసులా వుంది. ఆ వొచ్చే ఆమెకూడా ఆడపిల్లల్నే కంటే?"

"నీవన్నీ లాపాయింట్లు, అవును మరి! లాయర్లింట పెరిగేవాయను, నీ తప్పేముంది! అసలు మానవతత్వ శాస్త్రజ్ఞులంతా ఏమన్నారంటే - వంశంలో తండ్రి తాతలు ఎక్కువగా ఏ సంతానాన్ని కంటే వారి పిల్లల సంతతి కూడా ఆ మాదిరిగానే వుంటుంది. తలిదండ్రుల వంశాల్లో ఏ వొక్కరి లేక యిద్దరి సాంప్రదాయమేనా అలవడవచ్చు అన్నారు. మా నాన్నకి మేమంతా మొగాళ్ళమే! మా తాతగారి సంతతిలో హెచ్చుభాగం మొగసంతతే! ఎటొచ్చీ నీ తాలూకే అంతా ఆడసంతు! మనకి నీవాళ్ళ ఛాయలే అబ్బేయి కనక యిక నీకు మొగపిల్లల్ని కనే యోగ్యత సున్నా!!"...

"కాబట్టి ఇప్పుడు నీకు విడాకులిచ్చి, ఎవళ్ళ వంశంలో అయితే అంతా మొగ సంతతి వుంటుందో ఆ చపలాక్షిని చేపట్టవచ్చు బావ! అంతే కాకుండా ఆ మనువ చోరవంశసంజాత కూడా అయి వుండాలి. లేకపోతే ఆమెగారి మొగసంతానాన్నంతనీ పోషించడానికి బావగారి జీతం చాలవద్దూ?" అన్నాడు ఏదో పనుండి గదిలోకి వచ్చినట్టు నటిస్తూ శంకరం.

"బాగుంది వరస" తీక్షణంగా చూస్తూ అన్నాడు రామం.

"బాగుండదూ మరి దినానికో పరసైతే."

"పరసలకీ, జాతర్లకీ యిదేం దేవాలయం, అమ్మవారి గుడీ అనుకున్నావా? యద్భావం తద్భవతి పోనీ అలాగే అనుకో. మీ మనసుల్లో ఎలావుంటే కార్యాలూ అలాగే జరుగుతాయి! ఎవరి కర్మ కెవరు కర్తలు?"

"అంతేలే! ... ఎవరి కర్మ కెవరు కర్తలూ? నువ్వుమాత్రం భావిభారత పురుష సంతతికి ఏకైక కర్తవి! ఏమిటో బావా ముగ్గురు బిడ్డల తండ్రివైనా కూడా నీ పిచ్చి వూహలూ నువ్వూను"...

"ఇదిగో శంకరం నువ్వనవసరంగా నోరు జారుతున్నావు. పిచ్చి వూహలూ, పిచ్చి వాగుడూ నీదో నాదో కోర్టులో తెల్సుకుం

దువుగాని, అందాకా ఓపికపట్టు. అనవసరపు విషయాల్లో జోక్యం చేసుకోవద్దని చెప్పడం యిది మొదటిసారి కాదని తెలుసుకో."

"ఊరుకోరా బాబూ అనవసరంగా ఆయనచేత అంతలేసి మాటలు ఎందుకు పడతావు. నువ్వీవూరు వుద్యోగప్రయత్నం మీద వొచ్చేవు. నీపని నువ్వు చూచుకోరా."

"అబ్బ! వుండవే, వో మూల కొంపలంటుకుంటూ వుంటేను! ఇష్టం లేకపోతే మొదట తెలీదు? తగుదునమ్మా అని ఎందుకు చేసుకోవాలి. నిండు జీవితాన్ని మొదలంటా నాశనం చెయ్యడానికి తనకేం హక్కుందని?" అని నిలదీశాడు బావగార్ని.

"మనిషికో మాట - ఎద్దుకో దెబ్బ. సిగ్గులేకపోయిన తరువాత ఎన్నని ఏం ప్రయోజనం" అంటూ విసవిస వెళ్లిపోయేడు రామం భోజనమైనా చెయ్యకుండా.

* * *

శంకరం ఎన్నివిధాలో నచ్చచెప్పేడు ప్లీడర్ని పెట్టి వాదిద్దామని. బావని మూడు చెరువుల నీళ్లు తాగిద్దామన్నాడు. "మన బాబాయి, పెదనాన్నా కూడా పేరొందిన ప్లీడర్లు మనకేం భయం లేదు, కాకిచేత కబురుచేస్తే వచ్చి వాల్తా"రన్నాడు. "కోర్టుల్లో మనం గెలిస్తేమట్టుకు?...యీ కోర్టులూ శాసనాలూ మనుష్యుల్ని శాసిస్తాయి కాని మనసుల్ని శాసించగలవా? ఎవరి చట్టాలు వారు నిర్మించుకొని, ఎవరి ప్రవర్తనని వారే విచారించుకొని, చక్కబరుచుకొని న్యాయబద్ధులవాలి" అంది రాజ్యం. అంతే కాకుండా కోర్టులో "వారు చెప్పినదేదీ నేను కాదనను. వారి వాదమంతా నిజమే కావచ్చు. వారికి ఎంత కష్టము కలుగకపోతే యిలాంటి పనికి ఎందుకు సిద్ధపడతారు? వారి మనస్సు యింతగా నొప్పికలిగి వికలమైనతరువాత వారిని చట్టబద్ధుల్ని చేస్తేమాత్రం సంసారంలో సామరస్యం సమకూడుతుందా? కాబట్టి కోర్టువారి తీర్పు ఏ తీరుగా వున్నా నాకు సమ్మతమే!" అని చెప్పి కూర్చుంది.

కాని రామం ముఖాన కత్తివేటుకేనా నెత్తురుచుక్క లేదు. తను కల్లో కూడా యీ సమస్య యింత సునాయాసంగా పరిష్కారమవుతుందనుకోలేదు. రాజ్యం తన బాబాయినో, పెత్తండ్రినో అండగా తెచ్చుకొని తనని ముప్పుతిప్పలూ పెట్టకుండా వదుల్తుందనుకోలేదు. కాని ఆమె నిండు కోర్టులో తన హృదయ వైశాల్యం యింత సౌమ్యంగా ప్రదర్శించేసరికి, తనే యీ పారాత్పరిణామానికి భరించలేక ఉక్కిరి బిక్కిరయ్యేడు! తనెప్పుడైనా ఆమె విశాలభావాల్ని కాని, ఓర్పును కాని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించేడా అని ఆత్మవిమర్శ చేసుకున్నాడు. తన కానాడు ఆమె సామాన్యురాలుగా అవుపించలేదు. ఆమె ముఖంలో ప్రకటితమవుతూన్న అసాధారణ సహన శీలాన్ని చేష్టలు దక్కి చూస్తూ కూర్చుండిపోయేడు. కోర్టు వాతావరణమే జ్ఞాపకంలే దతనికి. ఏదో అజ్ఞాతలోకాల్లో విహరిస్తూన్నట్టుంది. భర్త తనవేపే రెప్పవాల్చకుండా అంతమందిలోను తదేకదీక్షగా చూడ్డం గమనించి రాజ్యం తల వంచుకుని కొత్త పెళ్లికూతురులాగ ముడుచుకుపోయింది.

ఇంతలో న్యాయమూర్తి సుత్తి చప్పుడైంది. రామం గజగజలాడేడు కుర్చీలో, తీర్పెలా వుంటుందోనని. బిడ్డల పోషణ కూడా సక్రమంగా జరుగలేదని ఆరోపించబడడంవల్ల ఆ పోషణభారాన్ని తండ్రే వహించవలసినదిగానున్నూ, యికమీద భార్యాపోషణార్థం ఆమె ఎక్కడవున్నా సరే తన సంపాదనలో మూడవభాగం పంపవలసినదనిన్నీ తీర్పు చెప్పబడింది. రామానికిది గోరుచుట్టుపై రోకటిపోటులాగ తగిలింది.

"అయ్యో! పిల్లల్ని వదిలి ఎలావుండను" అంటూ లేవబోయింది రాజ్యం. కాని ప్రక్కనున్న శంకరం వారిస్తూ "అంతా మనమంచికే! నువ్వూరుకో" అంటూ కూర్చోపెట్టేడు. తీర్పయిపోయింది. ఎవరిళ్లకు వాళ్లు పోతున్నారు.

అక్కచేతుల్లో వున్న పాపను తీసుకొని రామాని కందించేడు శంకరం. కల్లకపటం తెలియని పసిపాప బోసినోటితో నవ్వులు విరజిమ్ముతో తండ్రిచేతుల్లో కెళ్లింది. రాజ్యం ఉన్నట్టుండి ఒక్కసారిగా కొయ్యబారిపోయింది. అంతా చుట్టూ మూగేరు. రామంకూడా హడావుడిగా అక్కడ చేరేడు. కాని ఆమె ముఖంలోకి చూసేందుకతనికి ముఖం చెల్లలేదు. తల్లి అలా పడిపోవడం చూచి క్యారుమంటూ పాప తండ్రి ఒడిలోనుంచి క్రిందికి దిగి ఆమె దగ్గరికి పాకుతూ పోయింది. రాజ్యం తేరుకుని పాపని గాఢంగా హృదయానికి హత్తుకుంటూ చుట్టూ అంతమంది మూగివుండడం చూచి సిగ్గుపడుతూ శంకరాన్ని ఆనుకొని అతనితోకూడా బయటికి నడిచిపోయింది. రామం పాపని తిరిగి అడగాలేదు. రాజ్యం యివ్వనూలేదు. కాని శంకరం యింటి తాళాలు మాత్రం బావగారికి అందిచ్చి తాను అక్కగారితో కూడా వేరే బండి ఎక్కి వెళ్లిపోయేడు. బండి అవుపడ్డంత సేపూ తెల్లబోయి చూస్తూ నడిరోడ్డుమీద నిలబడిపోయేడు రామం!

* * *

బావగారితో సంఘర్షణ జరిగిననాటి నుండీ శంకరం వేరేగది తీసుకొని అందులో వుంటున్నాడు. నేడు అక్కగారితో కూడా అందులోనే ప్రవేశించి "అక్కా నేను బ్రతికున్నంతకాలం నీకేలోటూ రానివ్వను! యిక నా అధమాధముడిమాట కలలో కూడా తలచకుండా హాయిగా వుండు" అంటూ కావలసిన సామగ్రి తేవడంకోసం బయిలుదేరేడు. "అబ్బ! అంతమాటనకురా" అంటూ గోడకు జేరగిలబడింది రాజ్యం.

కోర్టునుంచి సరాసరి హొటలు కెళ్లి ఓ కప్పు కాఫీ సేవించి మింటిలో గాలిపడగలాగా ఎగురుతూన్న ఆలోచనల్ని కూడగట్టుకుంటూయింటికివచ్చి అలనాటుచొప్పున "రాజ్యం తలుపుతియ్యి" అంటూ తలుపు కొట్టేడు. చటుక్కున అతనికి పెళ్లినాటి సంఘటన జ్ఞాపకానికొచ్చింది - మరదళ్లూ, వదినగార్లూ, యితర ముత్తయిదువులూ సమి

★ అడ్డాకుల్లో విడాకులు ★

గూడి తలుపుదగ్గర పేరు చెప్పమంటూ తనని పెట్టిన అల్లరి తంతూను. మనసంతా వికలమైపోయింది. తాళంతీసి యింటిలో ప్రవేశించేడు ఒక్కడూ. బట్టలేనా తియ్యకుండా కుర్చీలో జేరగిలబడ్డాడు.

శశి, అమ్మాజీ స్కూలునించివచ్చి, పలకలూ పుస్తకాలూ టేబిలుమీద పడేసి తండ్రివేపు చూస్తూ నిలబడ్డారు. ఆ యింట్లో అలాంటి నిశ్శబ్ద వాతావరణం చవిచూడ్డం వాళ్ళకి యిదే మొదటసారి. పాపాయి ఏడుపు కాని, వంటింట్లోంచి కమ్మని కాఫీ వాసనలు కాని లేవు. బిక్కుబిక్కుమంటూ తండ్రి దగ్గరకు పోయి "అమ్మేది నాన్నా?" అన్నారు యిద్దరూ ఒక్కసారిగా. ఇద్దర్నీ దగ్గరా పొదివిపట్టుకున్నాడు. గొంతుకలోంచి మాటలు పైకి రాలేదు. ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో తెలియలేదు. పసిపిల్లల్ని కూడా యిలా వుసురుపెట్టి తనేం బావుకోబోతున్నాడో తెలియడంలేదతనికి.

రోజులు దొర్లిపోతున్నాయి. పిల్లల్ని చూచేందుకు, హోటలునుండి భోజనం తెచ్చేందుకు పనివాడి నొకడిని కుదిర్చేడు. మనస్సిమీ బాగుండకపోవడంవల్ల ఆఫీసుకు ఓ నెల సెలవు పెట్టేడు. పనేం లేకపోవడం మూలంగా బుర్ర మరీ వేడెక్కిపోవడం మొదలయింది. సెలవు కేన్సిలు చేసుకొని మళ్ళీ పనిలో ప్రవేశించేడు. హోటలు భోజనం సహించకుండావుంది. పిల్లలు సరిగ్గా తిండి తినడం మానుకున్నారు. తనూ పిల్లలూ కూడా ఓరోజు కోరోజు నీరసించిపోతున్నారు. ఓనాడు సాంబారులో రెండు బొద్దింకపిల్లల కళేబరాలు కనపడ్డాయి. అంతకుముందు తిన్నదంతా కూడా వాంతియింది. హోటలువాణ్ణడుగుతే "అదేమప్పా! యిందవూరు శానిటరీ యినస్పెక్టరు, హెల్తాఫీసరు యీవదానే కూడు కుడిచిపోతుస్తురు! అవి మీ వీడులోదానె యిరకణం. అవశ్రదా" అన్నాడు. రాజ్యం వంటతో తన నోట్లో మొక్కలు మొలుస్తున్నాయనుకున్నాడు. కాని యీ అయ్యరు భోజనంతో మహావృక్షాలే లేచేట్టున్నాయి!

అమ్మాజీ తల్లికోసం బెంగపెట్టుకున్నది కాబోలు నాలుగురోజులనుండి జ్వరం తగులుతూంది. శశికి తనవద్ద చనువు జాస్తీగా వుండడంవల్ల పరిస్థితి ఏమంత విషమించలేదు. కాని అప్పుడప్పుడూ తల్లినిగురించి చిత్రవిచిత్రమైన ప్రశ్నలు వేస్తూవుంటుంది.

ఆదివారం రాముం కుర్చీలో నడుంవాల్చి పేపరు చదువుదామని తీసేడు. మంచంమీద అమ్మాజీ "అమ్మెప్పుడొస్తుంది నాన్నా? అమ్మని మనింటికి రావొద్దన్నారా?" అంటూ అడుగుతూంది. పేపర్లో పంక్తులు క్రిందు క్రిందుకు ఎక్కువ వేగంగా పరిగెడుతున్నాయి. పేపరక్కడ పడేసి అమ్మాజీ ఒళ్ళు మాసేడు. సలసలా మరిగిపోతూంది. నుదుటిమీద తడిగుడ్డ మార్చి అలాగే మంచం మీద వాలిపోయేడు దిగులుగా.

ఇలాంటి అమాయకులైన పసిపాపల్ని కూడా హింసించడానికి తనకే మధికారం వుంది? సుఖం! సుఖం!! సుఖం అంటే ఏమిటి?? తానింతకుముందు రాజ్యంతో పొందలేని దేమిటి? ఇప్పుడు ధనవంతురాలైన భార్యని తెచ్చి ఆమెద్వారా పొందబోయే దేమిటి? ఆనంద మనేది డబ్బుతో కొనే వస్తువా? మనకున్న పరిధుల్లో మానసికంగా సమకూర్చుకోవాలి గాని, అందని వాటికోసం ఆరాటపడుతూ, వున్నదాన్ని పోగొట్టుకొంటే?... ..ఉభయభ్రష్టత్వం ఉపరి సన్యాసం. ధనవంతురాలైన ఇల్లాల్ని తెస్తే ..ఆమె తను చెప్పినట్టు వింటుందా? ఆమె డబ్బుకి తను దాసుడవాలి! తప్పదు. ఆమె భోగవిలాసాలకు తనతో ఆటబొమ్మగా చూడవచ్చు. ఇన్నాళ్ళూ నిరంకుశత్వాన్ని అమలుజరిపి అందుకు అలవాటుపడ్డ తను తన భావాలకి వ్యతిరేకంగా వున్న ఆమె వాంఛల్ని నిర్లక్ష్యంచేస్తే... అప్పుడు ఆమె తనని కోర్టుకీడ్చి విడాకులిస్తే!!...

రాముం కంపించిపోయేడు. అవమానంతో ముఖం కందగడ్డలాగ జేవురించింది. పాతాళానికి కృంగిపోయేడు. తల ఎత్తలేకపోయేడు.

"బాబూ, హోటలు తలుపు మూసి వుంది. అయ్యరుబాబు ఏడకో లేచిపోయేడంట" అంటూ ఖాళీ క్యారేజీ పట్టుకు ద్వారందగ్గర నిలబడ్డాడు పనికుర్రాడు.

"హా! అయ్యరుబాబు! దొంగవెధవ...

నిన్ననే ఏభై రూపాయిలూ పెట్టి టిక్కెట్లు బుక్కు కొన్నది...సర్లే. ఇవన్నీ బాగున్నాయా; అది బాగులేదా? యీ డబ్బు పెట్టి మరో హోటల్లో భోజనం పట్రా. ఒచ్చేటప్పుడు డాక్టరుగార్ని కూడా పిల్చుకురా. మర్చిపోకేం?" అంటూ సుబ్రాణ్ణి పంపి తనో సిగరెట్టు వెలిగించేడు.

పనిమనిషి సన్యాసమ్మ యిల్లు వూడుస్తూ "అయ్యగోరూ, యియ్యాల శంకరంబాబు ఆపడ్డారు బజాట్లో" అంది.

"ఏమిటి విశేషాలు" అన్నట్టు చూసేడు, తనేమీ మాట్లాడకుండా రామం.

"అమ్మగోరూ, చినబుల్లెమ్మ కులాసా? అన్నాను. బుల్లెమ్మగోరు బాగున్నారంట కాని అమ్మగోరు మాత్రం ఓగోజు కోరోజు సిక్కి సగమైపోతన్నారంట. తిండి సరిగా తిన్రంట. ఎప్పుడూ దిగులుగా కూకుంటారంట" అని రామం ముఖం చూసింది. కళ్ళల్లోబడి నీళ్లు చిందుతున్నాయి. ముఖం పక్కకి తిప్పుకొని తువ్వాలుతో తుడుచుకున్నాడు.

"బాబూ తెలకడుగుతాను... మొగుడూ-పెళ్లాం - ఆ ళ్లిద్దరికీ కాపోతే యింకెవ్వోత్తాయి తగాదాలు? మా మొగాడున్నాడే! ఆడి చేతులడ! కేత్తుర్లు తప్పతాగి వొళ్లంతా హూనంచేత్తాడు మా రాజా...అడే పెందల కాడ నెగిసి 'ఎర్రిసన్నాసి! ఎంతలేసి దెబ్బలేసేనే సచ్చినోణ్ణి!' అంటా ఒళ్లంతా నిమురుతాడు." అని పమిటచాటులో చిరునవ్వు లొలకబోసుకుంది...

"రోజూ యిదే ఓలకం! అమాత్రం దానికే మేం పేరింటికాపురం పెట్టేమా బాబూ? ఆడిజిమ్మడా! మీలాగ ఒదల్నేనా ఒదల్డు" అంది.

రామం మనసు కలుక్కుమన్నాది. దెబ్బ నసాళానికంటిపోయింది. కాని తమాయించుకొని పాలిపోతూన్న ముఖానికి తేలిపోతూన్న చిరునవ్వు అడ్డుపెట్టుకొన్నాడు.

మంచంమీద అమ్మాజీ "అమ్మా...అమ్మ కావాలి నాన్నా." అంటూ ఒరువుగా మూలుగుతూంది. ఏదో నిశ్చయాని కొచ్చినవాడిలాగా లేచి శశిని అమ్మాజీదగ్గర వుండమని చెప్పి బయలుదేరాడు. వీథుల్లో మెర్క్యూరీ దీపాలు తన జీవితపు బాటల్లోకి వెలుగులు వెదజల్లుతూన్నట్టున్నాయి.

* * *

కొన్నాళ్ళ తరువాత...

"శశీ! పాపాయి గౌను విప్పెయ్యమ్మా. యిప్పటికే అరడజను గౌన్లు మైలెట్టింది" అంటూంది రాజ్యం పాకతూ వస్తున్న పాపాయిని ముట్టుకోవద్దని వారిస్తూ. లోపలినుంచి గబగబా రామం వచ్చి,

"ఇదుగో! నీకు విడాకు లిస్తా..."

"అయ్యో! మళ్ళీనా? 'నేనేం పాపం చేసేనండీ యిలా బాధలు పెట్టడానికి? మొగాళ్ళ మనసులు క్షణక్షణానికీ మారిపోతూ వుంటాయి అదేం ఖర్మమో...ఎంత చేతులు కాల్చుకున్నా యీ మూడురోజులే కదండీ" అంటూ మొదలెట్టింది.

"అయితే అక్కా క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్ అనేదానికి బదులు క్షణక్షణముల్ మొగవాండ్ర చిత్తముల్ అని మార్చాలంటావు" అన్నాడు శంకరం గదిలోంచి.

"తన్నుకు చస్తూవుంటే రెండో పెళ్లట. ఏమిట్రా నీ కాకిగోల? వేళాకోళానికి హద్దూ పద్దూ లేకుండావుంది. వాని తరువ అక్కరలేదట్రా ఓమూల కొంపలంటుకుంటుంటే? మీబావ మళ్ళీ విడాకు లిస్తారట..."

"ఆఁ! యీమాటు నీ కొక్కర్తికే కాదు. మీ యిద్దరికీ కలిపే యిస్తాను! నెత్తి మొహమూ, ఏమిటా గయ్యాళితనం, చెప్పేది సాంతం వినకుండాను. నాకు విస్తర్లు కుట్టడం రాదు కాబట్టి నీకు విడాకులు-అంటే విడి - అడ్డాకులు యిస్తానూ..నువ్వు విస్తరి కుట్టుకొంటే అన్నం వడ్డించి ఆఫీసుకి పోతానూ...అంటున్నాను" అన్నాడు రామం.

"ఇవి అడ్డాకుల్లో విడాకులా!" అన్నాడు శంకరం పాప నెత్తుకుని రామాని కందిస్తూ.

★

బొమ్మరిల్లు

★ జనవరి ఒకటి ★


పి. సూర్యారావు

బంతిపూలు చామంతిపూవులూ
బంతులు తీర్చి రమ్మని పిలువగ,
చల్లనిగాలుల అలలతాకిడీ
చక్కిలిగింతలు పెట్టుచుండగా
జనవరి 'ఒకటీ' వచ్చింది,
జాగృతి గీతంపాడింది.

ముద్దుగొల్పు సంక్రాంతిముగ్గులతో
ముచ్చట గొల్పెడి పూల రేకులతో
సరసాలాడే గొబ్బెమ్మలు సు
స్వాగతమిచ్చి ఆహ్వానింపగ
జనవరి 'ఒకటీ' వచ్చింది,
జాగృతి గీతంపాడింది.

జరిగిపోయినా వత్సరమందున
చేసిన తప్పులు సరిచేసుకొనీ
సౌఖ్యవంతముగ జీవితమంతా
సంతోషంగా గడుపు కొండనుచు
జనవరి 'ఒకటీ' వచ్చింది,
జాగృతి గీతంపాడింది.

సత్యం,ధర్మం, న్యాయంకోసం,
సర్వమానవ క్షేమంకోసం,
పాటుపడుటకూ వీరుల్లాగా
ప్రతిజ్ఞపూనుచు బయలు దేరుదని
జనవరి 'ఒకటీ' వచ్చింది,
జాగృతి గీతంపాడింది.



బొమ్మరిల్లు సీరియల్



టామ్‌సాయర్ ప్రపంచ యాత్ర

మూలం మార్క్‌ట్వేన్

ఈ సీరియల్ టామ్‌సాయర్, హకల్ బెరీఫిన్ నవలకు తరువాత జరిగిన కథను తెలుపుతుంది. "హకల్ బెరీఫిన్" నవలలో మాదిరిగానే నవలలో కూడా హకల్ బెరీఫిన్ అనే కుర్రవాడే కథ చెబుతాడు. ఈ నవలలో టామ్‌సాయర్ అనే మరో కుర్రవాడూ, హకల్ బెరీఫిన్, వీళ్ళ స్నేహితుడైన జిమ్‌అనే నీగ్రో ముఖ్యపాత్రలు. టామ్‌సాయర్‌కు ఎప్పుడూ ఏదో సాహసం చేస్తూనే వుండాలనీ, తన పేరు దేశదేశాల్లో మోగిపోతూ వుండాలనీ కోరిక. అంచేత ఇదివరకు చేసిన సాహసాలతో తృప్తిపడక, కొత్తవాటికోసం చాలా ప్లాను వేస్తాడు కాని మిగతా వాళ్ళిద్దరూ అతని ప్లాన్లు అన్నిటినీ తోసివేస్తారు. ఏంచేయడానికీ పాలుపోకుండా వున్న సమయంలో, ఒక ప్రొఫెసరు బెలూన్‌లో యూరప్ ఖండానికి బయలుదేరనున్నట్లు వాళ్ళకి తెలుస్తుంది. అది చూసివద్దామని వెళ్ళిన టామ్, హక్, జిమ్ ముగ్గుర్నీ ప్రొఫెసరు లోపలికి రానిచ్చి హఠాత్తుగా బెలూన్‌ను బయలుదేర దీస్తాడు. యూరప్ ప్రయాణమై పోతున్న విమానంలో ముగ్గురు మిత్రులు నిర్ఘాంతపోయి కూర్చున్నారు మార్గమధ్యంలో ప్రొఫెసరు తెగ తాగి సముద్రంలో పడి మరణిస్తాడు. బెలూన్ నడపడం టామ్ నేర్చుకున్నందున ప్రయాణం క్షేమంగానే సాగింది.

5

ఇకముందు ఏమి చేయడమూ అని చాలసేపు ఆలోచించాము. కాని మాలో మాకు ఏకీభావం కుదరలేదు. వెనక్కి తిరిగి, యింటికి పోవడమే ఉత్తమమని నేను, జిమ్ వాదించాము. కాని టామ్ దీని కంగీకరించలేదు. తెల్లవారినతరువాత, దారి చక్కగా తెలుస్తుందనీ, అప్పటికి మా విమానం ఇంగ్లండు దరిదాపుల్లోకి వచ్చివుంటుంది కనుక, ఆ కాస్తా ప్రయాణం చేసి, ఇంగ్లండులో దిగి, తిరిగి వచ్చేటప్పుడు ఓడలో రావచ్చుననీ చెప్పాడు. అలా చేస్తే ఇంగ్లండు వెళ్ళి వచ్చిన ఘనత మాకు ఆచంద్రతారార్కంగా నిలిచి పోతుందని అన్నాడు.

నడిరాత్రికల్లా తుఫాను ఆగిపోయింది. మబ్బుల నుండి చంద్రుడు విడివడి సముద్రంమీద వెన్నెల ప్రసరింపజేశాడు. మాకు నిద్ర ముంచుకువస్తోంది. అందుచేత వొళ్ళెరుగకుండా పడి నిద్రపోయాము. లేచేటప్ప

టికి బారెడు పొద్దెక్కింది. సముద్రం రత్నాలరాశిలాగ మెరుస్తోంది. గాలి హాయిగా వీస్తోంది. కొద్ది సేపట్లో మా వస్తువులన్నీ తడి ఆరి మామూలుగా అయినాయి.

తినడాని కేదైనా దొరుకుతుందేమోనని ప్రొఫెసరు స్థలంలో వెదకటానికి వెళ్లాము. అటు వెళ్లగానే ముందు మాకు కనిపించింది ఒక దిక్సూచి, దాని లోపల వెలుగుతున్న ఒక దీపమూ! అది చూడగానే టామ్ కళవళపడ్డాడు.

"అదేమిటో తెలుసా, హక్! రాత్రిళ్లు ఎవరో ఒకరు ఈ దిక్సూచివద్ద కూర్చుని కాపలా కాయాలన్నమాట. విమానం ఎటుపడితే అటు పోకుండా మనకి కావలసిన దిక్కుకే పోయేటట్లుగా తిప్పుతూ వుండాలన్నమాట. ఎవరూ దగ్గరలేకపోతే, గాలి ఎటు వీస్తే అటుపోతుంది," అన్నాడు.

"అయితే ఇప్పుడేమైందంటావు?" అని అడిగాను.

"ఏమౌతుంది? దా నిష్టం వచ్చినట్టు అది పోతోంది," అన్నాడు టామ్ ఆందోళనతో.

"ఆగ్నేయదిశగా వీస్తోంది గాలి. అందుచేత మన విమానం కూడా ఆ దిక్కుగానే పోతూ వుండి వుంటుంది. ఎంతసేపటినుండీ అలా పోతోందో తెలియదు," అని విమానాన్ని తూర్పు దిక్కుకి మళ్ళించాడు. ఆ తరవాత ప్రాతఃకాల భోజనం ఏర్పాట్లలో నిమగ్నులమయ్యాము. ప్రొఫెసరు మనిషికి ఏవేవి అవసర మవుతాయని తోస్తే అవన్నీ విమానంలో చేర్చి వుంచాడు. కాఫీలోకి పాలొకటి లేవుగాని, మిగతావన్నీ ఉన్నాయి. కావలసినన్ని నీళ్లు, బొగ్గులు, కుంపటి, పొగపైపులు, చుట్టలు, అగ్గిపెట్టెలు, ద్రాక్షసారాయము (మాకు పనికిరాదనుకోండి), పుస్తకాలు, భూగోళపటాలు, దేశాల మధ్య మార్గాల పటాలు, ఒక సంగీత వాద్యం, ఉన్నిదుప్పట్లు, కోట్లు ఇంకా ఏమేమిటో నానా చెత్తాచెదారం ఎన్నో వున్నాయి. గాజుపూసలు, ఇత్తడి నగలు కూడా కనిపించాయి. వాటిని చూసి ప్రొఫెసరు ఆటవికజాతుల వారి ప్రాంతాలకు వెళ్ళాలనికూడా ఆలోచించివుంటాడని టామ్ అన్నాడు. ఇవన్నీ కాక కొంతడబ్బుకూడా వుంది. ప్రొఫెసరు ఎంతజాగ్రత్తపరుడో అనుకున్నాము.

భోజనాలైనతరువాత, విమానాన్ని నడిపే పద్ధతి నాకూ, జిమ్‌కూ నేర్పాడు టామ్. నాలుగేసి గంటలకొకసారి వంతులుమారి, ఒక్కొక్కరం విమానాన్ని నడిపేందుకు టైమ్‌టేబిలు ఏర్పాటుచేశాడు. టామ్ వంతు అయిపోగానే నేనుఛార్జి పుచ్చుకున్నాను. టామ్ లేచి, ప్రొఫెసరు ఉపయోగించే కాగితాలు, కలం తీసుకుని ఇంటికి ఉత్తరం రాశాడు. పోలీపెద్దమ్మ చిరునామా ఉత్తరంమీద రాశాడు. "అంతరిక్షంలో— ఇంగ్లండును సమీపిస్తూ" అని మా చిరునామా రాశాడు. "టామ్‌సాయర్— వైమానికుడు" అని సంతకంచేశాడు. ఆ ఉత్తరాన్ని మడిచి గాలిలో వదిలేశాడు. ఉత్తరం చూడగానే పోస్టుమాస్టరు నాట్ పార్సన్స్ తన సంతకంచూసి గుండెలు బాదుకుని లబ్బున గోలపెడతాడని టామ్ సగర్వంగా అన్నాడు.

"టామ్! మనం ఉన్నది అంతరిక్షంకాదు; బెలూన్!"అన్నాను నేను.

"బెలూన్ కాదని ఎవరన్నారు? అంతరిక్షం అని ఎవరన్నారు?"

"నువ్వ ఉత్తరంమీద రాశావుగదా?"

"అవును రాశాను. రాస్తే? ఈ బెలూనే అంతరిక్షమని దాని అర్థమా?"

"నే నలా అనుకున్నానులే. పోనీ, అంతరిక్షం అంటే అర్థం ఏమిటి ఇంతకీ?"

నా ప్రశ్నకి టామ్ తలకిందులైనాడు. అటు తిరిగాడు, ఇటు తిరిగాడు. బుర్రగోక్కున్నాడు. ఏమీ తోచలేదు. "నాకు తెలియదు హక్! నాకే కాదు ఎవరికీ తెలియదనుకుంటాను. అది వట్టిమాటమాత్రమే. కాని చాలా గొప్పమాట. దానితో పోల్చదగినది ఇంకొటిలేదు," అన్నాడు టామ్.

"ఇంతకీ దానిఅర్థం ఏమిటీ అని?"

"నాకు తెలియదని చెప్పడంలా? దాన్ని ఊరికే అలంకారంకోసం వాడతారనుకుంటాను. చొక్కా వొకటి ఉందనుకో. దానిమీద పువ్వులబొమ్మలు కుడతారు. అలా పువ్వులుకుట్టడంవల్ల ఉపయోగం ఏమిటి?"

"ఏమీ లేదు."

"కాని కుట్టడంమాత్రం కుడతారుకదూ?"

"అవును."

★ టామ్‌సాయర్ ప్రపంచయాత్ర ★

"అంటే, చొక్కా అందంగా కనిపించడానికని, దానిమీద పువ్వులు కుడతారు. అలాగే నా ఉత్తరం చొక్కా అనుకో. దానిమీద అంతరిక్షం అనిరాయటం పువ్వులుకుట్టడం లాంటిదే."

ఈ సమాధానం నాకు బాగా నచ్చింది. కాని జిమ్‌కు సంతృప్తి కలగలేదు.

"అదేమిటి టామ్‌సాయర్ గారూ! అలా మాట్లాడతారు! అలాంటి పాపపుమాటలు అనకండి. ఉత్తరం చొక్కా అవుతుందా? దానిమీద పువ్వులుంటాయా? ఎలా వుంటాయి? ఉంటే దాన్ని తొడుక్కోవడమెలా? తొడుక్కున్నా అవి దానిమీద నిలుస్తాయా?"

"నోరుమూయవోయ్ జిమ్. వట్టి మట్టిబుర్ర!"

"మీ వుద్దేశం ఏమిటి టామ్‌గారూ! నాకు చొక్కాల్ని గూర్చి తెలియదంటారా? నే నిప్పటికి ఎన్ని చొక్కాలు ఉతికానో, ఎన్ని......"

"అబ్బబ్బ. ని సొద నీదేగాని, చెప్పేది విని పించుకోవేం? చొక్కాలకీ దీనికీ ఏమిటి సంబంధం?" అని విసుక్కున్నాడు టామ్.

"మళ్లీ మాటమార్చేస్తారేమిటి టామ్‌గారూ! మీరేగదా అన్నారు ఉత్తరం చొక్కాలాంటిదని."

"ఇస్సి. నీవాదనతో నాకు ఉన్న మతి కాస్తా పోతోంది. నేనేదో వూరికే ఉపమాలంకారంకోసం వాడితే నువ్వు అదే నిజమనుకుంటే ఎలా?"

ఉపమాలంకారమనే మాట విశేషమేకి అదేమిటో తెలియక జిమ్ నోరు ఒకనిమిషంసేపు కట్టుబడి పోయింది. జిమ్ కొంచెం బెరుకుగానే అడిగాడు:

"టామ్ గారూ! ఉపమాలంకారం అంటే ఏమిటి?"

"ఉపమాలంకారం అంటే — అంటే — ఒక రకమైన ఉదాహరణ అన్నమాట," అన్నాడు టామ్. కాని అదికూడా జిమ్ కర్థంకాలేదు. అందుచేత టామ్ మళ్ళీ ఇలా చెప్పాడు: "ఇదిగో జిమ్! 'పిట్టకొంచెం కూతఘనం' అంటాననుకో. అది ఉదాహరణ అవుతుంది. అంటే—"

"టామ్‌గారూ! మళ్లీ పొరపాటుపడుతున్నారు. పిట్టలసంగతి మీకు తెలియదు. ఒక పిట్టని పట్టుకుని—"

"అబ్బబ్బా! ఊరుకో జిమ్! నీలాంటి బుర్రలోకి మేకు దిగకొట్టినా దిగదు. నీతో మాట్లాడ్డం వృథా," అని టామ్ విసుక్కున్నాడు.

జిమ్ సంతృప్తితో చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు. టామ్‌ను బోల్తాకొట్టించినందుకు తెగ మురిసి పోతున్నాడు. అసలు టామ్ పిట్టలసంగతి ఎత్తగానే అనుకున్నాను, అతని పని ఆఖరని. పిట్టల్ని గూర్చి నాకూ, టామ్‌కూ తెలిసిన దానికి రెట్టింపు తెలుసు జిమ్‌కి. జిమ్ కొన్ని వందల పిట్టల్ని చంపి, వాటి పుట్టు పూర్వోత్తరాలన్నీ నేర్చుకున్నాడు. పక్షుల్ని గూర్చి పుస్తకాలు రాసేవాళ్లంతా అంతే. వాళ్ళకి పక్షు లంటే పాపం ఎంతో ప్రేమ. ఆ ప్రేమతో బెంగపెట్టుకుని క్రుంగి కృశించిపోతారు. ఎక్కడన్నా కొత్తరకం పక్షి కనిపిస్తే చాలు దాన్ని చంపి, పరిశోధన చేస్తారు. వీళ్ళని పక్షిశాస్త్రజ్ఞులంటారు. అసలు నేను కూడా పక్షిశాస్త్రజ్ఞుణ్ణి కావలసిందే. ఎందుకంటే నాకు పక్షు లంటే బలే యిష్టం. పక్షిశాస్త్రంలో ఏమైనాసరే ఆరితేరినవాణ్ణనిపించుకోవాలని సంకల్పించాను. ఒకసారి ఒక పక్షి ఒక చెట్టుమీద కూర్చుని కూస్తోంది. నేను తుపాకితో దాన్ని పేల్చాను. వెంటనే పక్షి నేలపడింది. నేను పరిగెత్తుకువెళ్లి దాన్ని పట్టుకున్నాను. అప్పటికే అది చచ్చిపోయింది. కాని దాని వళ్లు యింకా వెచ్చగానే వుంది. మెడవిరిగిందిగావును తల ఎటుపడితే అటు వూగుతోంది. కళ్లమీద తెల్లనిపొర కమ్మింది. తల కాక పక్కన నెత్తురు కారుతోంది. ఇక చూడలేక పోయాను. నాకళ్ళలో నీరునిలిచి మూసుకుపోయాయి. ఆరోజునుంచీ నేను మళ్ళీ పక్షినిగాని, జంతువునుగాని నాకు అపకారంచెయ్యనిదాన్ని దేన్నీ చంపితే వొట్టు.

ఇంతకీ ఆ 'అంతరిక్షం' అనే మాట నాకు గొంతుకలో వచ్చివెలక్కాయలాగ అడ్డంపడింది. మళ్ళీ దాన్నిగూర్చి అడిగాను. టామ్ తన శాయశక్తులా బోధపరచడానికి ప్రయత్నించాడు. "ఎవరైనా దేశనాయకుడు ఉపన్యాసమిస్తే ప్రజలు హర్షధ్వానాలు చేశారనీ, హర్షధ్వానాలతో అంతరిక్షం మారుమ్రోగిందనీ పత్రికలు రాస్తాయి. ఏ పత్రికలో చూసినా ఆ ముక్క కనిపిస్తుంది. కాని దాని అర్థం ఏమిటో

ఎవడూ చెప్పడు. అందుచేత అంతరిక్షం అంటే ఆరుబైట చాలా ఎత్తున అయివుండాలని నేను అనుకున్నాను," అని చెప్పాడు టామ్. ఇది కొంచెం సబబుగానే వుంది. కనుక "ఓహో, అలాగా" అని ఒప్పుకున్నాను.

నన్ను సమాధాన పరచగలిగినందుకు టామ్ సంతోషపడ్డాడు.

"సరే. అయిందేదో అయింది. అంతరిక్షం అంటే ఏమిటో నాకు తెలిదుగాని, మనం లండన్‌లో దిగగానే, అంతరిక్షం మారుమోగిపోయేట్లు చేద్దాం," అని సగర్వంగా అన్నాడు.

"వైమానికుడు అంటే బెలూన్లలో షికార్లుచేసే వాడని అర్థం" అని కూడా చెప్పాడు. కేవలం సామాన్యపు దేశసంచారిగా బతుకు వెళ్ళబుచ్చేదానికంటె వైమానికుడుగా మహోజ్వల జీవితం గడపడమే తనకు యిష్టమనీ, తన కీర్తి ప్రపంచమంతటా వ్యాపించక తప్పదనీ అన్నాడు.

మధ్యాహ్నమైంది. మేము ఇంగ్లండులో దిగడానికి సన్నాహాలన్నీ పూర్తిచేసుకున్నాము. చాలా హుషారుగా వున్నాము. ఇంతదూరం సురక్షితంగా ప్రయాణం చేసినందుకు గర్వించాము. అమెరికాను చేరబోయేముందు కొలంబస్‌లాగ మేము కూడా దూరదర్శిని యంత్రాలను తీసుకుని చూశాము. కాని ఎంతదూరం చూసినా సముద్రం తప్ప మరేమీ కనబడలేదు. సాయంత్రమైంది, సూర్యుడస్తమించాడు. కాని నేల ఎక్కడా కానరాలేదు. కారణమేమిటా అని కళవళపడ్డాము. 'ఫరవాలేదులే. ఎవడికోసం వస్తుంది నేల' అని సమాధానపడ్డాము. అలాగే తూర్పు దిశకే విమానాన్ని పోనిస్తున్నాము. కాని మార్గంలో ఏవైనా పర్వతాలుతగిలితే ప్రమాదమని విమానాన్ని బాగా ఎత్తుకు తీసుకుపోయాము.

అర్ధరాత్రివరకూ నావంతు. తరవాత జిమ్‌వంతు. కాని టామ్ ఆ రాత్రి అసలు నిద్రపోనేలేదు. మేలుకొనే వున్నాడు. ఓడ నేలను సమీపించడానికి ముందు కెప్టెన్లు నిద్రపోరనీ, మేలుకుని జాగ్రత్తగా అన్నీ కనిపెడుతూవుంటారనీ, తనుకూడా అలాచెయ్యకతప్పదనీ అన్నాడు.

మళ్లీ సూర్యోదయమైంది. జిమ్ సంతోషంతో పొలికేకపెట్టాడు. మేము ఎగిరిలేచి చూశాము. మా విమానం భూభాగంమీదుగా పోతోంది. ఎటుచూసినా నేల కనిపిస్తోంది. చదునుచేసినట్టు, ఒకే సమతలంలో, బంగారం పరచినట్టు పచ్చగా మెరుస్తూ ఎంతదూరం చూసినా నేలే. ఎక్కడా చెట్లూ, గట్లూ, కొండలు, కోనలు, పల్లెలు, పట్టణాలు మచ్చుకైనా లేవు. అసలు ముందు దాన్ని చూసి నిశ్చలంగావున్న సముద్రమేమోననుకున్నాము.

ఏదో చెప్పలేని సంభ్రమంతో, మేము దూరదర్శినులు తీసి లండన్ ఎక్కడైనా కనిపిస్తుందేమోనని వెదికాము. కాని దాని జాడే ఎక్కడా గోచరించలేదు. ఆఖరికి మనుష్య మాత్రుడన్నవాడే ఆ ప్రాంతంలో అగుపడలేదు. ఓ చెరువుగాని, ఓ నదిగాని కానరాలేదు. టామ్ ఆశ్చర్యపడ్డాడు. ఇంగ్లండయితే ఇలావుండదే అనుకున్నాడు. ఇంగ్లండు దాదాపు అమెరికాలాగానే వుంటుందని తానింత కాలమూ అనుకునేవాణ్ణని అన్నాడు. సరే ఏదైతేనేం, ముందు భోజనంకానిచ్చేద్దామని, ఆ తరవాత లండనుకు దగ్గిరిదోవను వాకబుచేసి కనుక్కుందామనీ అనుకున్నాము. ఆదుర్దాకొద్దీ రెండునిమిషాల్లో తిండి పూర్తిచేశాము. విమానాన్ని నేలకు దగ్గరగా తీసుకువచ్చాము. గాలి వేడిగావుంది. ఉన్నికోట్లు తీసివేయవలసివచ్చింది. మరి కాసేపటికి బాగా చెమటలుపట్టేటంత వేడెక్కింది. నేలకు బాగా దగ్గిరిగా వచ్చాము. ఇహ చూసుకోండి, కుంపటిమీద కూర్చున్నట్టేవుంది.

నేలకు ముప్ఫయ్ అడుగుల సమీపానికి దిగి విమానాన్ని ఆపాము. నేల అన్నానుగాని, అది నిజంగా నేలేనా? ఆ ఇసకసముద్రం నేలే అయితే అది నేలే. టామ్, నేనూ నిచ్చెన వేళ్లాడదీసి దానిమీదుగా కిందికి దిగాము. అంతకాలం విమానంలో వున్నందున, గుదులుకట్టిన కాళ్లను సాగదీసుకొనేందుకు కాస్త దూరం పరిగెత్తాము. హాయి అనిపించింది. పరిగెత్తడం హాయి అనిపించిందిగాని, కాళ్లకు హాయిఅనిపించలేదు. ఇసక భగభగ మండిపోతోంది. ఇంతలో మాకేసి ఎవరో పరిగెత్తుకొస్తున్నట్టు కనబడింది. అమ్మయ్య అనుకొని ఆ వేపు మేముకూడా పరిగెత్తాము. కాని జిమ్ ఒకటేగోలగా అరవసాగాడు. వెనక్కితిరిగి చూశాము. జిమ్ ఎగిరి గంతులేస్తూ, వచ్చెయ్యండని సంజ్ఞలు

★ టామ్ సాయర్ ప్రపంచయాత్ర ★

చేస్తూ, పిచ్చికేకలు వేస్తున్నాడు. ఏమంటున్నాడో అర్థంకాలేదు, కాని భయభ్రాంతుడైపోయినట్టు గ్రహించాము. సరేనని బెలూన్‌కేసి పరిగెత్తాము. దగ్గిరికొచ్చేసరికి జిమ్ మాటలు అర్థమైనాయి. అర్థం అవడమేమిటి, అంత వేడి యిసకలోనూ నా కాళ్లు చల్లబడడమేమిటి, రెండూ ఒక్కసారిగా జరిగాయి.

"వచ్చెయ్యండి, బాబోయ్ వచ్చెయ్యండి. దబ్బున. ఇంకా ఇంకా, త్వరగా. బోనులోంచి తప్పించుకున్నట్టుంది, పరిగెత్తండి, బాబోయ్, నాయనోయ్," అని జిమ్ అరుస్తున్నాడు.

టామ్ సుడిగాలిలా దూసుకుని పరిగెత్తాడు. కాని నా కాళ్లు బిగుసుకుపోయాయి. కలలో దెయ్యం వెంటబడి తరుముతున్నప్పుడు ఎంత పరిగెత్తినా కాళ్లు మెలికలు పడినట్టు అయిపోయింది నా పని.

టామ్ ఒక్కగంతులో నిచ్చెన అందుకుని, గబగబ కొన్ని మెట్లు ఎక్కి, నా కోసం ఎదురు చూస్తున్నాడు. నేను నిచ్చెనమీద కాలు ఆనించగానే, టామ్ విమానాన్ని పైకి లేవనెత్తమని జిమ్‌కు కేక వేశాడు. కాని జిమ్ తనకు మతిపోయిందనీ, ఏ మీట నొక్కాలో మరిచిపోయాననీ అన్నాడు. టామ్ ఒక్క ఉదుటున పోయి, పైకెక్కి నన్ను రమ్మని కేకేశాడు. ఈలోగా సింహం చాలా దగ్గిరికి వచ్చేసింది. భయంకరంగా గర్జిస్తూ హుటాహుటిగా వస్తోంది. నా పై ప్రాణాలు పైనే పోయాయి. కాలుతీసి పై మెట్టుమీద వెయ్యడానికి భయం వేసింది. ఎందుకంటే కాళ్లు గజగజ వణుకుతుండగా, వాటిని కదిలిస్తే సాపుగా కింద పడిపోయేవాణ్ణే.

టామ్ విమానంలోకి పోయి, పైకి పోనిచ్చాడు. కాని పది పన్నెండు అడుగులు పైకి పోయి మళ్ళీ ఆపాడు. సింహం దగ్గరికి వచ్చింది. నాకు సూటిగా కింద నుంచుని నన్ను చూసింది. నన్ను అందుకోడానికి ఎగరడం సాగించింది. భీకరంగా గర్జిస్తూ ఎగురుతోంది. కాని ఒక అంగుళం వాసిలో తప్పిపోతోంది. దాని నోటికి అందీ అందనంత దూరంలో ఉండడం, కాస్తలో అందక పోవడం, కసితీరా దాన్ని నోరూరించడం బాగానేవుంది. కాని మరోపక్కన ఆ ప్రమాదపరిస్థితిలో, ఏ నిమిషానైనా సింహంనోటికి ఎరగావడానికి సిద్ధంగా వుండడం దారుణంగావున్నది. నిస్సహాయంగా వేళ్లాడుతున్నాను పైకి ఎక్కడానికి కూడా సత్తువలేదు. అటువంటి పరిస్థితిలో ఏ మానవుడూ ఏ కాలంలోనూ వుండివుండడని నా దృఢనమ్మకం. ఉండాలని నాశత్రువు విషయంలోకూడా కోరను.

'ఏం చేద్దాం ఇప్పుడు' అని టామ్ అడిగాడు నన్ను. 'నాకేం తెలుసు' అని జవాబిచ్చాను నేను. "విమానాన్ని బాగా దూరానికి తీసుకుపోతాను; అందాకా అలా పట్టుకొనివుండగలవా?" అని అడిగాడు. "ఇదే ఎత్తులో ఉంటే ఫరవాలేదు. ఇంతకంటె ఎత్తుకు పోతే కళ్లు తిరిగిపడిపోతాను," అని జవాబు ఇచ్చాను.

"అయితే గట్టిగా పట్టుకో," అని బయలుదేరాడు.

"అంత వేగంగా నడిపించకు టామ్! తల తిరుగుతోంది," అన్నాను.

టామ్ విమానవేగం తగ్గించాడు. ఇప్పుడు నెమ్మదిగా పోతున్నాము. కాస్త ఫరవాలేదనిపించింది. అయితే మళ్లీ ఆసింహం ఉరుములాగ గర్జిస్తూ, మెరపులాగ పరిగెత్తుకొస్తోంది. దాని అరుపులు విని మరికొన్ని దాని జాతి జంతువులు ఆవురావురుమంటూ పరుగెత్తు కొస్తున్నాయి. కొద్దిసేపటిలో ఇరవై ముప్ఫయ్ సింహాలు విమానంవెంటబడి నన్ను అందుకోడానికి ఎగురుతూ పరుగెత్తసాగాయి. ఇలా కొంతదూరం పోయేసరికి ఎవరూ పిలవాపెట్టకుండా కొన్ని పెద్దపులులుచేరాయి. ఇదంతా ఒక గలభాగా పరిణమించింది.

మా ప్లాను సరియైనది కాదని గ్రహించాము. ఈ మాదిరిగా నెమ్మదిగా పోతున్నంతసేపూ సింహాల, పెద్దపులులబాధ మాకు తప్పదనిపించింది. నేను మాత్రం అలా ఎంతసేపు నిచ్చెనమీద వేళ్లాడుతూ నుంచోగలను?

టామ్ కాసేపు ఆలోచించాడు. మెరుపులాగ ఒక ఆలోచన తట్టింది. రివాల్వరుతో ఒక సింహాన్ని కాల్చి చంపెయ్యడం, దానిశవంమీదపడి తక్కిన

[illegible]

పూర్వం చీనా దేశంలో టింగ్ ఫో అనే వ్యవసాయదారుడుండే వాడు. అతను చాల బీదవాడు పొద్దస్తమానం పొలాల్లో కష్టపడి వచ్చిన కూలి డబ్బుల్తో కుటుంబాన్ని పోషించుకొస్తుండే వాడు. అతనిభార్య మంచి తెలివైనఇల్లాలు. పెరట్లో రకరకాలైన కాయగూరలు పండించి వాటిని అమ్మి ఆ డబ్బును ఇంటి క్రింద ఖర్చు పెడుతుండేది

ఆ దంపతులకు లేక లేక ఒక కుమార్తె కలిగింది ఆ పిల్ల పేరు ఏషా ఏషా చాల బుద్ధిమంతురాలు. పాపం ఏషాకు ఐదో యేడు వచ్చేసరికి తల్లి చచ్చిపోయింది. ఏషా తల్లిగురించి ఎంతో యేడ్చి, బెంగపెట్టుకుంది. టింగ్ ఫో ఏషాను లాలించి, గుండెల్లో వుంచుకొని, పెంచి అతికష్టంమీద తల్లిని మరిపించగలిగాడు

ఎనిమిదో సంవత్సరం వయసొచ్చేసరికి ఏషా, అన్నం కాయగూరలు వండటం నేర్చుకుంది పొలంనుంచి తండ్రి యింటికొచ్చేసరికి భోజనం తయారుచేసి ఒడ్డించేది. తీరిక సమయాల్లో చదువు నేర్చుకొనేది పుస్తకాలు కొనుక్కునేందుకు ఏషాదగ్గఱ డబ్బు ఉండేదికాదు. ఇరుగుపొరుగు పిల్లల నుంచి మంచి మంచి పుస్తకాలు తెచ్చుకొని, చదివి, మళ్లీ వాటిని భద్రంగా యిచ్చివేసేది

[illegible]

ఏషాకు పూలమొక్కలంటే బలే సరదా! రకరకాల మొక్కలు తెచ్చి, దొడ్లోనాటి, ఎంతో జాగ్రతగా పెంచుతుండేది. రంగురంగుల పూలుపూస్తే వాటినిచూసి ఆనందంతో గంతులువేసేది ఆపువ్వుల్లో కొన్నిటిని కోసి తోటిపిల్లలకు పంచిపెడుతుండేది కొన్నిదండలు గుచ్చి బజార్లో అమ్మి, ఆ డబ్బును తండ్రికిస్తుండేది

ఇలా వుంటూండగా అకాత్తుగా టింగ్ ఫో రెండోవివాహం చేసుకొన్నాడు. ఆ సవతితల్లి వచ్చిన కొత్తలో ఏషాను ప్రేమతో చూస్తుండేది కాని రాను రానూ బాధలుపెట్ట నారంభించింది ఆమె కూచొని ఉంటే ఏషా యింటెడు పనీ చేసేది ఎందులోనైనా కాస్త లోపంవచ్చిందంటే ఆ సవతితల్లి క్షమించేదికాదు అతి దారుణంగా దండించేది అయితే ఏషా బుద్ధిమంతురాలవటంచేత ఆ సవతితల్లి పెడుతున్న బాధల్ని తండ్రితోగాని, యిరుగుపొరుగు వాళ్లతోగాని చెప్పేదికాదు. అతి గుట్టుగా మసలు కొస్తుండేది.

కొంతకాలానికి ఆ సవతితల్లికి ఒక ఆడపిల్ల కలిగింది. చిన్నారి చెల్లినిచూసి ఏషా చాల సంబరపడ్డది ఆ పిల్లకు కోఊ అని పేరుంచారు. ఏషాకు ఇంటిపనులకు తోడు కోఊను సందరించటంకూడ తలమీద పడ్డది. ఏ విషయంలోనైనా రవంత అలుపు కనిపించిందా అంటే ఏషా వీపు విమానంమోత మోగిపోతుండేది ఆ బాధలన్నింటినీ ఆ పాప ఎంతో ఓర్పుతో సహించుకొస్తుండేది

కోఊకు ఎనిమిదోసంవత్సరం వచ్చింది అక్కకు చేదోడు వాదో

మ్మగాలు పీక్కుతింటూవుంటే ఈలోగా మేము చాల దూరం వెళ్లిపోవడం, ఇదీ అతని ఆలోచన ఆ ప్రకారమే అతడు విమానాన్ని ఒకచోట నిలిపాడు రివాల్వరుపేల్చి ఒకదాన్ని చంపాడు మిగతా జంతువులన్నీ దాని మాంసం కోసం కాట్లాడుకుని నోటికందినంత ఆరగిస్తూవుండగా మేము పావుమైలుదాకా పారిపోయాము నేను నెమ్మదిగా నిచ్చెన ఎగబాకి విమానంలో పడ్డాను ఇంతలో భోజనం పూర్తిచేసి జంతువులు మళ్లీ మా వెంటబడ్డాయి కాని ఈసారి ఎగిరి అందుకోవాలన్నా అందనంత ఎత్తుగా ఉన్నాము మేము. ఇక మామీద నిరాశచేసుకుని అవన్నీ దిగాలుపడి అక్కడే కూర్చుండి మాకేసి చూస్తున్నాయి 'మమ్మల్ని ఇలా భంగపరిచిపోతారా' అన్నట్టు ఉన్నాయి ఆటిచూపులు. నాకే జాలివేసింది వాటిని చూస్తుంటే.

(ఇంకా వుంది)

★ కోయిల పుట్టుక ★

డుగా సహాయపడుతుండేది. తల్లి వద్దన్నా వినేదికాదు. ఏషా అంటే కోఊకు ఎంతో అభిమానం! కోఊ అంటే ఏషాకు ప్రాణం!

ఒకనాడు కోఊ ఏషాతో వంట కట్టెలు తేవటానికి అడవికి బయల్దేరింది. తల్లీ తండ్రీ ఎంతవద్దన్నా విన్నదికాదు. ఏషాకూడ వారించింది. కాని కోఊ ఒకటే మారాం చేసింది. చివరకు కోఊను ఏషా తీసుకువెళ్ళక తప్పిందికాదు. ఆ రోజంతా చెల్లెల్ని కనిపెట్టుకొని ఉండటంవల్ల ఏషా మునపటిలా కావల్సినన్ని కట్టెలు కూడదీయలేకపోయింది. కొంచెం కట్టెల్తో యింటికి వెళ్లేసరికి సవతితల్లి ఏషామీద విరుచుకుపడ్డది. తప్పంతా తనదే అని కోఊ చెప్పినప్పటికీ ఆమె వినలేదు. పేపబెత్తం తీసుకొని ఏషా వీపు చిట్లగొట్టింది.

ఆనాటినుంచీ కోఊ అడవికి వెళ్తానని మాటవరసకైనా అనలేదు.

కొన్నాళ్లకు ఒకనాడు ఏషా తండ్రీ, సవతితల్లీ జబ్బుతో ఉన్న బంధువును చూడ్డానికి పొరుగూరు వెళ్లారు. రెండురోజుల్లో వచ్చేస్తామని, కోఊను జాగ్రతగా చూస్తూండమనీ ఏషాకు మరీ మరీ చెప్పి వెళ్లారు.

మర్నాడు ఏషా ఉదయాన్నే కోఊకు చద్దన్నంపెట్టి, తానింత తిని అడవికి బయల్దేరింది. కోఊకు యింటిదగ్గఱ ఉండమని చెప్పింది. కాని కోఊ "అక్కా! ఒకర్తెనూ ఇంట్లో ఉండలేను. నీతో అడవికి వస్తాను. ఇవ్వాళ అమ్మలేదుకదా! మనిద్దరం కలిసి కట్టెలు కూడదీస్తే బోలెడన్ని అవుతవి! తిరుగా పొద్దు గుంకకముందే వచ్చేద్దాం!" అని బతిమిలాడింది.

అతి కష్టంమీద ఏషా ఒప్పుకొని కోఊను తోడ్చుకుపోయింది. ఇద్దరూ ఆడుకుంటూ పాడుకుంటూ అడవికి చేరుకున్నారు. చాలసేపటి వఱకూ యిద్దరూ కలిసే కట్టెలు కూడ వేశారు.

తరువాత ఏషా దట్టంగా వున్న చెట్లమధ్యకు పోయి ఎండుకొమ్మలు విరుస్తూండడంలో మునిగిపోయింది ఎంతో సేపటికిగాని బయటికి రాలేదు.

ఎప్పుడైతే బయటికొచ్చిందో అప్పుడామెకు చెల్లెలు కనిపించలేదు. నాలుగువేపులా చూసింది. "కోఊ - కోఊ" అని గొంతెత్తి పిల్చింది. జవాబు రాలేదు. ఏషా గాభరాపడిపోయింది. ఏదో చెప్పరాని అనుమానం వేసింది. దానితో ఆమెకాళ్లు గజగజవణికిపోయాయి! తడబడే అడుగుల్తో అటూయిటూ పరుగెత్తి "కోఊ కోఊ" అని పిలుస్తూ ఏడవనారంభించింది.

అలా యేడుస్తూ కొంతదూరం పోయేసరికి రక్తం మరకలు కనిపించాయ్! అవి పచ్చిపచ్చిగా ఉన్నాయ్! దాంతో ఏషా పెద్దపెట్టున అరుచుకొంటూ ఆరక్తపు మరకలను చూసుకుంటూ పోయింది. ఒక ఫర్లాంగుదూరం వెళ్లేసరికి పెద్దపొదలో "గుఱగుఱ" శబ్దం వినిపించింది.

ఏషా అకాత్తుగా నిల్చుండిపోయింది. కాని ఎంతోసేపు ఆమె అలా నిల్చుండలేకపోయింది. ముంచుకొస్తూన్న దుఃఖంతో "కోఊ - కోఊ" అంటూ ఆ పొదలో దూరింది. అందులో ఒక చిఱుతపులి కోఊ లేత శరీరాన్ని కండలుకండలుగా పీక్కుతింటున్నది. ఆ దృశ్యం కంటబడగానే ఏషా "అయ్యో చెల్లీ! కోఊ" అని అరచి కుప్ప పెట్టున కూలిపోయింది.

చాలాసేపయాక ఏషాకు తెలివి వచ్చింది. లేచి చూచేసరికి చిఱుతపులి అక్కడలేదు. చిందరవందరై పోయిన కోఊ శవంమాత్రం పడి ఉంది! ఆ శవం మీందపడి ఏషా రాళ్లు కరిగిపోయేలా ఏడ్చింది. ఆమె ఏడుపుతో ఆ అడవిఅంతా ప్రతిధ్వనించిపోయింది. ఆ యేడుపునకు అంతంలేదు! రాత్రనక, పగలనక అలా ఎంతోకాలం ఏడ్చింది.

ఆమెకరుణారోదనంవినికొన్నాళ్లకా వనదేవత ఏషా యెదుట ప్రత్యక్షమై యిలా అన్నది—

"ఏషా! నువ్విలా యేడ్చుకొని ఉంటే నీచెల్లి బతికి వస్తుందనుకున్నావా? పిచ్చిపిల్లా! లోకంలో చచ్చిపోయినవాళ్లు ఎవరైనా బతికారా? అలానే నీచెల్లికూడాను! ఇక యేడుపు మాని యింటికివెళ్లు! నీకోసం నీతండ్రీ, సవతితల్లీ తిండీ తిప్పలులేక బెంగపెట్టుకొని ఉన్నారు. కోఊ లేకపోయినా నీవైనా వెళ్లి వాళ్లకంటపడు!"

ఏషా వనదేవతకాళ్లు పట్టుకొని "అమ్మా! కోఊ లేనిది నేను

ఆనాడు చిట్టి ఇంట్లో చాలా అల్లరి చేశాడు. అమ్మకి కోపం వచ్చింది. "రేపు నిన్ను నాతో ఎగ్జిబిషనుకు తీసుకుపోనులే. నీవు ఇంట్లో ఉండవలసిందే" అని శాసించింది. తీరా వెళ్ళబోయే ముందు, జాలివేసి చట్టెనికూడా బయలు దేరమన్నది. చిట్టి ఎంతో చిక్కుల్లోపడ్డవాడివలె మొహం పెట్టాడు. "ఏం? ఏమయింది?" అని అడిగింది అమ్మ.

"అదికాదు అమ్మా! మరి నువ్వు నన్ను తీసుకెళ్లనన్నావు కదూ? అందుకనే, ఈవాళ మీరు ఎగ్జిబిషన్‌కు వెళ్ళగానే వర్షం రావాలని దేముణ్ణి ప్రార్థించాను. ఇప్పుడెట్లా?"

యింటికి వెళ్లను ఇలా ఈ అడవిలోనే ఉండిపోతాను. నా చెల్లెలిని తినివేసినట్టు నన్నూ ఆ చిఱుతపులి తినివేస్తే నా బాధలు అంతమైపోతవి. లేదా నామీద నీకుదయ వుంటే నా చెల్లిని బతికించు! మేమిద్దరమూ యింటికి వెళ్లిపోతాం!" అని కన్నీరు కార్చింది.

వనదేవత విచారంతో "నాలో అంతశక్తిలేదు ఏషా! కాని నువు ఒప్పుకుంటే ఒక పని చేస్తాను" అన్నది.

"నువ్వేం చేసినా నాకిష్టమే దేవీ! నా చెల్లిరూపమూ, నా చెల్లిపేరూ నాలో వుంటే చాలు" అన్నది ఏషా ఆతృతతో!

"సరే!" అని వనదేవత చిటికెడుమన్ను తీసి, మంత్రించి ఏషామీద చల్లింది.

వెంటనే ఏషా నల్లని పక్షిగా మారిపోయింది. తీయనికంఠంతో "కోఊ....కోఊ"-అని పలకనారంభించింది. అలా పలుకుతున్నప్పుడల్లా కోఊ రూపం ఆ పక్షి ఎదట కనిపిస్తుండేది. ఆనందంతో ఆ పక్షి అడవి అంతా తిరుగుతూ మనసు కలిగినప్పుడల్లా "కోఊ" అని పిలుస్తుండేది! చెల్లెలిరూపాన్ని చూసి ఎంతో మురిసిపోతుండేది!

ఆ పక్షే కోయిల అయింది! "కో ఊ" అని అది పలుకుతూ ఉంటే మనకు "కుహూ" అన్నట్టు ఇప్పుడు వినిపిస్తూఉంటుంది!

★

విజ్ఞానవీధులు

"డాక్టర్"

చిట్టిప్రశ్నలకు జవాబులు

డి. బాబూరావు—గద్దలగుంటపాలెం.

—అవును. మనము చూస్తూవున్న నక్షత్రాల కాంతి అసలు నక్షత్రమునుండి ఎన్నో ఏళ్ల క్రిందట బయలు దేరిన వెలుతురే! కొన్ని సంవత్సరముల క్రిందట హెర్‌క్యులీస్ అనే నక్షత్ర సముదాయంలో వెలిగిన నోవా నక్షత్రము ఔరంగజేబు రాజ్య పాలన కాలములో వెలిగిందసలు. ఆ వెలుగు ఆ చోటనుంచి బయలుదేరి సెకనుకు 186000 మైళ్ళ చొప్పున ప్రయాణిస్తూ మన కంటికి 1924 లో చేరుకున్న దన్నమాట.

వజ్రాలు గనులలో స్ఫటికపురాళ్ల నరుకులలో లభిస్తాయి. ఆ నరుకులలో చిక్కుపడ్డ బొగ్గు పదార్థము భూగర్భమునందలి వేడికీ ఒత్తిడికీ వజ్రముగా మారుచున్నది. వజ్రములను చేయు పద్ధతి ఇంకా ఎవ్వరునూ కనిపెట్టలేదు...కెంపులూ పచ్చలూ నీలములూ, అల్యూమినియమూ, ప్రాణ వాయువూ చేరిన మిశ్రములు. కెంపులను తయారుచేయుట విజ్ఞానశాస్త్రజ్ఞులు నేర్చినారు...వైక్రాంతమన్నది అరు పలకలుగా ఘనీభవించే స్ఫటికముయొక్క ముక్క. దీనిలోని పదార్థమునకును ఇసుకకును హెచ్చు భేదము లేదు. పగడము పగడపు పురుగుయొక్క గుల్ల. ఇదికూడ సముద్రములోనే దొరుకును.

ఘంటా రాఘవరెడ్డి—సూర్యాపేట.

—భూమిమీది సముద్రపు ఉపరితలము ఎక్కడికక్కడ సమతలమే! నిమ్మపండు మీది చెర్మమును గుర్తించండి. ఇదే పెద్దదైనచో ఎక్కడికక్కడ సమతలంగా కనబడే చర్మము గుండ్రని పండును పట్టియున్న దనుటకు అభ్యంతరము లేదుకదా! భూమిపైని సముద్రపు నీరుకూడ భూమి ఆకర్షణ శక్తివలన భూమిని పట్టియుండును. ఎక్కడికక్కడ ఉపరితలము సమతలంగా వుండక వేరెట్లు ఉండగలదూ?

—నీలాకాశములో పీకిన దూదిపింజలవలె కనబడే మబ్బులు అన్నిటికంటే ఎత్తైన మబ్బులు. ఇవి ముఖ్యముగా మంచు రవ్వలవల్ల ఏర్పడ్డ మబ్బులు. ఆకాశము మొత్తము వంతటేని పలచగా కప్పి గొర్రెల మందవలె కనబడునవి పై మబ్బులకంటే దిగువన నుండును...దూది బేళ్ళవలె కనబడే తెల్లటి మబ్బులు మనకు అన్నిటి కంటే దగ్గరగానున్న మబ్బులు. ఇవి భూమినుండి ఆకాశములోనికి లేచే గాలుల మీద తేలి పైకి ఎక్కే ఆవిరులు...ఇక వానమబ్బులు తెల్లని మబ్బులకంటే పైనా వుండవచ్చును, శీత పరిస్థితులనుబట్టి క్రిందా వుండవచ్చును. పై తెల్లమబ్బులే ఆకాశములో అతి ఎత్తుకు పోయినప్పుడు విస్తరించి వాటిలోని ఆవిరి ద్రవీభవించి నీరగుట వల్ల నల్లగా కనబడవచ్చును.

ఎ. బాలసుందరం—నగరి.

—సముద్రములో లోతుకు పోనుపోను నీటి సాంద్రత క్రమముగా హెచ్చును. క్రిందకు పోనుపోను మీదనున్న నీటిపొర దళసరి హెచ్చగును కదా! దీని ఒత్తిడివల్ల అడుగున వున్న నీరు కొంత గుత్తమై సాంద్రత హెచ్చువనుటకు సందేహమేమున్నదీ? సముద్రపు అట్టడుగున జీవించే చేపలు సముద్రముపైకి వచ్చి బ్రతకలేవు. వాటి రక్తనాళములు ఎక్కువ వత్తిడికి అలవాటు పడినవి. కనుక తక్కువ వత్తిడిగల నీటి ఉపరిభాగమునకు ఈ చేపలు వచ్చినచో వాటి రక్తనాళములు చిట్లిపోవును.

పుట్టా శ్రీరామమూర్తి—మాడుగుల.

రాత్రులయందు చంద్రుని చుట్టు గుడి కట్టుటకు కారణము ఆకాశముమీద పలచగా వ్యాపించియున్న మంచుకణములు. చంద్రునియొక్క వెలుతురు ఈ మంచుకణములలోనుంచి ప్రసరించునప్పుడు వంగి అన్నివైపులనుంచి కంటికి చేరును. కనుక చంద్రుడికి వెలుపలనే వెలుతురు ఎక్కువగా నున్నట్లు—అనగా గుడి కట్టినట్లు—కనబడును.

—ఇదివరకు విజ్ఞానవీధులలో ప్రచురింపబడ్డ సమాధానాలను మళ్ళీ మళ్ళీ ప్రచురించడం అవి చూడకుండా ప్రశ్నలడిగిన వారికి తప్ప తక్కినవారికి విసుగు కలిగించునని మీకు తెలియదు కనుకనా? కనుక మాకువచ్చిన ప్రశ్నలన్నిటికీ సమాధానాలు విజ్ఞానవీధుల మొత్తములో ఎక్కడో అక్కడ కనబడతాయి కాని మళ్ళీ మళ్ళీ కనబడవు.

—దీపము చిన్నదై వస్తువు పెద్దదైనప్పుడు ఆ వస్తువు నీడయొక్క అంచులు స్ఫుటముగా నుండునన్న సంగతి అందరికీ తెలుసును. వస్తువు పరిమాణము అల్లేవుండి దీపము - అనగా దీపించు వైశాల్యము - పెద్దదైన కొద్దీ నీడయొక్క అంచులు స్ఫుటత్వముపోయి సరిగా కనబడవు. దీపములోని ఒక బిందువుకడనుండి ప్రసరించే వెలుతురు వస్తువుమీద పడి ఏర్పడిన నీడమీద ఆ దీపములోని ఇంకొక బిందువునుండి ప్రసరించు వెలుతురు పడుటవలన మొదటి నీడ అంచులు ప్రకాశితములై అది స్ఫుటముగా కనబడదు.

ట్యూబులైటు పొడవుగా నుండుటవలన దాని ఒక భాగమునుండి వచ్చు వెలుతురు వల్ల ఏర్పడిన నీడమీద మరియొక భాగమునుండి వచ్చు వెలుతురుపడి ఆ నీడ స్ఫుటత్వమును పోగొట్టును. ట్యూబులైటును చిన్నది చేసినకొలదీ దానివలన ఏర్పడు నీడకు స్ఫుటత్వము హెచ్చును. ట్యూబులైటుకు నల్లని కాగితపు గొట్టములు అమర్చి ఈ నిజమును పరీక్షింపవచ్చును. ★

★ మునిమాపు ★

(11-వ పేజీ తరువాయి)

అతడిగుడ్డలు విప్పి మూలపడేయండి. స్నానం చేదురుగాని.

వైకుం: అని ఆజ్ఞాపిస్తున్నావా...? ఈ విధంగా నన్ను హింసించకపోతే, ఒక్కసారి గొంతునులిమి చంపరాదుటే పీడా వదిలిపోతానుగా...

భార్య: నే నేమన్నానండీ యిప్పుడు..? ఒకవేళ పొరబాటేమన్నా జరిగిందేమో చెప్పండి. సర్దుకొంటాను.

వైకుం: ఇది పొరబాటు కానేకాదు. నువ్వు కావాలనే చేస్తున్నావు. నేను బ్రతకడం నీకిష్టంలేదు. నన్ను చంపడానికి, రకరకాలుగా నువ్వు ప్రయత్నిస్తున్నావు.

భార్య: (యేడుస్తూ) రామ రామ... యెందుకండీ నన్నలా...

వైకుం: ఛట్...మాట్లాడబోకు...నన్ను చంపాలనే నీకు లేకపోతే, నన్ను స్నానం చెయ్యమంటావా..? ఊఁ మాట్లాడవేం..?

భార్య: స్నానం చేయమనటంకూడా తప్పేనాండీ...? మీ యిష్టం. పోనీ మాను కోండి. నేను వెడుతున్నాను.

వైకుం. (ఆగు) రాక్షసీ! అక్కడే ఆగు. నువ్వు లోపలికెళ్ళకు. వెళ్లావంటే నేను పారిపోతాను.

భార్య: (వెక్కిపడుతూ) ఇదంతా నా ఖర్మ.

వైకుం: (ఓదార్పుగా) ఊరుకోవే పిచ్చిదానా. ఏడ్చి అర్థమేమిటి...? వాళ్లు లక్షాధికారులు. అందుకని ప్రతివాళ్ళను చులకనగా చూస్తారు. మరి డబ్బు మదం అలాంటిది. అదృష్టం కలిసివచ్చి, యీ వ్యాపారంలో మన మనుకొన్న లాభం వచ్చిందంటే యిటువంటి కుంకల్ని నీ వాకిలి ముందు కాపలా వుంచుతాను. ఏడవకు. ఏదీ - యిలా నావేపు చూడు-ఒక్క నవ్వు - చిన్ని నవ్వు నవ్వు చాలు...చిన్ని నవ్వు...ఓ...బస్..యిక వెళ్ళి పడుకో...

భార్య: భోజనానికి లేవరూ...?

వైకుం: నాకొద్దు. ఊఁహు...ఫో... నేను తినను.

భార్య: ప్రొద్దు నసంగా తిన్నారు. లేవండి...వడ్డిస్తాను.

వైకుం: నేను తినలేను. చెయ్యి మంట పుడుతోంది. ఇందాక పంతులుగారు కొట్టారు. అమ్మా! రేపు నేను బళ్లోకెళ్లనే. "పులి—బ్రాహ్మణుడు" పాఠ మున్నా, "అక్కఱకురాని చుట్టము" పద్యమూ నోటికొచ్చేట్టు చదవమంటే, యెల్లా వస్తుందో నువ్వు చెప్పవే అమ్మా? రేపు "మా అబ్బాయిని కొట్టవద్దు" అని పలకమీద రాసి తిమ్మిరిబిళ్ళలకోసం యేడిపించను గాక రాసి పెట్టవా...?

భార్య: అలాగే. మరి - భోజనం...

వైకుం: (మెల్లగా) ఒసేవ్...తరువాత అన్నం తిందువుగాన్లే - త్వరగా ఇలా రా. నీకొక మహారహస్యం చెబుతున్నాను. ఎక్కడా పొక్కబోకు. ఇది బైటపడిందంటే, మనిద్దరమూ ఉరిమీద యెగిరిపోతాం. జాగ్రత్త. నే నిప్పుడే వాణ్ని చంపి వస్తున్నాను.

భార్య: (భయపడి) ఎవర్ని చంపారు? ఎప్పుడు చంపారు.

వైకుం: (మెల్లగా) ఇశ్శ్...మెల్లగా మాట్లాడవే. గోడలకు చెవు లుంటాయి. ఆ రమణారావును చంపేశాను. అందుకే యింత ప్రొద్దుపోయింది. ఇంటివారందరూ నిద్రపోయిందాకావుండి, మెల్లిగా లోపలికెళ్లాను. రమణయ్య ఇనప్పెట్టెలో వున్న డబ్బంతా మూటకట్టుకొని, - అప్పటికీ జాగ్రత్తగానే వస్తున్నాను. వాకిట్లో వున్న జవానుగాణ్ని తొక్కాను. వాడు అరిచేలోపుగానే, కత్తితో పొడిచి, పరుగెత్తుకొచ్చాను. ఇందు - యీ నోట్లు, బంగారమూ, జాగ్రత్తగా దాచిపెట్టు. రేపు యెవరన్నా వచ్చి అడిగితే - నీకేమీ తెలీనట్లుగానే వుండు. సరేనా...? మరి, నేను వెళ్ళి పడుకొంటాను ... యిదుగో...ఒకసారి నాచేతులు చూడవే.

భార్య: ఇదేం ఖర్మమండీ! ఇవి నోట్లు కావు. నాటకం కాగితాలు.

(తలుపుతట్టిన చప్పుడు)

వైకుం: చూడవే! ఎందుకైనా మంచిది.

గొంతు: (బైటనుండి, తలుపు తడుతూ) తలుపు తీయండి. ఎవరండీ యింట్లో ..? త్వరగా...తలుపుతీయండి.

భార్య: ఎవరో తలుపుకొడుతున్నారు.

వైకుం: అని ఊరుకొంటావేం...? వెళ్లి, తీసిరారాదూ...?

భార్య: ఇంత రాత్రివేళ, మనింటి తలుపు కొట్టేదెవరా - అని.

వైకుం: వెళ్ళి చూసాస్తే తీరిపోయేదానికి, మీనమేషాలు లెక్కిస్తావేమే...?

గొంతు: (గంభీరంగా) ఏమండోయ్... పిలిచేది మిమ్మల్నే. తలుపు తీస్తారా తియ్యరా...?

వైకుం: (భార్యతో) నీకంత భయంగా వుంటే, నే వెళ్ళి తీస్తాను. (తీసి) ఎవరది? ఏమోయ్...దీపం కొంచెం హెచ్చించు. ఓహ్...ఇన్స్పెక్టర్ గారా...? యేమిటిలా దయచేశారు...?

ఇన్స్పెక్టర్: కొంచెం పనుండి బయలు దేరాను. చూడండి..మీ పేరేమిటన్నారు..?

వైకుం: వైకుంఠమండి. ఇంటిపేరు...

భార్య: (భయంగా) ఎందుకండీ ఇన్.

ఇన్స్పె: మీరు నాతో పోలీసుస్టేషనుకు రావాలి.

భార్య: (విహ్వలయై) అమ్మయ్యో... స్టేషనుకే!!

వైకుం: ఎందుకండీ...?

ఇన్స్పెక్టర్: నేను గోడచాటునుండీ అన్నీ విన్నాను. రమణయ్య సొమ్ము దొంగిలించారు. అతన్నీ అతని జవానునూ చంపారు. మీ రనుకొంటున్నవి, యెవ్వరూ వినలేదనుకోకండిసార్.

భార్య: (హాతాశయై) అయ్యో! భగవంతుడా!

వైకుం: ఎప్పుడనుకొన్నాము...? మీ రెప్పుడు విన్నారు...? ఎందుకండీ అలా గాలిని పోగుచేయటం...?

ఇన్స్పెక్టర్: (ఉగ్రుడై) షటప్. ముందు పదండి స్టేషన్‌కు. విన్న నన్నే అబద్ధీకుణ్ణి చేస్తున్నారంటే మీరు సామాన్యులుకాదు.

వైకుం: (క్షణమాలోచించి, పిచ్చిగా నవ్వి) ఓహ్హో...అదా మీ రంటున్నది...? దచ్చాంపాండి. నే నింకేమిటా అనుకొంటున్నాను. నేను "హంతకచక్రవర్తి" అన్న డిటెక్టివ్ నాటకంలో హీరో వేషం వేస్తున్నానుసార్. నాచురల్ గా యాక్టు చేయడం కోసం, యింటిదగ్గిరే రిహార్సల్ చేస్తున్నాను. ఈ ఘట్టములో హంతకుని భార్యకు ఆక్టే పోర్షన్ లేదు. ఆ రెండు డైలాగ్సూ, మా యింటిదాన్ని అనమని, నేను ప్రాక్టీస్ చేస్తున్నాను. ఇంతలోకే మీరు పిలిచారు. అయితే, నేను చాలా రియల్ గా యాక్టుచేశానన్నమాట. అవునా సార్, ఏమేవ్! నాటకంకాగితాలు చూపించు వారికి.

ఇన్స్పెక్టర్: (చకితుడై) అయామ్ సారీ మిస్టర్ వైకుంఠం. నేనిదంతా నిజమే అనుకొన్నాను.

వైకుం: అట్లా అనిపించడంలోనే నిజమైన కళవుంది. డ్రామా నాడు మీకు ఫ్రీపాసులు పంపిస్తాను. తప్పకుండా రండి.

ఇన్స్పెక్టర్: ఓ యస్. తప్పకుండా వస్తాను ఇంత రాత్రివేళ మిమ్మల్ని డిస్టర్బ్ చేసినందుకు ఏమీ అనుకోకండి. నేను వెడుతున్నాను. మళ్ళీ మీరు రిహార్స్ చేసుకోండి. గుడ్ నైట్ మిస్టర్ వైకుంఠం...

ప్రయోక్త: అంటూ ఇన్స్పెక్టర్ వెళ్ళిపోయాడు. నిజంగా వైకుంఠం రిహార్స్ చేస్తున్నాడనే అతను నమ్మాడు. భార్య నిర్విణ్ణురాలయి చూస్తున్నది తన భర్త విచిత్రప్రవర్తనను. మళ్ళీ ఎర్ర టోపీని చూసిందాకా అతను మామూలు మనిషి కాలేడని ఆమెకు తెలీదు.

(ఆలిండియా రేడియో ప్రసారితం) ★



పువ్వులు వెదజల్లుతున్న దేవ కన్యగా నర్తకి చాంగ్ మీ-చువాన్. బౌద్ధజాతక కథలలోని ఒక కథపై ఆధారపడిన చైనీస్ నృత్యం.

మద్రాసులో చైనీస్ కళాకారులు


భారత ప్రభుత్వ ఆహ్వానంపై వచ్చిన చైనీస్ సాంస్కృతిక ప్రతినిధివర్గంవారు ఢిల్లీ, బొంబాయి నగరాల్లో పర్యటన ముగించుకుని డిసెంబరు 27 న మద్రాసు వచ్చారు. ఇతరస్థలాల్లో జరిగినట్టే ఇక్కడ కూడా వీరికి ఘనమైన స్వాగత సన్మానం జరిగింది. మేయరు పౌరసన్మానం చేశారు. 27 వ తేదీ సాయంత్రం చైనీస్ అతిథుల గౌరవార్థం ట్రిప్లికేన్, కళామంటపంలో భారతీయ కళాప్రదర్శనలు ఏర్పాటు చేయబడినవి. ప్రేక్షకులు అసంఖ్యాకంగావచ్చారు. కళాప్రదర్శనలలో దాక్షిణాత్య సంగీత విద్వాంసుల వాద్యగానగోష్ఠి, రాగిణి, వైజయంతిమాల, గోపీనాథ్, కళాక్షేత్ర సభ్యులు మున్నగువారి నృత్యప్రదర్శనలు, ఎన్. ఎస్. కృష్ణన్ నాటకప్రదర్శన మొదలైనవి చాలా ఏర్పాటుచేయబడినవి.

భారత, చైనాదేశాల మైత్రిని దృఢతరం చేసేఉద్దేశంతో ఈ ప్రతినిధివర్గంవారు మన దేశంలో పర్యటన చేస్తున్నారు. సుమారు రెండు వేల ఏండ్లక్రిందట ప్రారంభమైన ఈ ఉభయదేశాల సాంస్కృతిక సంబంధాలు ఈ మధ్యకాలంలో సడలిపోవడం, తిరిగి భారతదేశం స్వతంత్రదేశంగా, చైనా నవచైనాగా రూపొందడంతో పునఃప్రారంభం కావడం జరిగింది. ఈ మైత్రికి చిహ్నంగా చైనానుండి సాంస్కృతిక రాయబారులు వచ్చి మనదేశంలో కళాప్రదర్శనలిస్తున్నారు. భారతీయుల ఆతిథ్యం తమను సమ్మోహితులను చేసిందని, భారతదేశంనుండి సాంస్కృతికంగా ఎంతో నేర్చుకోవా లనుకుంటున్నామని ప్రతినిధివర్గ నాయకుడు, చైనా ప్రభుత్వ సాంస్కృతికశాఖ ఉపమంత్రి చెంగ్ చెన్ టో ఉద్ఘాటించారు.

చైనీస్ ప్రతినిధులు అన్నామలై మంది

మరొక చైనీస్ నర్తకి
హోంగ్ చూ-హోయ్





చైనీస్ ఖడ్గ నృత్యం— శాస్త్రీయపద్ధతి.

రంలో తమ దేశపు నాట్యాలు, సంగీతం ప్రదర్శించారు

చలన చిత్రగోష్ఠిపై సినీ టెక్నీషియన్ల విమర్శ

ఫిబ్రవరిలో ఢిల్లీలో సంగీతనాటక అకాడమీవారేర్పాటుచేస్తున్న చలన చిత్రగోష్ఠికి ప్రతినిధులను ఎన్నుకొనే ముందు తమ్ము సంప్రదించనందుకు మద్రాసులోని సినీ టెక్నీషియన్ల సంఘంవారు తమ అసమ్మతి తెలుపుతున్నారు. చలనచిత్రాలకు సంబంధించిన అన్ని టెక్నికల్ శాఖలకూ సరియైన ప్రాతినిధ్యం ఉన్నప్పుడే ఆ గోష్ఠి జయప్రదం కాగలదనీ, ఇప్పుడు దానికి అటువంటి సమగ్ర ప్రాతినిధ్యం లేదనీ, అకాడమీవారు ముందు ముందు ఏ చర్యతీసుకోనున్నా తమనుకూడా సంప్రదించవలెననీ సి. టి. సంఘంవారు ఒక తీర్మానంలో కోరారు ★



కాబూల్ తిరుగుబాటుదారులమీద యుద్ధానికి బయలుదేరవలెనని సలీమ్‌ను మాన్‌సింగ్ ఆదేశిస్తున్నాడు
అంజలీవారి "అనార్కలి"లో పేకేటి, నాగేశ్వరరావు, నాగయ్య.

1954 సంవత్సరపు తెలుగు చిత్రాల సింహావలోకనం

గడచిన యేడాది 28 తెలుగు చిత్రాలు వెలువడినవి. ఒక్క యేడు ఇన్ని చిత్రాలు ఇదివరకెన్నడూ విడుదలకాక పోవడంవలన ఇది నిస్సంశయంగా మన చలనచిత్ర పరిశ్రమకు గర్వకారణం. ఈ చిత్రాలు ఈ దిగువ క్రమంలో విడుదల అయినవి:

జనవరి

విజయా—చంద్రహారం
సారథీ—అంతామనవాళ్లే
జెమినీ—రాజీ నా ప్రాణం

ఫిబ్రవరి

రోహిణీ—వద్దంటే డబ్బు

మార్చి

గోకుల్—నిరుపేదలు
వాహినీ—పెద్దమనుషులు
భరణీ—చక్రపాణి

ఏప్రిల్

నేషనల్ ఆర్ట్—తోడుదొంగలు
ప్రకాశ్—బాలానందం
నవయుగ—జ్యోతి

మే

....

జూన్

మనోహరా—మనోహర
వి. ఏ. ఎస్.—రాజూ పేద

జూలై

ఎ. వి. ఎమ్.—సంఘం.

ఆగస్టు

శక్తి రాజా—అగ్గిరాముడు
సరసూ—రాజగురువు

సెప్టెంబరు

జనతా—పరివర్తన
విక్రమ్—మాగోపి

అక్టోబరు

ఆర్. ఎస్. ఆర్—జాతకఫలం
నాగూర్ సినీ—ఇద్దరుపెళ్లాలు
పరిమళా—ప్రజారాజ్యం
జంపన & నంది—మేనరికం
జయంతీ—బంగారుభూమి

నవంబరు

సాహిణీ—అమరసందేశం
సుబ్బి కర్నాటక—కాళహస్తి మహాత్మ్యం
యు. టి. ఏ. & శ్యామలా—పల్లెపడుచు

డిసెంబరు

భరణీ—విప్రనారాయణ
అశ్వరాజ్—అన్నదాత
శ్రీ రాజరాజేశ్వరీ—సతీ సక్కుబాయి.

మొత్తం 28 చిత్రాలు. వీటిలో 14 చిత్రాలు తెలుగులోనేకాక ఇతర భాషల్లో కూడా తయారైనవి. 10 చిత్రాలు ఆంధ్రేతరులచే నిర్మింపబడినవి.

వీటిలో "సాంఘిక" చిత్రాలు 18, "జానపద" చిత్రాలు 6, "భక్తి" కథాచిత్రాలు 3, "పిల్లల" చిత్రం 1 ఉన్నాయి.

ఆర్థిక విజయం చెప్పుకోదగినంతగా పొందినవని చెప్పబడే చిత్రాలు మనోహర, అగ్గిరాముడు, మేనరికం. వీటిలో అగ్గిరాముడు శత దినోత్సవాలు చేసుకున్నది. మనోహర తమిళం, తెలుగు, హిందీభాషల్లో తయారైనది. మూడు భాషాప్రాంతాల్లోనూ ఇది పెద్ద 'హిట్' అయినది. ఇది గడిచిన యేడాదికల్లా ఎక్కువగా డబ్బు సంపాదించిన చిత్రమట.

బాగా నష్టపడిన చిత్రాలు 10 దాకా ఉన్నాయి. మిగతావన్నీ ఫరవాలేదనిపించుకున్నాయి. మొత్తంమీద ఆర్థికంగా 1954 వ సంవత్సరం 1953 కంటే ఆశాజనకంగా ఉండడం సంతోషించవలసిన విషయం. చిత్రాలస్థాయి కూడా 1954 సం॥లో బాగా అభివృద్ధి అయిందనే చెప్పాలి.

నటులలో రేలంగి 9 చిత్రాల్లోనూ, ఎన్. టి. రామారావు, ఎస్. వి. రంగారావు 8 చిత్రాల్లోనూ, ఎ. నాగేశ్వరరావు 6 చిత్రాల్లోనూ, సి. ఎస్. ఆర్. 5 చిత్రాల్లోనూ నటించారు. ఆడతారలలో జమున 5 చిత్రాల్లోనూ, శ్రీరంజని, జి. వరలక్ష్మి, సావిత్రి 4 చిత్రాల్లోనూ, అంజలీదేవి, భానుమతి 3 చిత్రాల్లోనూ నటించారు. మొత్తంమీద పురుష తారల ప్రాబల్యమే ఎక్కువగా ఉన్నది.

రెండు చిత్రాలు విడుదల చేసినసంస్థ భరణీవారిది.

రెండేసి చిత్రాలకు దర్శకత్వం వహించిన డైరెక్టర్లు తాతినేని ప్రకాశరావు, రామకృష్ణగార్లు. ప్రసాద్‌గారు ఒక బాక్సాఫీస్ హిట్ తయారుచేసి, మరి రెండు చిత్రాలను పర్యవేక్షణ చేశారు.

కొత్తగా డైరెక్టరు హోదాలో పనిచేసినవారు చాణక్య, బి. ఎస్. రంగా, జంపన, ఆదుర్తి, బోళ్లసుబ్బారావు మున్నగువారు.

కొత్తగా సంభాషణల రచనకు దిగినవారు కొండేపూడి, డి. వి. నరసరాజు, పినిశెట్టి మున్నగువారు.

పేరుకు 18 సాంఘికచిత్రాలున్నప్పటికీ, సమకాలిక సాంఘిక వాతావరణాన్ని కొంతలో కొంత ప్రతిబింబిస్తూ, లక్ష్యశుద్ధి అంటూ కలిగిన చిత్రాలు 8 మాత్రమే ఉన్నాయి. మిగిలినవాటిలో కేవలం హాస్యమే ప్రధానంగా కలిగినవి రెండు చిత్రాలున్నాయి.

సమకాలికమైన కథ తీసుకుని జానపద ఛాయలలో నడిచిన సాంఘికచిత్రాలూ ఉన్నాయి; జానపద వాతావరణం తీసుకుని సమకాలిక విషయాలమీద వ్యాఖ్యానించిన జానపద చిత్రాలూ ఉన్నాయి. చక్కని సంగీతం అందించిన రెండు చిత్రాలు అమరసందేశం, విప్రనారాయణ. ప్రత్యేకంగా పిల్లలు పాల్గొని, పిల్లలకోసం తయారుచేయబడిన ఒకేఒకచిత్రం బాలానందం. సాహసించి కొత్తదారి తొక్కినందుకు ప్రకాశ్ ప్రొడక్షన్స్‌వారిని అభినందించాలి.

మరొక ముఖ్యవిషయం సంభాషణల స్థాయి ఇదివరలోకంటె అభివృద్ధి అయింది. కొండేపూడి, అనిశెట్టి, నరసరాజు, పినిశెట్టి, రావూరి, సముద్రాల రాఘవాచార్యులు మున్నగువారు, కొందరు పసనుగా, కొందరు చమత్కారం ఉట్టిపడేలాగ, మరికొందరు సాహిత్యసంస్కృతి ప్రతిబింబించేలాగ వ్రాశారు.

డైరెక్టర్లలో ప్రసాద్, కె. వి. రెడ్డిగార్లు పూర్వపుకీర్తికి తగిన చిత్రాలు తీశారు. ప్రసాద్‌గారు సాంఘికాలకు, రెడ్డిగారు సాంఘికేతరాలకు అలవాటుపడివున్నా వారి మనోహర, వీరి పెద్దమనుషులు మంచి ప్రమాణంలోవుండి ప్రజల ఆదరం చూరగొన్నవి. రామకృష్ణగారు విప్రనారాయణలో డైరెక్టరుగానూ, అంతకంటే ఎక్కువగా ఎడిటరుగానూ మంచిప్రావీణ్యం కనబరిచారు. వర్ధిష్ణులైన దర్శకులలో తాపి



"మిస్సమ్మ"లో రామారావు సావిత్రిని వరిస్తున్నాడు—తప్పు తప్పు—వివరిస్తున్నాడు.

★ తెలుగుచిత్రాల సింహావలోకనం ★

చాణక్య, ఆదుర్తి సుబ్బారావుగార్లను పేర్కొనాలి.


మగతారలలో నాగేశ్వరరావు, రామారావు తరవాత అమరనాథ్‌ను చెప్పాలి. అమరసందేశంలో ఆయన చాలా చక్కగా నటించి మెప్పుపొందాడు. కాని నటనా కౌశలాన్ని ఎప్పటికప్పుడు అభివృద్ధి చేసుకోవాలనే ప్రయత్నం కనబరిచిన నటులు రంగారావు, రేలంగి. పెద్దమనుషులు చిత్రం రేలంగికోసం, అన్నదాతచిత్రం రంగారావుకోసం జ్ఞాపకముంచుకోదగినవని చెప్పవచ్చు. స్త్రీ తారలలో భానుమతి అద్వితీయ నటి అనిపించుకున్నది. చక్రపాణి, అంతకంటె మిన్నగా విప్రనారాయణ ఆమె ప్రతిభకు తార్కాణాలు. అంజలీదేవి అన్నదాతలోనూ, సావిత్రి పతివ్రతలోనూ, జమున మాగోపిలోనూ మంచి నటన ప్రదర్శించారు.

గత సంవత్సరం జరిగిన మరొక విశేషం మూడు భక్తిచిత్రాలు తయారవడం. పౌరాణిక చిత్రాల పునరాగమనానికి ఇవి నాంది వాక్యాలు పలికాయి. ఈ ధోరణిని ఆంధ్రదేశం ఎంతవరకూ ఆదరిస్తుందో ముందుముందు చూడవలసివుంది.

సాంఘిక ప్రయోజనం పెట్టుకుని తీసిన 8 చిత్రాల్లోనూ శక్తివంతంగా ఉన్నవి రెండే రెండు. ఒకటి: అంతా మనవాళ్ళే; రెండు: పెద్దమనుషులు. మిగతావి ఆదర్శవాదంతోనూ, సర్వోదయ సిద్ధాంతాలతోనూ కూడివుండి పల్చబడినవి. వాస్తవ సమస్యలు ఆదర్శవాదంతో పరిష్కారం కావు. అసలు చలనచిత్రంలో ప్రతి సంఘ సమస్యా పరిష్కరింపబడాలన్న ప్రయత్నమే అనవసరం. ఆదర్శవాదంతో పరిష్కరింపబడినట్లు చూపేదాంకంటె సమస్యను యథాతథంగా చిత్రించడంలోనే ఎక్కువ ప్రయోజనం ఉన్నది. ఇటాలియన్ వాస్తవిక చిత్రాలన్నీ ఇలా తీసినవే. ఈ దృష్టితో చూస్తే గడచిన సంవత్సరపు చిత్రాల కథలన్నిటిలోకీ 'అంతా మనవాళ్ళే' కథావస్తువు ఎక్కడా నీళ్లు నమలకుండా, ఘాటుగా సాంఘికలోపాలను విమర్శించిందని చెప్పవచ్చు.

దేశంలో నిరుద్యోగం, దారిద్ర్యం ఎప్పటిలాగానే వున్నాయి. కాని వీటిని నిర్మూలించాలనే ప్రయత్నం సర్వతోముఖంగా జరుగుతోంది. ఈ ప్రయత్నం సామాన్య మానవుడిదాకా రాకుండా రాజకీయ వర్గాలమధ్యనే ఆగిపోతోంది. రాజకీయవర్గాలు అంతఃకలహాలలో మునిగి స్వార్థమే పరమార్థంగా వ్యవహరిస్తున్నాయి. దేశంలోని ఆర్థిక, సాంఘిక స్థితిగతులను సమూలంగా మార్చివేసే ప్రయత్నానికి ఎవరూ ముందుకు రావడంలేదు. అందుచేత ఏది పరిష్కారం కానట్లే కనిపిస్తోంది.

వినోదసాధనాలుగానూ, భావప్రచార



"అత్తయ్యా! వీరా - ంపుతున్నది, మీ కొడుకును కాదు! —సహనాన్ని' —కొడుకు దుర్మార్గాన్ని సహించలేక, తుపాకి గురిపెట్టిన అత్తగారిని అనునయించి, మరిదితో పరివర్తన తీసుకొస్తుంది పద్మ

"అర్ధాంగి"లో శాంతకుమారి, సావిత్రి, జగ్గయ్య



అశోక్ (మద్రాసు) లోకి త్వరలో రానున్న "శాద్యా" లో మాలా సిన్హా

శోధనాలుగానూ సాటిలేని చలనచిత్రాలు ఈ సమయంలో నిర్వహించవలసిన పాత్ర ఎంతైనా వున్నది ప్రజానీకానికి సాంఘిక, సాంస్కృతిక వికాసం, చైతన్యం కలిగించడంలో చిత్రనిర్మాతలు తమ బాధ్యతను నిర్వర్తించవలసివుంది

క్రొత్త సంవత్సరంలో తెలుగుచిత్రాలు ఇంకా ఉన్నత శిఖరాలు అందుకుంటాయని ఆశిద్దాము. ★

రంగూన్ రౌడీ

ఆంధ్రాభ్యుదయ నాటక కళాసమితివారు డిసెంబరు 26 వ తేదీనాడు, మద్రాసు సౌందర్య మహాలులో "రంగూన్ రౌడీ" నాటకం ప్రదర్శించారు రౌడీ శంకరరావుగా సామినేని నరసింహం, అన్నపూర్ణగా శ్రీమతి తిలకం, ఇంకా ఓ. సీత, రమాదేవి, శారద, బృందాచౌదరి మున్నగువారు నటించారు జయరాంగా పేకేటి శివరాం, గంగారాంగా సి. వి. రామన్ నటించారు. నాటకం ఆర్గనైజరు బి జ్వాలా నరసింహంగారు.

నాగయ్యగారి రామదాసు

నాగయ్యగారి దర్శకత్వాన సంకల్పించబడిన రామదాసుచిత్రానికి డిసెంబరు 12 వ తేదీన ఒక పాట, ఆపిమ్మట మరి మూడు పాటలు కూడా రికార్డు అయినట్లు తెలుస్తోంది. సంక్రాంతికి రేవతీ స్టూడియోలో సెట్సుమీదికి వెడతారని తెలుస్తోంది రామదాసు కథకు సంబంధించిన గోల్కొండ, భద్రాచలం మొదలైన చరిత్రాత్మక స్థలాలకు ఆర్టుడైరెక్టరును పంపి వాటి 'స్కెచెస్'ను



"మిస్సమ్మ"లో ఋష్యేంద్రమణి, రంగారావు.

తెప్పించి, వాటి నమూనాలో సెట్స్ నిర్మించాలని నాగయ్యగారు యోచిస్తున్నారు. నాగయ్య (రామదాసు) కన్నాంబ (రామదాసు భార్య) జంధ్యాల గౌరీనాథశాస్త్రి (కబీర్) పసల సూర్యచంద్రరావు (తానీషా) సూర్యకుమారి (తానీషా భార్య) రామశర్మ (యౌవనంలో రామదాసు) ఇంకా లింగమూర్తి, సి. ఎస్. ఆర్., గోవిందరాజుల సుబ్బారావు మున్నగువారు ఈ చిత్రంలో నటిస్తారట. కబీర్ హిందీ కీర్తనలు రెండు చేర్చబడతాయని తెలుస్తోంది. మాటలు పాటలు సముద్రాల రాఘవాచార్యులుగారు వ్రాస్తారు.

"మీర్జా ఘాలిబ్"

చరిత్రాత్మక చిత్రాలుతీయడంలో అగ్రగామి అయిన సొహ్రాబ్ మోడీ చారిత్రిక వ్యక్తి, ఉర్దూకవి అయిన మీర్జా ఘాలిబ్ కథ తీసుకుని చక్కని చిత్రం నిర్మించాడు. సొహ్రాబ్ మోడీ చిత్రం ఏది తీసుకున్నా ముందుగా కొట్టవచ్చినట్లు కనిపించేవి ప్రొడక్షన్ విలువలు. ఆయన భారీసెటింగులకు ఇచ్చినంత విలువ పాత్రచిత్రణానికిగాని, బలమైన సన్నివేశాలకుగాని ఇవ్వడని అనిపిస్తుంది. కాని ఈసారి మీర్జాఘాలిబ్ చిత్రంలోమాత్రం పాత్ర చిత్రణంలోనూ, సన్నివేశకల్పనలోనూ, వాతావరణ సృష్టిలోనూ నేర్పు కనబరచడమేకాక సంస్కృతిపై తనకు గల అభిరుచినికూడా వెల్లడి చేసుకొన్నాడు. గడచిన శతాబ్దపు ఢిల్లీ వాతావరణం, మొగల్ దర్బారుల వైభవం, ముషాయిరా సంప్రదాయాలు, మీర్జా ఘాలిబ్ కవితాప్రాశస్త్యం ఇవన్నీ ఈ చిత్రంలో బాగా చిత్రించబడ్డాయి. మీర్జా ఘాలిబ్‌గా భారత్‌భూషణ్ మూర్తీభవించిన కవిత్వంలాగ నటించాడు. సురయ్యా పాడిన ఘజల్ పాటలు మళ్లీ మళ్లీ వినాలనిపిస్తాయి. సంభాషణలు సాహిత్యరీత్యా ఉత్తమస్థాయిలో ఉన్నాయని ఉర్దూ తెలిసినవారు చెబుతున్నారు. చెత్త చిత్రాలే అధికంగా తయారయే హిందీ సినిమారంగంమీద ఈ చిత్రం తిరిగి గౌరవం కలిగిస్తుంది. ★

★ ప్రేక్షకుల అభిప్రాయాలు ★

"అన్నదాత"

బంగారయ్యగా నాగేశ్వరరావు ఉత్తమంగా నటించాడు. చివరి ఘట్టాల్లో నటన చాల బాగుంది. శాంతగా అంజలి నటన ప్రశంసనీయం. 'నాటకాల నాయుడు'గా రంగారావు చిత్రానికి మెఱుగులు దిద్దాడు. 'సావిత్రి' నాటకం ఆకర్షణీయంగా ఉంది. పరమసాధువైన బంగారయ్య పాత్ర చివరికి ఉద్రేకపూరితమై కర్రసాములోకి దిగింది. కథని మరి కొద్ది మార్పులు చేయాల్సింది!

ఎం. హెచ్. ప్రసాద్
—చీరాల.

ప్రేక్షకుల అభిప్రాయాలు

చిత్రం చాల రసవత్తరంగా ఉంది. నటీనటులందరూ చక్కగానే నటించారు. యముడుగా రంగారావు ప్రశంసార్హంగా నటించి గగ్గయ్యను మించాడు. సావిత్రి అంతర్నాటకము సెట్టింగులు అద్భుతంగా ఉన్నాయి. మాటలు వాడిగా, పాటలు రమ్యంగా ఉన్నాయి. ఆదినారాయణరావు సంగీతం హాయిగొల్పింది. వేదాంతంవారి దర్శకత్వం కొత్త పోకడలు పోయింది. చిత్రంలో నవరసాలు చొప్పించి ప్రేక్షకుల మెప్పు పొందిన అశ్వరాజ్ ప్రొడక్షన్స్ వారికి నా అభినందనాలు

వట్లూరు రాజేశ్వరరావు
—కిర్లంపూడి.

* * *

"అన్నదాత" ప్రజల్ని బాగా ఆకర్షించింది అనటంలో సందేహం లేదు పిక్చర్ పొడుగు ఎక్కువైంది 17 వేలకంటె ఎక్కువ నిడివి కలిగివుండాలని నిశ్చయించుకున్నారేమో, దానికి తగినట్లుగా కథను కూడ పెంచినట్లు కనిపిస్తుంది "సతీ-సావిత్రి" అంతర్నాటకం చిత్రానికి మెరుగునిచ్చింది ప్రస్తుతం నడుస్తున్న చిత్రాలన్నిటికంటె 'అన్నదాత' బాగుగా ఉన్నదనే చెప్పాలి

డి. హేమచంద్రప్రసాద్
—బందరు.

* * *

ఈ చిత్రం అనుకున్నంత బాగాలేదు కథలో ఏమాత్రం పట్టులేదు అందువల్ల చిత్రమంతా అతుకులబొంతగా తయారైంది రంగబాబు హఠాత్తుగా జమీందారవుతాడు; నాయుడు ఉయ్యాల్లో పిల్లల్ని మారుస్తాడు; అందరూ అపహాస్యం చేసుకుంటున్న కురూపిపిల్ల లీలతో రంగబాబు ప్రణయం సాగిస్తాడు, కల్యాణి అసలు పెళ్లే చేసుకోనంటుంది — యీమాదిరిగా కథ నడిచింది. ఇందులో చెప్పుకోదగ్గది - 'సావిత్రి' అంతర్నాటకం. రంగారావు యమధర్మరాజుగా 'యమా'గా సరిపోయాడు. కాటకాలనాయుడుగా, సర్వమంత్రిగా రంగారావు తన పాత్రను బాగా పోషించాడు. కత్తిదెబ్బ తినికూడా డైనమెట్ ప్రేలకుండా చేసినతర్వాత బంగారయ్య చచ్చిపోతాడనుకుంటారు ప్రేక్షకులు. కాని అంత పెద్దదెబ్బలు తిన్నప్పటికీ బంగారయ్య, మస్తానయ్య బ్రతికి ఆఖరి సీనులో కనబడతారు. ఇది చాలా అసందర్భంగా ఉన్నది.

కొండముది దత్తు—అప్పికట్ల.

* * *



భానుమతి

అశ్వరాజ్ వారి 'అన్నదాత' బాగుంది. కాని ఉన్నతస్థాయిని అందుకోలేకపోయినది చిత్రము నిడివి 17 వేలు అనవసరము 2, 3 వేల అడుగులు తగ్గించినా నష్టం లేదు చిత్రం సగము వఱకూ కథ నడవలేదు సగమునుంచి బాగా వున్నది

వి. సూర్యనారాయణ
—కాకినాడ


* * *

నటీనటుల్లో అంజలి, నాగేశ్వరరావు గార్లు అద్భుతంగా నటించారు శౌర్యమూ, కామయ్య నాయుణ్ణి ఒక గదిలో జూచినప్పటి భర్త బంగారయ్యగా నాగేశ్వరరావుగారి నటన మరువ శక్యము గాకుండా ఉత్తమంగా ఉంది. రంగారావు అసలు చిత్రములోకంటె "సావిత్రి" అంతర్నాటకములో యమునిగానే చక్కగా రాణించాడు. రంగారావు డైలాగ్సు చెప్పటంలో కొంచెము స్పీడు తగ్గించిన బాగుండేది. అమ్మాజీ రాజా-పేదలోలాగ రాణించలేదు. ఆమెకంటె జూనియర్ కాంతకుమారి చక్కగా రాణించింది. చలం మొదలగు యితర నటీనటులు తమ తమ పాత్రలను బాగుగా పోషించారు. ఆదినారాయణరావుగారి సంగీతం వీనులకింపుగా వుంది. పాటలు కూడ చక్కగా రాణించాయి.

దొప్పలపూడి వేంకటసుబ్బారావు—తిమ్మాపురం.

★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St Madras.



అమర్‌నాథ్ దోవలో 12000 అ. ఎత్తున శేష్‌నాగు జలాశయం

—ఫొటోలు ఆర్. బుచ్చి వీరయ్య, సికిందరాబాదు

అమర్‌నాథ్ దోవలో మంచు వంతెన

